ఈనాడు
శనివారం జనవరి 31, 2026

# ఇలా పరీక్ష పూర్తి.. అవిగో మార్కులు!

- ఎప్‌సెట్, పీజీఈసెట్‌లో ఈసారి వినూత్న మార్పులు

ఈనాడు, హైదరాబాద్: ఎప్‌సెట్, పీజీఈసెట్ అంటే రాష్ట్రంలోని లక్షలమంది విద్యార్థుల జీవితాల్లో కీలకమైన పరీక్షలు. దరఖాస్తు చేసుకుంది మొదలు ఫలితాలు వచ్చేవరకు రోజులు, నెలలు ఉత్కంఠగా ఎదురు చూస్తుంటారు. కానీ ఇకపై ఆ పరిస్థితి ఉండదు. ఈ ఏడాది నుంచి పలు విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టనుండటంతో పరీక్ష పూర్తవగానే విద్యార్థులు అప్పటికప్పుడే ఎన్ని మార్కులు వచ్చాయో తెలుసుకోవచ్చు. ఎంత ర్యాంకు వస్తుందో అంచనాకు రావొచ్చు. ఈ ఏడాది నుంచే ఈ విధానం అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. జేఎన్‌టీయూ-హెచ్‌లో శుక్రవారం జరిగిన ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్) కమిటీ ...మిగతా 2లో

# ఇలా పరీక్ష పూర్తి.. అవిగో మార్కులు!

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాల్లో చర్చించి పలు వినూత్న సంస్కరణల అమలుకు ఆమోదం తెలిపారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)గా పిలిచే ఆన్‌లైన్ పరీక్ష సమయం ముగియగానే విద్యార్థి ఏమీ చేయకుండానే కంప్యూటర్ ఆగిపోతుంది. తెరపై పరీక్ష ప్రశ్నాపత్రం కనిపించదు. సబ్జెక్టుల వారీగా ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించారు.. ప్రాథమిక కీ ఆధారంగా మొత్తం ఎన్ని మార్కులు వచ్చాయో.. కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. తుది ర్యాంకు మాత్రం చివరి కీతోపాటు పలు విడతలుగా ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతున్నందున నార్మలైజేషన్ విధానాన్ని అమలు చేసి వెల్లడిస్తారు.

## మరికొన్ని నిర్ణయాలు...

◆ ఎప్‌సెట్, పీజీఈసెట్‌కు ల్యాప్‌టాప్, కంప్యూటర్ల ద్వారానే దరఖాస్తు చేసుకునే విధానం ఉండేది. ఈసారి స్మార్ట్‌ఫోన్ల నుంచి కూడా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని నిర్ణయించారు. అందుకోసం మొబైల్ ఫ్రెండ్లీ యాప్ రూపొందిస్తున్నారు.

◆ ఇప్పటివరకు అధికారికంగా గత ఏడాది ఫలితాల ఆధారంగా ఎన్ని మార్కులకు ఎంత ర్యాంకు వస్తుందో వెల్లడించడం లేదు. ఈసారి విద్యార్థులు ఒక అంచనాకు వచ్చేందుకు ఎన్ని మార్కులకు ఎంత ర్యాంకు వస్తుందో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. మాక్ టెస్టులు, గత ప్రశ్నపత్రాలను సాధించినప్పుడు వచ్చిన మార్కుల ఆధారంగా తమ ర్యాంకు ఎంత ఉండవచ్చో విద్యార్థులు, తల్లిదండ్రులు తెలుసుకోవచ్చు.

◆ గతంలో రూ.10 వేల ఆలస్య రుసుంతో పరీక్షకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. కొద్ది సంవత్సరాల క్రితం తొలగించారు. ఈసారి దాన్ని మళ్లీ అందుబాటులోకి తీసుకురానున్నారు. పరీక్షలు ప్రారంభించే రెండు రోజుల ముందు వరకు రూ.10 వేల రుసుంతో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తారు. రూ.2,500 నుంచి రూ.10 వేల ఆలస్య రుసుంతో దరఖాస్తు చేసుకునే వారు హైదరాబాద్‌లోనే పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

### విద్యార్థుల ప్రయోజనార్థమే..

సెట్ కమిటీ సమావేశంలో సమగ్రంగా చర్చించి విద్యార్థులకు సౌకర్యవంతంగా, ప్రయోజనకరంగా ఉండేలా పలు నిర్ణయాలు తీసుకున్నాం. పరీక్ష ముగిసిన వెంటనే స్కోర్ తెలుసుకునే విధానం జీమ్యాట్, జీఆర్‌ఈ, బిట్‌శాట్‌లలో ఉంది. ఎన్ని మార్కులకు ఎంత ర్యాంకు వస్తుందో ఒక అంచనా ఏర్పడటంతో విద్యార్థులు ఫలితాల వరకు ఆగకుండానే తమ భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించుకుంటారు.

**- ఆచార్య కె.విజయకుమార్‌రెడ్డి, కన్వీనర్, ఎప్‌సెట్**

# 19 నుంచి ఎప్‌సెట్ దరఖాస్తులు

## సెట్ కమిటీ సమావేశాల్లో షెడ్యూల్ ఖరారు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని బీటెక్, బీఫార్మసీతోపాటు బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి ఈఏపీసెట్ (ఎప్‌సెట్)కు దరఖాస్తుల స్వీకరణ ఫిబ్రవరి 19వ తేదీన ప్రారంభం కానుంది. ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పీజీఈసెట్‌కు ఫిబ్రవరి 27 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలవుతుంది. ఎప్‌సెట్‌తోపాటు పీజీఈసెట్ తొలి కమిటీ సమావేశాలు శుక్రవారం జేఎన్‌టీయూ-హెచ్‌లో నిర్వహించారు. జేఎన్‌టీయూ-హెచ్ ఇన్‌ఛార్జి వీసీ టీకేకే రెడ్డి, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, విద్యామండలి ఉపాధ్యక్షులు పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేష్, కన్వీనర్ ఆచార్య కె.విజయకుమార్‌రెడ్డి, పీజీఈసెట్ కన్వీనర్ ఆచార్య కె.వెంకటేశ్వర్‌రావు, ఎప్‌సెట్ కో కన్వీనర్ బాలూనాయక్, పీజీఈసెట్ కో కన్వీనర్ టి.శ్రీకాంత్ తదితరులు పాల్గొని దరఖాస్తుల షెడ్యూల్‌ను ఖరారు చేశారు. దరఖాస్తు ఫీజు గత ఏడాది మాదిరిగా ఉంటుందని, పూర్తి వివరాలు నోటిఫికేషన్‌లో పొందుపరుస్తామని అధికారులు తెలిపారు.

### పూర్తి షెడ్యూల్

| విషయం | ఎప్‌సెట్ | పీజీఈసెట్ |
|---|---|---|
| నోటిఫికేషన్ విడుదల | ఫిబ్రవరి 14 | ఫిబ్రవరి 23 |
| దరఖాస్తులు ప్రారంభం | ఫిబ్రవరి 19 | ఫిబ్రవరి 27 |
| ఆలస్య రుసుం లేకుండా గడువు | ఏప్రిల్ 4 | మే 6 |
| పరీక్ష తేదీలు అగ్రికల్చర్ | మే 4, 5 | మే 28- 31 వరకు |
| ఇంజినీరింగ్ | మే 9-11 | |

ప్రభాత
వెలుగు
శనివారం | హైదరాబాద్
31.01.2026
www.v6velugu.com

# ఎగ్జామ్ పూర్తయిన వెంటనే మార్కులు డిస్‌ప్లే

- అప్పటికప్పుడు 'టెంపరరీ ర్యాంకులు' కూడా తెలుసుకోవచ్చు
- ఎప్ సెట్, పీజీ ఈసెట్‌లో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని నిర్ణయం
- ఈసారి మొబైల్ నుంచే ఈజీగా అప్లికేషన్‌కు అవకాశం
- రూ.10 వేల ఫైన్‌తో పరీక్షకు రెండ్రోజుల ముందు వరకు అప్లై చేసుకునేందుకు చాన్స్



**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో నిర్వహించే వివిధ కోర్సుల ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ విధానంలో కీలక మార్పులకు రంగం సిద్ధమైంది. ఎగ్జామ్స్ రిజల్ట్ కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా.. ఎగ్జామ్ పూర్తయిన వెంటనే మార్కులు తెలుసుకునేలా మార్పులు తీసుకొస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించిన టీజీ ఎప్‌సెట్, పీజీ ఈసెట్ పరీక్షల్లో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. సాధారణంగా ఆన్‌లైన్ ఎగ్జామ్ పూర్తయిన వెంటనే అభ్యర్థులు 'సబ్మిట్'బటన్ నొక్కగానే థాంక్యూ అని వస్తోంది. కానీ, కొత్త విధానం అమలు అయితే, విద్యార్థికి ఎన్ని మార్కులు వచ్చాయనేది కూడా స్క్రీన్‌పై డిస్‌ప్లే కానున్నది. కేవలం టోటల్ మార్కులే కాకుండా.. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఇలా సబ్జెక్టుల వారీగా ఎన్ని మార్కులు వచ్చాయో క్లియర్‌గా చూపించనున్నారు. దీంతో పాటు ఆ సెషన్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా గతేడాది ర్యాంకులకు అనుగుణంగా 'టెంపరరీ ర్యాంకు'ను కూడా వెల్లడించేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ నిర్ణయంతో అభ్యర్థులకు తమ పర్ఫార్మెన్స్‌పై వెంటనే ఒక అంచనా వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు.

**మొబైల్ నుంచే అప్లికేషన్..**

జవహర్‌లాల్ నెహ్రూ జేఎన్టీయూహెచ్ నిర్వహించే పీజీ ఎప్ సెట్, పీజీఈసెట్ ఎగ్జామ్స్ నిర్వహణలో టెక్నాలజీని మరింత వాడుకోనున్నారు. ఇప్పటివరకూ కంప్యూటర్, లాప్ ట్యాప్ ద్వారా మాత్రమే అప్లై చేసుకునే అవకాశం ఉండేది. కానీ, ఈ సారి నుంచి అభ్యర్థులు స్మార్ట్ ఫోన్ల నుంచే సులభంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. నెట్ సెంటర్ల చుట్టూ తిరిగే పనిలేకుండా, యూజర్ ఫ్రెండ్లీగా ఉండేలా మొబైల్ అప్లికేషన్ ప్రాసెస్‌ను డిజైన్ చేసినట్టు అధికారులు చెప్పారు.

**2 రోజుల ముందు వరకూ చాన్స్..**

వివిధ కారణాలతో సకాలంలో దరఖాస్తు చేసుకోలేకపోయిన అభ్యర్థులకు చివరి చాన్స్ ఇవ్వనున్నారు. ఈసారి పరీక్షలు ప్రారంభమయ్యే చివరి రెండ్రోజుల ముందు వరకు అప్లై చేసుకునే అవకాశం కల్పించినట్టు టీజీ ఎప్ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. అయితే, రూ.పది వేల లేట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ కేటగిరీలో అప్లై చేసిన వారికి వారి సొంత జిల్లాల్లో కాకుండా గ్రేటర్ హైదరాబాద్‌లోని పరీక్షా కేంద్రాలను మాత్రమే కేటాయించనున్నట్టు చెప్పారు.

# మే 31 నుంచి పీఈసెట్ ఈవెంట్స్

**షెడ్యూల్ రిలీజ్ చేసిన టీజీసీహెచ్ఈ**

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే 'టీజీ పీఈసెట్-2026' షెడ్యూల్ విడుదలైంది. అభ్యర్థులకు ఫిజికల్ ఎఫిషియెన్సీ, స్కిల్ టెస్టులను మే 31 నుంచి జూన్ 3 వరకు నిర్వహించనున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఆఫీసులో టీజీసీహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అధ్యక్షతన కమిటీ భేటీ జరిగింది. ఈ సందర్భంగా శాతవాహన వర్సిటీ వీసీ ఉమేశ్ కుమార్‌తో కలిసి ఆయన షెడ్యూల్ రిలీజ్ చేశారు. ఫిబ్రవరి 25న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు చెప్పారు. మార్చి 2 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం అవుతుండగా, లేట్ ఫీజు లేకుండా మే 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్ వివరించారు. లేట్ ఫీజుతో మే 20 వరకు అప్లికేషన్లకు అవకాశం కల్పించారు.

# ఫిబ్రవరి 19 నుంచి టీజీఎప్ సెట్ దరఖాస్తులు

- మే 4 నుంచి అగ్రి, 9 నుంచి ఇంజనీరింగ్ ఎగ్జామ్స్
- షెడ్యూల్ రిలీజ్ చేసిన టీజీసీహెచ్ఈ



**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ సీట్ల భర్తీకి నిర్వహించే 'టీజీఎప్ సెట్-2026' షెడ్యూల్ రిలీజ్ అయింది. ఫిబ్రవరి 14న నోటిఫికేషన్ రిలీజ్ చేయనున్నట్టు అధికారులు ప్రకటించారు. శుక్రవారం జేఎన్టీయూహెచ్‌లో హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (టీజీసీహెచ్) చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అధ్యక్షతన ఈఏపీ సెట్ కమిటీ సమావేశమైంది. దీనిలో షెడ్యూల్, దరఖాస్తుల ప్రక్రియతో పాటు కొత్త రిఫామ్స్ పై చర్చించారు. అనంతరం వర్సిటీ వీసీ కిషన్ కుమార్ రెడ్డి, కన్వీనర్ విజయకుమార్ రెడ్డితో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. ఫిబ్రవరి 19వ తేదీ నుంచి ఆన్‌లైన్ అప్లికేషన్లు స్వీకరిస్తారు. లేట్ ఫీజు లేకుండా ఏప్రిల్ 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి చాన్స్ ఉంది. ఈసారి ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ సిలబస్ మొత్తం ఉంటుందని అధికారులు క్లారిటీ ఇచ్చారు. మే నెలలో రెండు విడతలుగా ఎగ్జామ్స్ జరగనున్నాయి. ముందుగా అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షలను మే 4, 5 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు మే 9 నుంచి 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఎగ్జామ్స్ జరుగుతాయి. సమావేశంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, సెక్రటరీ శ్రీరామ్ వెంకటేశ్, జేఎన్టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**వచ్చే నెల 23న పీజీఈసెట్ నోటిఫికేషన్**

ఎంటెక్, ఎంఫార్మసీ వంటి పీజీ కోర్సుల్లో చేరేవారి కోసం నిర్వహించే 'టీజీ పీజీఈసెట్-2026' నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 23న రిలీజ్ చేయనున్నారు. జేఎన్టీయూహెచ్ లో టీజీసీహెచ్ఈ చైర్మన్ బాలకిష్టారెడ్డి అధ్యక్షతన పీజీఈసెట్ కమిటీ సమావేశమైది. ఈ సందర్భంగా షెడ్యూల్ ను రిలీజ్ చేశారు. ఫిబ్రవరి 27 నుంచి ఆన్ లైన్ అప్లికేషన్ల ప్రక్రియ మొదలవుతుందని, మే 6 వరకూ ఎలాంటి ఫైన్ లేకుండా అప్లై చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. గేట్, జీప్యాట్ క్వాలిఫై అయిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, మిగిలిన సీట్లను పీజీఈసెట్ ర్యాంకు ద్వారా భర్తీ చేస్తామని వివరించారు.

# పరీక్ష రాసిన వెంటనే మార్కులు

## ఈఏపీ సెట్‌లో కీలక మార్పులు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశపరీక్ష (ఈఏపీసెట్)ను ఈసారి భిన్నంగా నిర్వహించనున్నారు. ఉమ్మడి ప్రవేశపరీక్ష నిర్వహణ కమిటీ శుక్రవారం జేఎన్‌టీయూహెచ్‌లో సమావేశమైంది. ఈ భేటీలో సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కె విజయకుమార్‌రెడ్డి, కో కన్వీనర్ ప్రొఫెసర్ బాలూనాయక్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి పాల్గొన్నారు. ఏటా ఈఏపీసెట్ నిర్వహించిన తర్వాత ప్రాథమిక 'కీ' విడుదల చేసి దాని పై విద్యార్థుల ' అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాక ఫైనల్ కీ, ఆ తర్వాత ఫలితాలు ప్రకటిస్తున్నారు.

**ఈఏపీసెట్‌కు సంబంధించిన ముఖ్యమైన తేదీలు**

| | |
|---|---|
| 14-2-2026 | : సెట్ నోటిఫికేషన్ విడుదల |
| 19-2-2026 | : ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ |
| 4-4-2026 | : దరఖాస్తుల తుది గడువు |
| 4, 5-05-2026 | : అగ్రి, ఫార్మా పరీక్ష |
| 9-11-05-2026 | : ఇంజనీరింగ్ పరీక్ష |

ఈసారి విద్యార్థి ఆన్‌లైన్ పరీక్ష రాసిన వెంటనే మార్కులను కంప్యూటర్ తెరపైనే కనిపించేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. దీనివల్ల విద్యార్థికి ఎన్ని మార్కులు వచ్చాయి? ఎంత ర్యాంకు వస్తుందనేది పరీక్ష రాసిన విద్యార్థులకు వెంటనే తెలిసిపోయే అవకాశం ఉంటుంది. అయితే తుది ర్యాంకు, మార్కులను మాత్రం నిపుణులు పరిశీలించాకే విడుదల చేస్తారు. సెట్‌లో ఈసారి మరో మార్పు చేశారు. ఈ ఏడాది నుంచి మొబైల్ సాయంతోనూ దరఖాస్తు సమర్పించే వీలు కల్పిస్తున్నారు.

వార్త, హైదరాబాద్, శనివారం 31, జనవరి 2026

## మార్చి 2 నుంచి పిఇసెట్-2026

# దరఖాస్తుల స్వీకరణ

### ఫిబ్రవరి 25న నోటిఫికేషన్ జారీ.. మే 31 నుంచి జూన్ 3 వరకు .. ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాత వార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి బిపిఈడీ, ఎంపి ఈడీ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన (పిఈ) సెట్-2026కి సంబంధించిన దరఖాస్తులను మార్చి 2 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిషికేషన్‌ను ఫిబ్రవరి 25న జారీ చేయనున్నట్టు పిఈ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ రాజేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిఈ సెట్-2026 కమిటీ మొదటి సమావేశం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. కమిటీ సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ యు ఉమేష్ కుమార్, ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తో పాటు కన్వీనర్ ప్రొఫెసర్ రాజేష్ కుమార్ పాల్గొన్నారు. పిఈ సెట్-2026 పరీక్షను శాత వాహన యూని వర్సిటీ నిర్వ హించనుంది. మొదటి కమిటీ సమావేశం అనంతరం పిఈ సెట్-2026 షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 25న నోటిఫికేషన్‌ను జారీ చేయను న్నారు. మార్చి 2 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించ నున్నారు. మే 5 వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నారు. అపరాధ రుసుంతో మే 20 వరకు స్వీకరించనున్నట్లు కన్వీనర్ తెలిపారు. మే 31 నుంచి జూన్ 3 వరకు అభ్యర్థులకు ఫిజికల్ ఎఫిషియన్సీ అండ్ స్కిల్ టెస్ట్‌లను నిర్వహించనున్నారు.

## 27 నుంచి పిజి ఇసెట్-2026

# దరఖాస్తుల స్వీకరణ

### 23న నోటిఫికేషన్ జారీ

### మే 28 నుంచి 31 వరకు పరీక్షలు

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి పిజి కోర్సుల్లో చేరేం దుకు నిర్వహించే పిజి ఈ సెట్-2026కి సంబంధించిన దరఖాస్తులను ఫిబ్రవరి 27 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిషికేషన్‌ను ఫిబ్రవరి 23నన జారీ చేయనున్నట్టు పిజి ఈ సెట్-2026 కన్వీనర్ డాక్టర్ కె వెంకటేశ్వర రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజి ఈ సెట్-2026 కమిటీ మొదటి సమావేశం శుక్రవారం కూకట్‌పల్లిలోని జేఎన్‌టియు క్యాంపస్‌లోని వీసీ కార్యాలయంలో జరిగింది. కమిటీ సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, జేఎన్‌టియు వీసీ ప్రొఫెసర్ టి కిషన్ కుమార్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తోపాటు కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ కె వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ ప్రొఫెసర్ టి సీకాంత్ పాల్గొన్నారు. పిజి ఈ సెట్-2026 పరీక్షలను జేఎన్‌టియు నిర్వహించ నుంది. మొదటి కమిటీ సమావేశం అనంతరం పిజి ఈ సెట్-2026 షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 23న నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. ఫిబ్రవరి 27 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించను న్నారు. మే 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. పరీక్షలను మే 28 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు.

# 19 నుంచి ఎప్‌సెట్-2026 దరఖాస్తుల స్వీకరణ

### 14న నోటిఫికేషన్ జారీ.. మే 4, 5 తేదీల్లో అగ్రికల్చర్, 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు

### ఎప్‌సెట్ కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఇఏపి(ఎప్) సెట్-2026కి సంబంధించిన దరఖాస్తు లను ఫిబ్రవరి 19 నుంచి ఆన్ లైన్‌లో స్వీకరించనున్నారు. ఇందుకు సంబం ధించిన నోటిషికేషన్‌ను ఫిబ్రవరి 14న జారీ చేయ నున్నట్టు ఎప్ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ కె విజయకుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎప్ సెట్-2026 కమిటీ మొదటి సమావేశం శుక్రరం కూకట్‌పల్లిలోని జేఎన్ టియు క్యాంపస్‌లోని వీసీ కార్యాలయంలో జరిగింది. మొదటి కమిటీ సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, జేఎన్ టియు వీసీ ప్రొఫెసర్ టి కిషన్ కుమార్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తోపాటు కన్వీనర్ ప్రొఫెసర్ కె విజయ్‌కుమార్ రెడ్డి, కో కన్వీనర్ ప్రొఫెసర్ బాలు నాయక్ పాల్గొన్నారు.

ఎప్ సెట్-2026 పరీక్షను జేఎన్‌టియు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మొదటి కమిటీ సమావేశం అనంతరం ఎప్ సెట్-2026 షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 14న నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. ఫిబ్రవరి 19 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించ నున్నారు. ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అగ్రికల్చర్ పరీక్షలను మే 4, 5 తేదీల్లో నిర్వహించ నుండగా.. మే 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలను నిర్వహిస్తారు. ఇంటర్మీడియట్ పూర్తి సిలబస్ నుంచి ఎప్ సెట్‌లో ప్రశ్నలు వస్తాయని స్పష్టం చేశారు.

## TG EAPCET 2026 schedule for professional courses declared

HYDERABAD: The Jawaharlal Nehru Technological University Hyderabad in association with the Telangana Council for Higher Education announced the schedule for the Telangana EAPCET 2026 examinations on Friday. The timeline was finalised during a committee meeting chaired by JNTUH Vice Chancellor Kishen Kumar Reddy alongside senior council officials including Convener Vijaya Kumar Reddy and Co-Convener Balu Naik. The committee clarified that the examination will cover 100 per cent of the first and second year intermediate syllabus. This entrance test is a prerequisite for aspirants seeking admission into engineering, agriculture, and pharmacy courses across the state for the upcoming academic year. Convener Vijaya Kumar Reddy advised both candidates and parents to regularly monitor the official website for comprehensive details and technical instructions.

According to the notified schedule, the official notification will be published in newspapers on 14 February 2026. The online application process is set to commence on 19 February 2026. Aspiring students must submit their forms by 4 April 2026 to avoid late fees. The Agriculture and Pharmacy examinations are scheduled for 4 and 5 May 2026, while the Engineering stream tests will take place between 9 and 11 May 2026.

## Govt announces schedule for Physical Education Common Entrance Test 2026

HYDERABAD: The Satavahana University Karimnagar under the supervision of the Telangana Council of Higher Education announced the schedule for the Telangana Physical Education Common Entrance Test 2026 on Friday. This entrance test facilitates admissions into two year BPEd and DPEd courses for the 2026 to 2027 academic year. The decision followed a committee meeting attended by Vice Chancellor Umesh Kumar and Convener Rajesh Kumar where eligibility criteria and examination schemes were finalised. According to the approved schedule the official notification will be issued on 25 February 2026. Aspiring candidates can commence their online applications from 2 March 2026. The deadline for submission without a late fee is set for 5 May 2026 while applications with late fee slabs will be accepted until 20 May 2026. The physical efficiency and skill tests are scheduled to take place from 31 May to 3 June 2026. Convener Rajesh Kumar stated that further updates would be available on the official council website from late February. This announcement marks a crucial step for thousands of students across the state seeking professional qualifications in physical education and sports sciences.

# TG PGECET 2026 schedule for postgraduate engineering announced

HANS NEWS SERVICE
HYDERABAD

THE Jawaharlal Nehru Technological University Hyderabad in association with the Telangana Council for Higher Education officially announced the schedule for the Telangana PGECET 2026 examinations on Friday. The announcement followed a committee meeting chaired by JNTUH Vice Chancellor Kishen Kumar Reddy and Council Chairman Balakista Reddy. Senior officials including Purushotham, Mahmood, Sriram Venkatesh, and Convener Venkateswara Rao attended the session to finalise the academic timeline.

Convener Venkateswara Rao emphasised that this entrance test is vital for postgraduate engineering admissions across the state.

The official notification will appear in newspapers on 23 February 2026. Aspiring students can begin submitting online applications from 27 February 2026. The final deadline for submissions without incurring a late fee is 6 May 2026. The entrance examinations are scheduled to take place from 28 May to 31 May 2026.

This schedule marks the start of the preparation period for thousands of engineering graduates seeking advanced professional degrees.

THE HINDU
Telangana
Saturday, January 31, 2026
HYDERABAD

# Telangana EAPCET 2026 to be held from May 4

The Telangana Engineering, Agriculture & Pharmacy Common Entrance Test (EAPCET) 2026 will start from May 4. The test for Agriculture and Pharmacy will be held on May 4 and 5, and test for Engineering will be from May 9 to 11. The announcement was made by the Telangana Council of Higher Education (TGCHE) and Jawaharlal Nehru Technological University - Hyderabad, the exam conducting authority. The schedule was deliberated in a CET committee, the first meeting held on Friday. The dates were approved by all the committee members. Candidates can start submitting their applications online from February 19, and the last date to submit applications, without any late fee, is April 4. The syllabus for the EAPCET will be wholly the syllabus of Intermediate First and Second years.




# TGCHE urges industry-academia collaboration under US-India TRUST

- Prof V Balakista Reddy calls for stronger industry-academia collaboration under US-India TRUST
- TGCHE reforms include curriculum revision and MoUs with NASSCOM and BDMA for industrial training
- US Consul General Laura Williams emphasises meaningful partnerships to strengthen academic and industry ties

HANS NEWS SERVICE
HYDERABAD

PROF V Balakista Reddy, Chairman of the Telangana Council of Higher Education (TGCHE), has called for deeper industry-academia collaboration under the US-India TRUST initiative, emphasising the need to harness mutual benefits in the wake of internationalisation of higher education.

He was speaking at a panel discussion during a one-day conference on 'Leveraging US-India TRUST,' organised jointly by the US Consulate in Hyderabad and the World Trade Centre, Shamshabad, on Thursday. The conference focused on partnerships in Artificial Intelligence (AI) and Cybersecurity.

Prof Reddy highlighted that the TGCHE has initiated transformative reforms in the higher education ecosystem over the past two years. He cited curriculum revisions and Memorandums of Understanding signed with NASSCOM and BDMA to provide industrial training for students in Telangana. He stressed that continuous learning and skill development are essential to meet global demands in science and technology, particularly given India's demographic dividend.

He urged global industries to tap opportunities in Telangana, which hosts a large number of technical institutions capable of catering to international markets. Prof. Reddy added that growing collaboration between India and the US offers scope for establishing networks between universities in Telangana and the US, facilitating industry-academia tie-ups in AI and cybersecurity under the Indo-US 2025 TRUST framework.

The Chairman was felicitated by Laura Williams, Consul General of the US Consulate in Hyderabad. In her inaugural address, Williams called for meaningful partnerships that would deepen collaborations, strengthen academic ties, and promote the sharing of best practices to overcome hurdles in industry-academia cooperation.

Prof. Reddy reaffirmed TGCHE's commitment to affordable, accessible, and quality higher education, while encouraging global partnerships to drive innovation and skill development.

## వచ్చేనెల 27నుంచి పీజీ ఈసెట్‌కు దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పోస్ట్ గ్రాడ్యుయేటెడ్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీ ఈసెట్-2026కు ఫిబ్రవరి 27నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని సెట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌రావు ప్రకటించారు. శుక్రవారం జేఎన్‌టీయూలో సెట్ కమిటీ సమావేశం అనంతరం ఆయన షెడ్యూలును విడుదల చేశారు. ఆలస్య రుసుము లేకుండా మే 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని, అదే నెల 28 నుంచి 31వరకు పరీక్షలు నిర్వహిస్తామని కన్వీనర్ వెల్లడించారు.

## టీజీ ఈఏపీసెట్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ వంటి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్‌తో పాటు ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రకటించింది. శుక్రవారం జేఎన్‌టీయూలో ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు మే 4, 5 తేదీల్లో.. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష మే 9 నుంచి 11 వరకు జరగనున్నాయి. ఫిబ్రవరి 19 నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుందని ఎప్‌సెట్ కన్వీనర్ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. అలాగే ఎంటెక్, ఎం-ఫార్మసీ, ఎం-ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పీజీ ఈసెట్ పరీక్షలు మే 28 నుంచి 31 వరకు జరగనున్నాయి. వ్యాయామ విద్యలో ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ మార్చి 3న ప్రారంభమై మే 5న ముగియనుంది. మే 31 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు నిర్వహిస్తామని పీఈసెట్ కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ తెలిపారు.

గురువారం ● 29 జనవరి 2026
ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ తాజా నిబంధనపై విచారణకు సుప్రీంకోర్టు ఓకే

న్యూఢిల్లీ, జనవరి 28: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఇటీవల ఉన్నత విద్యాసంస్థలకు జారీ చేసిన ఒక నిబంధనపై దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్య బాగ్చిల బెంచ్‌ను అత్యవసరంగా ఈ పిటిషన్‌ను విచారించాలని ఒక న్యాయవాది కోరగా అందుకు అంగీకరించింది. మరోవైపు గతేడాది జూన్12న కూలిపోయిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై జరుపుతున్న అధికారిక విచారణ పౌరుల జీవించే హక్కును, వాస్తవ సమాచారాన్ని తెలుసుకొనే హక్కును ఉల్లంఘించిందని పేర్కొంటూ దాఖలైన పిల్ విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది.

## టీఎస్ ఎడ్‌సెట్ షెడ్యూల్ విడుదల

**» మే 12న పరీక్ష.. వచ్చే నెల 20 నుంచి దరఖాస్తుకు చాన్స్**

కేయూ క్యాంపస్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీఈడీ కళాశాలల్లో.. 2026-27 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ ఎడ్ సెట్-2026 నోటిఫికేషన్ విడుదలైంది. బుధవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎడ్‌సెట్ కన్వీనర్ వెంకట్రామిరెడ్డి వివరాలను వెల్లడించారు. ఫిబ్రవరి 20న అధికారిక షెడ్యూల్ విడుదల చేసి, 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. మే 12న ఆన్‌లైన్ పద్ధతిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, పరీక్ష రెండు సెషన్లలో జరుగుతుందని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రెండో సెషన్ నిర్వహిస్తామని వెంకట్రామిరెడ్డి ప్రకటించారు.

గురువారం । 29 । జనవరి । 2026
హైదరాబాద్ । www.sakshi.com

# ఫిబ్రవరి 12 నుంచి ఐసెట్ దరఖాస్తుల స్వీకరణ

- ఫిబ్రవరి 6న నోటిఫికేషన్.. మార్చి 16 వరకు దరఖాస్తులు
- మే 13, 14 తేదీల్లో ప్రవేశాలకు పరీక్షలు

**నల్లగొండ టూటౌన్:** రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఐసెట్-2026 షెడ్యూల్ హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఈ పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఉన్నత విద్యా మండలి అధికారులు నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీకి అప్పగించి, టీఎస్ ఐసెట్ కన్వీనర్‌గా యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవిని నియమించారు. ఈ సందర్భంగా ఐసెట్ కన్వీనర్ అల్వాల రవి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా టీఎస్ ఐసెట్ ప్రవేశ పరీక్షలను ఎంజీ యూనివర్సిటీ నిర్వహిస్తుందని తెలిపారు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంజీయ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, వివిధ యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లు పాల్గొన్నారు.

**షెడ్యూల్ వివరాలు..**

ఫిబ్రవరి 6న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 12 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ప్రారంభం కానున్నాయి. మార్చి 16 లోగా ఆయా కోర్సుల్లో దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్‌లో రూ.550, ఇతరులు రూ.750 చెల్లించాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులకు మే 13, 14 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు.

# ఫిబ్రవరి 23 నుంచి ఎడ్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ

**సాక్షి, హైదరాబాద్/కేయూ క్యాంపస్:** టీజీ ఎడ్‌సెట్-2026 నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 20న విడుదల చేయనున్నట్లు టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్, కేయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో బుధవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ బాలకిష్టారెడ్డి, కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, వైస్‌చైర్మన్లు పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశ్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో నోటిఫికేషన్, ఎడ్‌సెట్ నిర్వహణపై నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 18 వరకు గడువు ఉందని తెలిపారు. మే 12న కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# 12 నుంచి ఐసెట్.. 23 నుంచి ఎడ్‌సెట్ దరఖాస్తులు

## షెడ్యూల్ ఖరారు చేసిన సెట్ కమిటీలు

ఈనాడు, హైదరాబాద్: ఐసెట్‌కు ఫిబ్రవరి 12 నుంచి.. ఎడ్‌సెట్‌కు ఫిబ్రవరి 23 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. ఈ రెండు ప్రవేశ పరీక్షల కమిటీ సమావేశాలు రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఛైర్మన్ బాలకిష్టారెడ్డి సమక్షంలో వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్తాఫ్ హుస్సేన్, కాకతీయ వర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి, ఐసెట్ కన్వీనర్ అలువాల రవి, ఎడ్‌సెట్ కన్వీనర్ బి.వెంకట్రామిరెడ్డి, ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి ఐసెట్, బీఈడీ కోర్సులో ప్రవేశానికి ఎడ్‌సెట్ నిర్వహిస్తారు. ఈ సారి కూడా ఐసెట్‌ను మహాత్మాగాంధీ వర్సిటీ, ఎడ్‌సెట్‌ను కాకతీయ వర్సిటీ నిర్వహిస్తున్నాయి. ఐసెట్‌కు కొన్ని పరీక్షా కేంద్రాలను పెంచాలని నిర్ణయించారు.

**ఇదీ షెడ్యూల్..**

| విషయం | ఐసెట్ | ఎడ్‌సెట్ |
|---|---|---|
| నోటిఫికేషన్ జారీ | ఫిబ్రవరి 6 | ఫిబ్రవరి 20 |
| దరఖాస్తుల ప్రారంభం | 12 | 23 |
| ఆలస్య రుసుం లేకుండా గడువు | మార్చి 16 | ఏప్రిల్ 18 |
| పరీక్ష తేదీ | మే 13, 14 | మే 12 |

# ముగిసిన జేఈఈ మెయిన్ పేపర్-1 పరీక్షలు

- చివరి రోజు కొంత సులభంగా ప్రశ్నపత్రం

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ పేపర్-1 ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం ముగిశాయి. ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీల్లో బీటెక్‌లో చేరేందుకు.. ఐఐటీల్లో ప్రవేశానికి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించేందుకు ఈనెల 21, 22, 23, 24, 28 తేదీల్లో పేపర్-1 పరీక్షలు నిర్వహించారు. చివరి రోజు ప్రశ్నపత్రాలు మిగిలిన రోజులతో పోల్చుకుంటే కొంత సులభంగా ఉన్నాయని నిపుణులు తెలిపారు. దేశవ్యాప్తంగా పేపర్-1కు దాదాపు 13.50 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా. వారిలో 95 శాతం మంది హాజరై ఉంటారని అంచనా. గురువారం పేపర్-2 పరీక్ష జరగనుంది. ఫిబ్రవరి 12లోపు పరీక్షల స్కోర్‌ను వెల్లడిస్తామని ఇప్పటికే జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ప్రకటించింది. అంటే మరో 3-4 రోజుల్లో ప్రాథమిక కీ, విద్యార్థుల రెస్పాన్స్ షీట్ విడుదల చేయనున్నారు. బీఆర్క్, బీ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి పేపర్-2 రాయాల్సి ఉంటుంది.

మన తెలంగాణ
గురువారం 29, జనవరి 2026

# ఐసెట్ నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల

**• ఫిబ్రవరి 6న నోటిఫికేషన్ విడుదల • ఫిబ్రవరి 12 నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం • దరఖాస్తుల రిజిస్ట్రేషన్ సమర్పణకు మార్చి 16 చివరి గడువు**



**మన తెలంగాణ**/హైదరాబాద్ : టీఎస్ ఐసెట్ నోటిఫికేషన్ షెడ్యూల్ రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే 'టీఎస్ ఐసెట్ 2026' షెడ్యూల్ విడుదలైంది.. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో జరిగిన సమావేశంలో షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఈ పరీక్ష బాధ్యతలను ఉన్నత విద్యా మండలి నల్గొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీకి అప్పగించింది. టీఎస్ ఐసెట్ కన్వీనర్‌గా ఎంజీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, వివిధ యూనివర్సిటీల వీసీలు, వివిధ సెట్స్ కన్వీనర్లు పాల్గొన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజును ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.550 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఇతర అన్ని విభాగాలకు చెందిన విద్యార్థులకు రూ.750 చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులకు మే 13, 14న కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహిస్తారు.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్, గురువారం 29 జనవరి 2026

బీఈడీ పూర్తి చేసినవారికి

# ఇంటర్న్‌షిప్

## విద్యాశాఖపై సమీక్షలో సీఎస్

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): బీఈడీ పూర్తి చేసిన వారికి సర్కార్ బడుల్లో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. విద్యాశాఖపై రాష్ట్ర సచివాలయంలో బుధవా రం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులకు రిటైర్డ్ టీచర్లు, ప్రొఫెసర్లు, లెక్చరర్లతో తరచూ ముఖాముఖి నిర్వహించాలని సూచించారు. దీంతో వారిలో సృజనాత్మకత, స్ఫూర్తివంతమైన ఆలోచనలు పెరిగే అవకాశమున్నదని తెలిపారు.

## 23 నుంచి ఆన్‌లైన్‌లో ఎడ్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): రెండేండ్ల బీఈడీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎడ్‌సెట్ నోటిఫికేషన్ వచ్చే నెల 20న విడుదల కానున్నది. ఈ క్రమంలో ఎడ్‌సెట్ కమిటీ సమావేశాన్ని బుధవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించారు. విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి, కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బీ వెంకట్రామ్‌రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొని షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 23 నుంచి అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## 12 నుంచి ఐసెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఐసెట్ నోటిఫికేషన్ ఫిబ్రవరి 6న విడుదల కానున్నది. ఈ క్రమంలో బుధవారం మండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మార్చి 16వరకు ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

వార్త, గురువారం 29, జనవరి 2026

# 23 నుంచి ఎడ్‌సెట్-2026 దరఖాస్తుల స్వీకరణ

## 20న నోటిఫికేషన్ జారీ.. మే 12న పరీక్ష

**హైదరాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బిఈడి కాలేజీల్లో చేరడానికి నిర్వహించే ఎడ్ సెట్-2026కి సంబంధించిన దరఖాస్తులను ఫిబ్రవరి 23 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 20న జారీ చేయనున్నట్టు ఎడ్ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ బి వెంకట్రామ్ రెడ్డి తెలిపారు. ఎడ్‌సెట్-2026 పరీక్షను కాకతీయ యూనివర్సిటీ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఎడ్‌సెట్ మొదటి కమిటీ సమావేశం బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె ప్రతాప్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, ఎడ్ సెట్-2026 కన్వీనర్ బైరు వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. కమిటీ సమావేశం అనంతరం ఎడ్ సెట్-2026 షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 20న నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. ఫిబ్రవరి 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఏప్రిల్ 18 దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు. మే 12న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 2 గంటల నుంచి 4గంటల వరకు పరీటను నిర్వహించనున్నట్టు కన్వీనర్ వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు.

THE NEW INDIAN EXPRESS

TELANGANA

HYDERABAD

THURSDAY 29.01.2026

# Sub-committees planned for PG syllabus revamp

MEGHNA NATH @Hyderabad

AS part of the postgraduate (PG) syllabus revision for the upcoming academic year 2026-27, and to make courses more industry-oriented, the Telangana Council of Higher Education (TGCHE) has planned to constitute several sub-committees. Each sub-panel will be entrusted with examining specific subject areas.

According to TGCHE officials, the PG syllabus has not been revised for the past 10 years, leading to a steady decline in PG enrolment over the last five years.

To address this, the council plans to form around 10 sub-committees, including dedicated panels for industry, life sciences, arts, commerce and other disciplines. Each sub-committee will review the existing syllabus, assess curriculum content, identify gaps and recommend updates in line with current academic standards and industry expectations.

Senior TGCHE officials said, "The revised syllabus is expected to benefit students by providing greater exposure to practical applications, emerging technologies, and interdisciplinary learning. A key highlight of the upcoming PG syllabus revision is the active involvement of industry experts." They added that modern industries increasingly seek job-ready graduates and no longer have the resources to provide extensive training. Accordingly, up to 15-20% of the curriculum may incorporate industry-recommended components, while strictly adhering to University Grants Commission (UGC) and other regulatory guidelines.



"This is not a cosmetic revision. We are undertaking a thorough and structured overhaul of the curriculum to meet present-day academic and industry demands," he said, adding that consultations with vice-chancellors of state-run universities and faculty members are already underway.

## TGCHE RELEASES TSICET SCHEDULE

Hyderabad: The Telangana Council of Higher Education (TGCHE) on Wednesday released the schedule for the Telangana State Integrated Common Entrance Test (TSICET) and Telangana Education Common Entrance Test (TG Ed.CET). Online application submission will begin on February 12 and February 23, respectively. The registration fee is 500 for SC, ST and PH candidates and 900 for others. Officials said the TSICET notification will be issued on February 6. Applications can be submitted from February 12, with March 16 as the last date. As announced earlier, the exam is scheduled for May 13 and 14. For TG Ed.CET, the notification will be released on February 20. Applications will open on February 23 and close on April 18

## లాసెట్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ/కేయూ క్యాంపస్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో మూడేళ్ల ఎల్ఎల్బీ, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం లాసెట్, పీజీఎల్సెట్-2026 షెడ్యూల్ విడుదలైంది. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, లాసెట్ కన్వీనర్ బి.విజయలక్ష్మి, ఓయూ వీసీ, లాసెట్ చైర్మన్ కుమార్ మొలుగరం నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సెట్ దరఖాస్తుల స్వీకరణ, పరీక్షల తేదీలు, సిలబస్ వంటి అంశాలను చర్చించి ఆమోదించారు. షెడ్యూల్‌ను విడుదల చేశారు. పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగా జరుగుతాయి. నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 8న విడుదల చేస్తారు. దరఖాస్తుల స్వీకరణ ఫిబ్రవరి 10న ప్రారంభమవుతుంది. ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తు గడువు ఏప్రిల్ 1 వరకు, ఆలస్య రుసుముతో మే 13 వరకు ఉంది. ప్రవేశ పరీక్షలు మే 18న ఉదయం 9:30-11 గంటల వరకు, మధ్యాహ్నం 12:30-2 గంటల వరకు (మూడేళ్ల ఎల్ఎల్బీ), సాయంత్రం 4 నుంచి 5:30 గంటల వరకు (ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎం) జరుగుతాయి. మరిన్ని వివరాలను ఫిబ్రవరి 8 తర్వాత ww-w.lawcet.tgche.ac.in అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

### ఫిబ్రవరి 9 నుంచి ఈసెట్ దరఖాస్తుల స్వీకరణ..

డిప్లొమా, బీఎస్సీ(మ్యాథమెటిక్స్) విద్యార్థులు బీఈ/బీటెక్/బీఫార్మసీ కోర్సుల్లో లాటరల్ ఎంట్రీ(ప్రవేశాల) కోసం తెలంగాణ ఉన్నత విద్యామండలి, ఉస్మానియా యూనివర్సిటీ ఈసెట్-2026 షెడ్యూల్ విడుదల చేసింది. నోటిఫికేషన్ ఫిబ్రవరి 5న విడుదల కానుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ఫిబ్రవరి 9 నుంచి ప్రారంభంకానుంది. ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 18లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500, ఇతరులు రూ.900 చెల్లించాల్సి ఉంటుంది. మే 15న ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్ష జరగనుంది. మరిన్ని వివరాలకు http://ecet.tgche.ac.in అనే వెబ్‌సైట్‌ను ఫిబ్రవరి 5వ తేదీ తర్వాత సందర్శించవచ్చని టీజీఈసెట్ కన్వీనర్ పి.చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

బుధవారం । 28 । జనవరి । 2026
హైదరాబాద్ । www.sakshi.com

# మే 18న లాసెట్

సాక్షి, హైదరాబాద్: లా కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (లాసెట్-2026) షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. నోటిఫికేషన్ ఫిబ్రవరి 8న విడుదలవుతుంది. ఫిబ్రవరి 10 నుంచి ఏప్రిల్ 1 వరకూ జరిమానా లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలి. ఏప్రిల్ 2 నుంచి మే13 వరకూ జరిమానాతో సమర్పించవచ్చు. మే 18న పరీక్ష నిర్వహిస్తారు.

**మే 15న ఈసెట్:** తెలంగాణ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఈసెట్-2026)ను మే 15న నిర్వహిస్తున్నట్టు ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 5న నోటిఫికేషన్ విడుదల చేస్తారని, ఫిబ్రవరి 9 నుంచి ఏప్రిల్ 18 వరకూ ఆన్‌లైన్ అప్లికేషన్లు స్వీకరిస్తున్నట్టు వివరించారు.

బుధవారం | హైదరాబాద్
28.01.2026
www.v6velugu.com

ప్రభాత
వెలుగు

## లాసెట్, పీజీఎల్ సెట్‌కు

# ఫిబ్రవరి 8న నోటిఫికేషన్

- **అదే నెల 10 నుంచి ఏప్రిల్ 1 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ లాసెట్, పీజీఎల్ సెట్-2026 షెడ్యూల్ విడుదలైంది. మంగళవారం హైదరాబాద్‌లోని హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ లో టీజీసీహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నేతృత్వంలో టీజీలాసెట్ సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయా ప్రవేశపరీక్షల షెడ్యూల్ పై చర్చించి, ఫిబ్రవరి 8న నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. ఫిబ్రవరి 10 నుంచి ఆన్‌లైన్‌లో అప్లికేషన్లు తీసుకుంటారు. ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 1 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. లేట్ ఫీజుతో మే 13 వరకు అవకాశముంది. కాగా, మే 18న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహించనున్నారు. మూడేండ్ల ఎల్ఎల్‌బీ ప్రవేశాల కోసం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు రెండు సెషన్లు ఉంటాయి. ఐదేండ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సు కోసం సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. మరిన్ని వివరాలకు www.lawcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను చూడాలని కన్వీనర్ విజయలక్ష్మి తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు ఇటిక్యాల పురుషోత్తం, మహమూద్, సెక్రటరీ శ్రీరామ్ వెంకటేశ్, ఓయూ వీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఫిబ్రవరి 9 నుంచి 'ఈసెట్' దరఖాస్తులు**

హైదరాబాద్, వెలుగు: పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ మ్యాథ్స్ పూర్తి చేసి బీటెక్, బీఫార్మసీలో లేటరల్ ఎంట్రీ సెకండ్ ఇయర్ లో అడ్మిషన్ల కోసం నిర్వహించే టీజీ ఈసెట్ 2026 షెడ్యూల్ రిలీజ్ అయింది.



మంగళవారం టీజీసీహెచ్ఈ చైర్మన్ బాలకిష్టారెడ్డి అధ్యక్షతన ఈసెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా షెడ్యూల్ ఖరారు చేశారు. ఫిబ్రవరి 5న నోటిఫికేషన్ రిలీజ్ చేయనున్నట్టు వెల్లడించారు. ఫిబ్రవరి 9 నుంచి ఏప్రిల్ 18 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. పరీక్ష రాసే ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు రూ.500, ఇతర అభ్యర్థులు రూ.900 రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మే 15న ప్రవేశపరీక్ష ఉంటుంది.

**ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్**

రాష్ట్రంలో నిర్వహించే అన్ని రకాల ప్రవేశ పరీక్షల హాల్ టికెట్లపై ఈసారి 'క్యూఆర్ కోడ్' ముద్రించనున్నారు. పరీక్షా కేంద్రం ఎక్కడుందో తెలియక విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. గతేడాది టీజీ ఎప్ సెట్ రాసిన విద్యార్థుల హాల్ టికెట్లపై మాత్రమే క్యూఆర్ కోడ్ పెట్టామని గుర్తుచేశారు. ఇది మంచి ఫలితాలను ఇవ్వడంతో.. ఈ సంవత్సరం నిర్వహించే లాసెట్, ఈసెట్, ఐసెట్, పీజీఈసెట్, ఎడ్‌సెట్ సహా అన్ని ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ కు దీనిని వర్తింపచేస్తున్నట్టు చెప్పారు. అభ్యర్థులకు సిటీల్లో పరీక్షా కేంద్రాలను వెతకడం ఇబ్బందిగా మారడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు.



లాసెట్ దరఖాస్తుల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న బాలకిష్టారెడ్డి చిత్రంలో కుమార్, పురుషోత్తం, మహమూద్, వెంకటేష్, విజయలక్ష్మి తదితరులు

# వచ్చేనెల 9 నుంచి ఈసెట్, 10 నుంచి లాసెట్ దరఖాస్తులు

- 5, 8 తేదీల్లో నోటిఫికేషన్లు జారీ
- సెట్‌ల కమిటీల సమావేశంలో ఖరారు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఈసెట్, లాసెట్ దరఖాస్తుల షెడ్యూల్‌ను ఉమ్మడి ప్రవేశ పరీక్షల కమిటీ మంగళవారం విడుదల చేసింది. ఈసెట్‌కు ఫిబ్రవరి 9 నుంచి, లాసెట్‌కు 10 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సెట్‌ల కమిటీల సమావేశాలను మంగళవారం నిర్వహించారు. ఇంటర్ విద్యార్హతపై ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ, డిగ్రీ విద్యార్హతపై మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌బీ పూర్తయిన వారికి రెండేళ్ల ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశానికి లాసెట్ నిర్వహిస్తారు. పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ(గణితం) పూర్తి చేసిన వారు లేటరల్ ఎంట్రీ ద్వారా బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో నేరుగా రెండో ఏడాదిలో చేరేందుకు ఈసెట్ నిర్వహిస్తారు. ఈసారి దరఖాస్తుల ప్రక్రియ గత ఏడాది కంటే దాదాపు 20 రోజుల ముందుగా ప్రారంభమవుతుంది. దరఖాస్తుల సంఖ్యను బట్టి పరీక్షా కేంద్రాలను పెంచనున్నారు. ముఖ్యంగా లాసెట్‌కు ఏటా అభ్యర్థుల సంఖ్య పెరుగుతుండటంపై చర్చ సాగింది. సమావేశంలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, ఉపాధ్యక్షులు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేష్, ఓయూ వీసీ కుమార్, ఈసెట్ కన్వీనర్ పి.చంద్రశేఖర్, లాసెట్ కన్వీనర్ బి.విజయలక్ష్మి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

**ఇదీ 2 ప్రవేశ పరీక్షల దరఖాస్తుల షెడ్యూల్**

| విషయం | ఈసెట్ | లాసెట్ |
|---|---|---|
| నోటిఫికేషన్ విడుదల | 5న | 8న |
| దరఖాస్తులు ప్రారంభం | 9న | 10న |
| ఆలస్య రుసుము లేకుండా గడువు | ఏప్రిల్ 18 | ఏప్రిల్ 1 |
| పరీక్ష తేదీలు | మే 15 | మే 18 |

# అన్ని ప్రవేశ పరీక్షల హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్

- పరీక్షా కేంద్రాలకు సులభంగా చేరుకునేందుకు ముద్రించాలని నిర్ణయం
- బీసీల్లో కులాల వారీగా దరఖాస్తుల స్వీకరణ
- ఎప్‌సెట్‌లో ఈసారి రెండో మాక్ కౌన్సెలింగ్ నిర్వహణ
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి కీలక నిర్ణయాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రవేశ పరీక్షల హాల్‌టికెట్లపై ఈసారి జియో ట్యాగింగ్‌తో కూడిన క్యూఆర్ కోడ్‌ను ముద్రించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి మంగళవారం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే గూగుల్ మ్యాప్ ద్వారా పరీక్షా కేంద్రం చిరునామా తెలుసుకోవచ్చు. దీంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సులభంగా వెళ్లేందుకు.. తమ ఇంటి నుంచి ఎంత దూరం, ఎంత సమయం పడుతుందో అంచనా వేసుకోవడానికి వీలుంటుంది. ఎప్‌సెట్ హాల్‌టికెట్లపై గత ఏడాదే క్యూఆర్ కోడ్ ముద్రించారు. అది సత్ఫలితాలు ఇవ్వడంతో ఈసారి లాసెట్, ఎడ్‌సెట్, ఐసెట్, ఈసెట్, పీజీఈసెట్ హాల్‌టికెట్లపై కూడా ముద్రించాలని నిర్ణయించినట్లు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి తెలిపారు.

★ గత ఏడాది దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించే సమయానికి ఎస్సీ వర్గీకరణపై స్పష్టత రాకపోవడంతో ఉపకులాల వారీగా దరఖాస్తులు స్వీకరించారు. ఆ తర్వాత గ్రూపు-1, 2, 3లను ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఎస్సీ వర్గీకరణ తర్వాత ఏ కులం వారు ఎంత మంది సీట్లు దక్కించుకున్నారో ప్రభుత్వం గణాంకాలను సులభంగా సేకరించగలిగింది. అదేవిధంగా ఈసారి బీసీల్లో ఉపకులాల వారీగా దరఖాస్తులను స్వీకరించనున్నారు. గత ఏడాది వరకు కేవలం బీసీ-ఎ, బి, సి, డి, ఇ కేటగిరీల వారీగా దరఖాస్తులను స్వీకరించేవారు. ఈసారి ఉపకులాలను కూడా స్పష్టంగా విద్యార్థులు పేర్కొనాల్సి ఉంటుంది. బీసీ కమిషన్ ఇప్పటికే కులాల వారీగా ఏ కోర్సుకు ఎంత మంది దరఖాస్తు చేస్తున్నారు? ఎంత మంది ప్రవేశాలు పొందుతున్నారనే వివరాలు సమర్పించాలని ఉన్నత విద్యామండలిని ఆదేశించింది. ఆ గణాంకాలు లేకపోవడంతో ఈసారి బీసీల్లో కూడా ఉపకులాల వారీగా దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించారు.

★ గత ఏడాది ఎప్‌సెట్ ఇంజినీరింగ్ ప్రవేశాల్లో మాక్ కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించారు. దాంతో అభ్యర్థులు ఆప్షన్లు ఇచ్చుకోవడంలో తాము చేసిన పొరపాట్లను గుర్తించి, అసలు కౌన్సెలింగ్‌కు దాదాపు 40 వేల మంది ఆప్షన్లు మార్చుకున్నారు. రెండో విడత కౌన్సెలింగ్‌కు ముందు రెండోసారి మాక్ కౌన్సెలింగ్ నిర్వహించాలని గత ఏడాది వందలమంది తల్లిదండ్రులు విద్యామండలిని కోరారు. అయితే అప్పటికే షెడ్యూల్ నిర్ణయించడంతో వీలు పడలేదు. ఈ క్రమంలో ఈసారి రెండో విడత మాక్ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు.

# మహాత్మా గాంధీ వర్సిటీకి ఫార్మసీ, లా కళాశాలల మంజూరు

ఈనాడు, హైదరాబాద్: నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయానికి ఫార్మసీ, లా కళాశాలలను మంజూరు చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్మసీ కళాశాలకు రూ.4.06 కోట్లు, లా కాలేజీకి రూ.3.52 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

మన తెలంగాణ
బుధవారం 28, జనవరి

# లాసెట్, ఇసెట్ షెడ్యూల్ విడుదల

**• ఫిబ్రవరి 10 నుంచి లాసెట్ • దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం • వచ్చే నెల 9 నుంచి ఇసెట్ దరఖాస్తులు**

**మనతెలంగాణ**/హైదరాబాద్ : రాష్ట్రంలో న్యాయ విద్యలో ప్రవేశాలకు నిర్వహించే టిజిలాసెట్, పిజిఎల్‌సెట్, లాటరల్ ఎంట్రీ ద్వారా ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టిజిఇసెట్ పరీక్షల షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. లాసెట్, ఇసెట్ నిర్వహణకు మంగళవారం ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అధ్యక్షతన ఆయా సెట్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. సమావేశం అనంతరం ఆయా సెట్ల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు పురుషోత్తం, మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఒయు వైస్ ఛాన్సలర్ మొలుగరం కుమార్, లాసెట్ కన్వీనర్ విజయలక్ష్మి, ఇసెట్ కన్వీనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. లాసెట్, ఇసెట్ ప్రవేశ పరీక్షలను ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతుంది.లాసెట్ ప్రవేశ పరీక్షకు ఫిబ్రవరి 8వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసి,10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఎలాంటి ఆలస్యం రుసుం లేకుండా దరఖాస్తుల సమర్పణకు ఏప్రిల్ 1 చివరి తేదీ. మే 18వ తేదీన ఉదయం 9.30 నుంచి 11 వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2 వరకు మూడేళ్ల ఎల్‌ఎల్‌బి, సాయంత్రం 4 నుంచి 5.30 వరకు ఐదేళ్ల ఎల్‌ఎల్‌బి, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్ష జరుగనున్నది. అలాగే లాటరల్ ఎంట్రీ ద్వారా ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టిజి ఇసెట్‌ను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తుంది. ఈ ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 5న నోటిఫికేషన్ విడుదల చేసి, 9 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఏప్రిల్ 18 వరకు విద్యార్థులు దరఖాస్తులు సమర్పించవచ్చు. మే 15న ఇసెట్ పరీక్ష జరుగనున్నది.

## టిజి లాసెట్ షెడ్యూల్

**నోటిఫికేషన్ తేదీ** : ఫిబ్రవరి 8, **ఆన్‌లైన్ దరఖాస్తులు :** ఫిబ్రవరి 10 నుంచి ఏప్రిల్ 1 వరకు(ఆలస్య రుసుం లేకుండా) **పరీక్ష తేదీ : మే 18**

## టిజి ఇసెట్ షెడ్యూల్

**నోటిఫికేషన్ విడుదల:** ఫిబ్రవరి 5, **ఆన్‌లైన్ దరఖాస్తులు :** ఫిబ్రవరి 9 నుంచి ఏప్రిల్ 18 వరకు (ఆలస్య రుసుం లేకుండా) **పరీక్ష : మే 15.**

నవతెలంగాణ
బుధవారం 28 జనవరి 2026

# లాసెట్, పీజీ లాసెట్ షెడ్యూల్ విడుదల

- ఫిబ్రవరి 8న నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు న్యాయ కళాశాలల్లో మూడేండ్లు, ఐదేండ్ల లా కోర్సులతో పాటు ఎల్ఎల్ఎమ్‌లో ప్రవేశానికి నిర్వహించే లాసెట్-2026, పీజీ లాసెట్-2026కు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు మంగళవారం టీజీ లాసెట్, పీజీ లాసెట్ -2026 కన్వీనర్ ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 8న నోటిఫికేషన్ విడుదల చేసి, ఫిబ్రవరి 10 నుంచి ఏప్రిల్ 1 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. వివిధ రకాల అపరాధ రుసుంలతో మే 13 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. మే 18న పరీక్షలను నిర్వహిస్తారు. టీజీ లాసెట్, పీజీ లాసెట్ -2026 కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ కమిటీ తొలి సమావేశం నిర్వహించినట్టు తెలిపారు.

## ఫిబ్రవరి 5న ఈసెట్ నోటిఫికేషన్ విడుదల

టీజీ ఈసెట్ -2026 నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 5న విడుదల చేయనున్నారు. ఈ మేరకు మంగళవారం సెట్ కమిటీ మొదటి సమావేశంలో షెడ్యూల్ ను నిర్ణయించినట్టు టీజీ ఈసెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 9 నుంచి ఏప్రిల్ 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు రూ.500, ఇతర అభ్యర్థులు రూ.900 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మే 15న ఆన్‌లైన్‌లో పరీక్షను నిర్వహిస్తారు.

నమస్తే తెలంగాణ అంతర్-జాతీయం హైదరాబాద్, బుధవారం 28 జనవరి 2026

# ఫిబ్రవరి 8న లాసెట్ నోటిఫికేషన్

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : మూడేండ్లు, ఐదేండ్ల లా, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ లాసెట్ -26 నోటిఫికేషన్ ఫిబ్రవరి 8న విడుదల కానున్నది. 10వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. సెట్ కమిటీ సమావేశాన్ని మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించారు. మండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, వైస్ చైర్మన్ ఈ పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాంవెంకటేశ్, సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పీ చంద్రశేఖర్, ఎస్కే మహమూద్ తదితరులు సమావేశంలో పాల్గొని షెడ్యూల్ ఖరారుచేసి విడుదలచేశారు. అభ్యర్థులు ఏప్రిల్ 1వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆలస్య రుసుముతో మే 13 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. ఈ పరీక్షలను మే 18న మూడు సెషన్లలో నిర్వహిస్తారు. పూర్తి వివరాల కోసం www.lawcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కన్వీనర్ ప్రొఫెసర్ బీ విజయలక్ష్మి సూచించారు.

# ఫిబ్రవరి 9 నుంచి ఈసెట్‌కు దరఖాస్తులు

పాలిటెక్నిక్, బీఎస్సీ గణితం వంటి కోర్సులు పూర్తిచేసిన వారికి బీటెక్ సెకండియర్‌లో ప్రవేశాలు కల్పించే టీజీఈసెట్ నోటిఫికేషన్ ఫిబ్రవరి 5న విడుదల కానున్నది. 2026-27లో ప్రవేశాలకు అభ్యర్థులు 9 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సెట్ కమిటీ సమావేశాన్ని మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసెట్ షెడ్యూల్‌ను ఖరారుచేసి విడుదల చేశారు. అభ్యర్థులు ఏప్రిల్ 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులు రూ.500, జనరల్ అభ్యర్థులు రూ.900 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మే 5న ఈసెట్ ఎగ్జామ్ నిర్వహించనున్నారు.

వార్త, హైదరాబాద్, బుధవారం 28, జనవరి 2026

# ఫిబ్రవరి 10 నుంచి లాసెట్ దరఖాస్తుల స్వీకరణ

## 8న నోటిఫికేషన్ జారీ

## మే 18న పరీక్ష

**హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల్లో 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల లా కోర్సులో చేరడానికి నిర్వహించే లాసెట్-2026కి సంబంధించిన దరఖాస్తులను ఫిబ్రవరి 10 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఎల్ఎల్ఎంలో చేరడానికి నిర్వహించే పీజీ లాసెట్-2026 దరఖాస్తులను కూడా ఫిబ్రవరి 10 నుంచే ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 8న జారీ చేయనున్నట్టు లాసెట్, పీజీ లాసెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ బి విజయలక్ష్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాసెట్, పీజీ లాసెట్-2026 కమిటీ సమావేశం మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్, ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, లాసెట్, పీజీలాసెట్- 2026 కన్వీనర్ ప్రొఫెసర్ బి విజయలక్ష్మీ పాల్గొన్నారు. సమావేశం అనంతరం లాసెట్, పీజీ లాసెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 8న నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. ఫిబ్రవరి 10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. మే 13 దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు. మే 18న ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు, తిరిగి 12.30 గంటల నుంచి 2 గంటల వరకు 3 సంవత్సరాల లా కోర్సులో చేరడానికి పరీక్షను నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు 5 సంవత్సరాల లా కోర్సుతోపాటు, ఎల్ఎల్ఎంలో చేరడానికి పరీక్షను నిర్వహిస్తారు.

# 9 నుంచి ఇ-సెట్-2026 దరఖాస్తుల స్వీకరణ

## 5న నోటిఫికేషన్ జారీ.. మే 15న పరీక్ష

**హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి బి.ఇ., బి.టెక్., బి.ఫార్మ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈ సెట్-2026కి సంబంధించిన దరఖాస్తులను ఫిబ్రవరి 9 నుంచి స్వీకరించనున్నారు. దీని నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 5న జారీ చేయనున్నట్టు ఈ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెట్-2026 కమిటీ మొదటి సమావేశం మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. కమిటీ సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్, ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తోపాటు కన్వీనర్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఈ సెట్-2026 షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 5న నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. ఫిబ్రవరి 9 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఏప్రిల్ 18 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, పిహెచ్ అభ్యర్థులకు రూ. 500 ఫీజు కాగా ఇతరులకు రూ. 900గా నిర్ణయించారు. మే 15న ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు. ఈ సెట్‌లో లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా, బి.ఎస్సీ (గణితం) డిగ్రీ అభ్యర్థుల నుండి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

Telangana Today
Wednesday
January 28, 2026
HYDERABAD

HYDERABAD

# Telangana ECET

A notification inviting applications for the Telangana Engineering Common Entrance Test (TG ECET) 2026 will be released on February 5, with online registration without a late fee scheduled from February 9 and April 18. Telangana Council of Higher Education Chairman Prof V Balakista Reddy, along with OU Vice Chancellor and TG ECET 2026 Chairman Prof Kumar Molugaram, who conducted TG ECET 2026 committee meeting here on Tuesday, released a detailed schedule. Registration fee is Rs 500 for SC, ST or PH candidates and Rs 900 for all other candidates. As announced earlier, entrance exam will be conducted on May 15 from 9 am to 12 noon.

# TG ECET-2026 examination schedule released

HANS NEWS SERVICE
HYDERABAD

THE Telangana Engineering Common Entrance Test (TG ECET-2026) for lateral entry admissions into BE, B Tech, and B Pharm courses has been scheduled by Osmania University in collaboration with the Telangana Council of Higher Education (TGCHE).

The first CET committee meeting was held at TGCHE, chaired by Prof V Balakista Reddy, Chairman of TGCHE, and Prof Kumar Molugaram, Vice-Chancellor of Osmania University and Chairman of TG ECET-2026. Prof. P. Chandra Sekhar, Convener of TG ECET-2026, along with other senior officials, finalised the examination schedule.

Applications are invited from diploma holders and B.Sc. (Mathematics) graduates for lateral entry admissions for the academic year 2026-27.

The exam will be conducted in a single session from 9 am to 12 pm, covering streams such as ECE, EIE, CSE, EEE, Civil, Mechanical, Chemical, Mining, Metallurgy, Pharmacy and B Sc Mathematics.

**Key dates:**

- **Notification**: February 5, 2026
- **Online Applications**: February 9, 2026
- **Last Date (without late fee)**: April 18, 2026
- **Examination:** May 15, 2026 (Computer-Based Test)



# TG LAWCET & PGLCET-2026 schedule announced

HYDERABAD: The Telangana Law Common Entrance Test (TG LAWCET) and Post Graduate Law Common Entrance Test (PGLCET) for admissions into 3-year LLB, 5-year LLB, and LLM courses for the academic year 2026-27 will be conducted by Osmania University on behalf of the Telangana Council of Higher Education (TGCHE).

The first meeting of the Common Entrance Test Committee was held at the TGCHE, chaired by Prof. V. Balakista Reddy, Chairman of TGCHE, and attended by Prof. Kumar Molugaram, Vice-Chancellor of Osmania University and Chairman of TG LAWCET & PGLCET-2026, along with other senior officials.

The committee discussed eligibility criteria, examination pattern, online application process, test centres, ranking, and syllabus before finalising the schedule. Exams will be held in multiple sessions: 3-year LLB in the morning and noon, while 5-year LLB and LLM will be conducted in the evening. The convener, Prof. B. Vijayalaxmi, added.

**Key Dates:**

* **Notification:** February 8, 2026
* **Online Applications:** February 10, 2026
* **Last Date (without late fee):** April 1, 2026
* **Last Date (with late fee):** May 13, 2026
* **Examination:** May 18, 2026 (Computer-Based Test)

ఈనాడు

బుధవారం జనవరి 28, 2026



లాసెట్ దరఖాస్తుల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న బాలకిష్టారెడ్డి చిత్రంలో కుమార్, పురుషోత్తం, మహమూద్, వెంకటేష్, విజయలక్ష్మి తదితరులు

# వచ్చేనెల 9 నుంచి ఈసెట్, 10 నుంచి లాసెట్ దరఖాస్తులు

- 5, 8 తేదీల్లో నోటిఫికేషన్లు జారీ
- సెట్‌ల కమిటీల సమావేశంలో ఖరారు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఈసెట్, లాసెట్ దరఖాస్తుల షెడ్యూల్‌ను ఉమ్మడి ప్రవేశ పరీక్షల కమిటీ మంగళవారం విడుదల చేసింది. ఈసెట్‌కు ఫిబ్రవరి 9 నుంచి, లాసెట్‌కు 10 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సెట్‌ల కమిటీల సమావేశాలను మంగళవారం నిర్వహించారు. ఇంటర్ విద్యార్హతపై ఐదేళ్ల ఎల్ఎల్‌బీ, డిగ్రీ విద్యార్హతపై మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్‌బీ పూర్తయిన వారికి రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశానికి లాసెట్ నిర్వహిస్తారు. పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ(గణితం) పూర్తి చేసిన వారు లేటరల్ ఎంట్రీ ద్వారా బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో నేరుగా రెండో ఏడాదిలో చేరేందుకు ఈసెట్ నిర్వహిస్తారు. ఈసారి దరఖాస్తుల ప్రక్రియ గత ఏడాది కంటే దాదాపు 20 రోజుల ముందుగా ప్రారంభమవుతుంది. దరఖాస్తుల సంఖ్యను బట్టి పరీక్షా కేంద్రాలను పెంచనున్నారు. ముఖ్యంగా లాసెట్‌కు ఏటా అభ్యర్థుల సంఖ్య పెరుగుతుండటంపై చర్చ సాగింది. సమావేశంలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, ఉపాధ్యక్షులు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేష్, ఓయూ వీసీ కుమార్, ఈసెట్ కన్వీనర్ పి.చంద్రశేఖర్, లాసెట్ కన్వీనర్ బి.విజయలక్ష్మి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

**ఇదీ 2 ప్రవేశ పరీక్షల దరఖాస్తుల షెడ్యూల్**

| విషయం | ఈసెట్ | లాసెట్ |
|---|---|---|
| నోటిఫికేషన్ విడుదల | 5న | 8న |
| దరఖాస్తులు ప్రారంభం | 9న | 10న |
| ఆలస్య రుసుము లేకుండా గడువు | ఏప్రిల్ 18 | ఏప్రిల్ 1 |
| పరీక్ష తేదీలు | మే 15 | మే 18 |

# అన్ని ప్రవేశ పరీక్షల హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్

- పరీక్షా కేంద్రాలకు సులభంగా చేరుకునేందుకు ముద్రించాలని నిర్ణయం
- బీసీల్లో కులాల వారీగా దరఖాస్తుల స్వీకరణ
- ఎప్‌సెట్‌లో ఈసారి రెండో మాక్ కౌన్సెలింగ్ నిర్వహణ
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి కీలక నిర్ణయాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రవేశ పరీక్షల హాల్‌టికెట్లపై ఈసారి జియో ట్యాగింగ్‌తో కూడిన క్యూఆర్ కోడ్‌ను ముద్రించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి మంగళవారం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే గూగుల్ మ్యాప్ ద్వారా పరీక్షా కేంద్రం చిరునామా తెలుసుకోవచ్చు. దీంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సులభంగా వెళ్లేందుకు.. తమ ఇంటి నుంచి ఎంత దూరం, ఎంత సమయం పడుతుందో అంచనా వేసుకోవడానికి వీలుంటుంది. ఎప్‌సెట్ హాల్‌టికెట్లపై గత ఏడాదే క్యూఆర్ కోడ్ ముద్రించారు. అది సత్ఫలితాలు ఇవ్వడంతో ఈసారి లాసెట్, ఎడ్‌సెట్, ఐసెట్, ఈసెట్, పీజీఈసెట్ హాల్‌టికెట్లపై కూడా ముద్రించాలని నిర్ణయించినట్లు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి తెలిపారు.

★ గత ఏడాది దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించే సమయానికి ఎస్సీ వర్గీకరణపై స్పష్టత రాకపోవడంతో ఉపకులాల వారీగా దరఖాస్తులు స్వీకరించారు. ఆ తర్వాత గ్రూపు-1, 2, 3లను ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఎస్సీ వర్గీకరణ తర్వాత ఏ కులం వారు ఎంత మంది సీట్లు దక్కించుకున్నారో ప్రభుత్వం గణాంకాలను సులభంగా సేకరించగలిగింది. అదేవిధంగా ఈసారి బీసీల్లో ఉపకులాల వారీగా దరఖాస్తులను స్వీకరించనున్నారు. గత ఏడాది వరకు కేవలం బీసీ-ఎ, బి, సి, డి, ఇ కేటగిరీల వారీగా దరఖాస్తులను స్వీకరించేవారు. ఈసారి ఉపకులాలను కూడా స్పష్టంగా విద్యార్థులు పేర్కొనాల్సి ఉంటుంది. బీసీ కమిషన్ ఇప్పటికే కులాల వారీగా ఏ కోర్సుకు ఎంత మంది దరఖాస్తు చేస్తున్నారు? ఎంత మంది ప్రవేశాలు పొందుతున్నారనే వివరాలు సమర్పించాలని ఉన్నత విద్యామండలిని ఆదేశించింది. ఆ గణాంకాలు లేకపోవడంతో ఈసారి బీసీల్లో కూడా ఉపకులాల వారీగా దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించారు.

★ గత ఏడాది ఎప్‌సెట్ ఇంజినీరింగ్ ప్రవేశాల్లో మాక్ కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించారు. దాంతో అభ్యర్థులు ఆప్షన్లు ఇచ్చుకోవడంలో తాము చేసిన పొరపాట్లను గుర్తించి, అసలు కౌన్సెలింగ్‌కు దాదాపు 40 వేల మంది ఆప్షన్లు మార్చుకున్నారు. రెండో విడత కౌన్సెలింగ్‌కు ముందు రెండోసారి మాక్ కౌన్సెలింగ్ నిర్వహించాలని గత ఏడాది వందలమంది తల్లిదండ్రులు విద్యామండలిని కోరారు. అయితే అప్పటికే షెడ్యూల్ నిర్ణయించడంతో వీలు పడలేదు. ఈ క్రమంలో ఈసారి రెండో విడత మాక్ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు.

ఈనాడు
మంగళవారం జనవరి 27, 2026

# నేటి నుంచి ప్రవేశ పరీక్షల కమిటీ సమావేశాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం(2026-27) వివిధ ఉన్నత వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న ప్రవేశ పరీక్షల దరఖాస్తుల స్వీకరణ షెడ్యూల్‌ను మంగళవారం నుంచి విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మంగళవారం నుంచి ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్స్)ల కమిటీ సమావేశాలు జరగనున్నాయి. ఉన్నత విద్యామండలి ఛైర్మన్, ఇతర అధికారులతో పాటు ఆయా ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యత చూస్తున్న విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, కన్వీనర్లు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొని దరఖాస్తుల షెడ్యూల్, పరీక్షల నిర్వహణ, వివిధ సంస్కరణలపై చర్చిస్తారు. తొలిరోజు మంగళవారం ఈసెట్, లాసెట్ సమావేశాలు నిర్వహిస్తారు. 28న... ఐసెట్, ఎడ్‌సెట్, 30న కీలకమైన ఎప్‌సెట్‌తో పాటు పీజీఈసెట్ సమావేశాలు నిర్వహించనున్నారు. పీఈసెట్ సమావేశాన్ని కొద్దిరోజుల తర్వాత జరుపుతారు. మొత్తంగా ఫిబ్రవరిలోనే దాదాపు అన్ని ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్లు జారీ చేసి.. దరఖాస్తులను స్వీకరించనున్నారు.

**పెరగనున్న పరీక్షా కేంద్రాలు..!:** అమ్మాయిలకు ఇబ్బంది లేకుండా ఉదయం షిఫ్ట్‌లో ఎక్కువగా, ఒకవేళ మధ్యాహ్నం షిఫ్ట్‌లో అయితే నగరాల్లో దగ్గరగా ఉన్న పరీక్షా కేంద్రాలను కేటాయించనున్నారు. దానికితోడు ఈసారి పరీక్షలు నిర్వహించే విడతలను తగ్గించేందుకు పరీక్షా కేంద్రాలను కొంత పెంచనున్నారు. అందుకు మరికొన్ని పట్టణాలను కూడా కొత్తగా ఎంపిక చేయనున్నామని కన్వీనర్ ఒకరు తెలిపారు.

# TGCHE chairman underscores education as key to India's demographic dividend

HANS NEWS SERVICE
HYDERABAD

THE Telangana Council of Higher Education (TGCHE) celebrated the 77th Republic Day with patriotic fervour at its office premises on Monday. Prof V Balakista Reddy, Chairman of TGCHE, unfurled the National Flag in the presence of Vice-Chairmen Prof E Purushotham and Prof SK Mahmood, alongside Secretary Prof Sriram Venkatesh and the staff members of TGCHE and TAFRC.

Addressing the gathering, V Balakista Reddy recalled the immense sacrifices of freedom fighters that paved the way for the independence of the nation. He paid tribute to eminent legal luminaries such as BR Ambedkar, Sardar Vallabhbhai Patel, and Rajendra Prasad, whose vision and leadership in framing the Constitution laid the foundation for a democratic, inclusive, and sovereign nation. He underscored the importance of Fundamental Rights and Duties, noting that the Constitution remains the supreme law of the land under which all national institutions function.

Reflecting on the journey of the country since the 1970s, V Balakista Reddy observed that India has undergone a remarkable transformation—evolving from a developing nation into the world's third-largest economy and an emerging global exporter. He stressed that India is one of the youngest nations globally, with nearly half of its population below the age of 30. He emphasised that education plays a decisive role in harnessing this demographic dividend effectively.



In this context, he outlined the initiatives undertaken by TGCHE to strengthen the higher education ecosystem in the state. These initiatives, he said, are strictly aligned with national and state development goals such as Viksit Bharat 2047 and Telangana Rising 2047. The Chairman called upon faculty, administrators, and students to uphold constitutional values and contribute meaningfully to nation-building through academic excellence. He reiterated that higher education institutions must focus on skill development, innovation, and research to prepare students as problem-solvers who can drive the economic and social transformation of India. By prioritising research, the council aims to turn the youth into innovators who support the sovereignty and progress of the republic.

# యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ!

## 2,878 పోస్టులకుగాను పనిచేస్తున్నది 753 మందే

- ఏడు వర్సిటీల్లో ప్రొఫెసర్లే లేరు
- ఆర్జీయూకేటీ, శాతవాహనలో అసోసియేట్లు కూడా నిల్
- గైడ్ లైన్స్ ఇచ్చి రిక్రూట్మెంట్ మరిచిన సర్కారు
- చివరిసారిగా 2013లో భర్తీ
- ప్రతీ మీటింగ్‌లోనూ ప్రొఫెసర్ల కొరతపై వీసీల ఆవేదన
- కాంట్రాక్ట్, గెస్ట్ లెక్చరర్లతోనే నెట్టుకొస్తున్న వర్సిటీలు
- అటకెక్కిన పరిశోధనలు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీలు కేవలం డిగ్రీ పట్టాలు పంచే కేంద్రాలుగా మిగిలిపోతున్నాయి. ప్రొఫెసర్లు లేక వెలవెలబోతున్నాయి. మొత్తం11 వర్సిటీల పరిధిలో 74 శాతం పోస్టులు ఖాళీగా ఉండడం అందోళన కలిగిస్తున్నది. ఒకటి, రెండు కాదు.. ఏకంగా ఏడు యూనివర్సిటీల్లో ఒక్కరంటే ఒక్క ప్రొఫెసరూ లేకపోవడం పరిస్థితికి తీవ్రతను తెలుపుతున్నది. ఏండ్ల తరబడి నియామకాలు లేకపోవడంతో విద్యాబోధన కుంటుపడడంతో పాటు వర్సిటీల ప్రధాన లక్ష్యమైన 'పరిశోధన' పడకేసింది. మరోవైపు రెగ్యులర్ ఫ్యాకల్టీ లేకపోవడంతో న్యాక్ గ్రేడ్‌లు కష్టమవుతున్నాయి. ఫలితంగా విద్యార్థుల డిగ్రీలకు సరైన గుర్తింపు లేకుండా పోతోంది. 2013లో అప్పటి ఉమ్మడి ఏపీలో చివరిసారిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీచేశారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు ఖాళీల భర్తీని పట్టించుకోలేదు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు, వర్సిటీల్లో పోస్టుల భర్తీకి గైడ్ లైన్స్ ఇచ్చినప్పటికీ భర్తీ చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**2,125 పోస్టులు ఖాళీ..**

రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లో 2,878 టీచింగ్ పోస్టులు ఉండగా.. కేవలం 753 మంది రెగ్యులర్ సిబ్బంది పనిచేస్తున్నారు. మరో 2,125 పోస్టులు (74%) ఖాళీగా ఉన్నాయి. యూనివర్సిటీల ఉనికికి ప్రొఫెసర్లే ఆధారం. పీహెచ్‌డీ స్కాలర్లకు గైడ్‌గా వ్యవహరించాలన్నా, నాణ్యమైన రీసెర్చ్ పేపర్లు సమర్పించాలన్నా, కేంద్రం నుంచి ప్రాజెక్టులు, నిధులు రావాలన్నా ప్రొఫెసర్ల పాత్రే కీలకం. కానీ, రాష్ట్రంలోని ఏడు ప్రధాన వర్సిటీలైన కాకతీయ, మహాత్మాగాంధీ, శాతవాహన, పాలమూరు, తెలుగు వర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ, బాసర ఆర్జీయూకేటీల్లో ఒక్కరంటే ఒక్క రెగ్యులర్ ప్రొఫెసర్ లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. గైడ్ చేసే ప్రొఫెసర్లు లేకపోవడంతో ఆయా వర్సిటీల్లో పరిశోధనలు పూర్తిగా అటకెక్కాయి. రాష్ట్ర వ్యాప్తంగా 393 ప్రొఫెసర్ పోస్టుల్లో 219 ఖాళీగానే ఉన్నాయి. ఉస్మానియా మినహా మిగిలిన వర్సిటీల్లో పరిశోధనలు నామమాత్రంగా మారాయి. సీనియర్ల పర్యవేక్షణ లేకపోవడంతో నామమాత్రపు పరిశోధనలే తప్ప నాణ్యమైన రీసెర్చ్ జరగడం లేదని విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కింది స్థాయి పోస్టులూ ఖాళీనే**

కేవలం ప్రొఫెసర్లే కాదు, బోధనలో కీలకమైన అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు కూడా పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ల విభాగంలో 913 పోస్టులకు గాను 792 ఖాళీలు ఉన్నాయి. బాసర ట్రిపుల్ ఐటీ, శాతవాహన వర్సిటీల్లో ఒక్క అసోసియేట్ ప్రొఫెసర్ కూడా లేరు. మరోపక్క అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొరత మరీ దారుణంగా ఉంది. 1,572 పోస్టులకు గాను.. 1,114 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.



**వర్సిటీల వారీగా పోస్టుల ఖాళీల చిట్టా**

| యూనివర్సిటీ | మంజూరైన పోస్టులు | వర్కింగ్ | ఖాళీలు |
|---|---|---|---|
| ఉస్మానియా | 1,267 | 331 | 936 |
| జేఎన్టీయూహెచ్ | 410 | 144 | 266 |
| కాకతీయ | 409 | 77 | 332 |
| తెలంగాణ | 152 | 61 | 91 |
| ఆర్జీయూకేటీ | 146 | 19 | 127 |
| పాలమూరు | 136 | 19 | 117 |
| అంబేద్కర్ వర్సిటీ | 93 | 24 | 69 |
| తెలుగు వర్సిటీ | 77 | 13 | 64 |
| మహాత్మాగాంధీ | 70 | 35 | 35 |
| శాతవాహన | 63 | 16 | 47 |
| జేఎన్ఏఎఫ్ఏయూ | 55 | 14 | 41 |
| మొత్తం | 2,878 | 753 | 2,125 |

### చివరిసారిగా 2013లో భర్తీ..

**ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారిగా 2013లో వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేశారు. అప్పట్లో ఓయూలోనే 220 వరకూ పోస్టులను నింపారు. ఆ తర్వాత కొత్త పోస్టులను భర్తీ చేయలేదు. తెలంగాణ ఏర్పాటు తర్వాత విద్యార్థి సంఘాల ఆందోళనల నేపథ్యంలో బీఆర్ఎస్ సర్కారు 2018లో 1,061 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చింది. ఇందుకోసం అప్పటి గవర్నర్.. రాష్ట్రపతి అనుమతి కోసం పంపారు. దీంతో అది పెండింగ్‌లో పడిపోయింది. ఆ తర్వాత ఖాళీల భర్తీని బీఆర్ఎస్ పట్టించుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ వర్సిటీల వారీగానే భర్తీ చేస్తామని ప్రకటించింది. ఈమేరకు ఖాళీల వివరాలను సేకరించినా, అడుగు ముందరపడలేదు.**

ప్రతిష్టాత్మకమైన ఓయూలో 470, కాకతీయలో 183 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 10వేల మంది విద్యార్థులున్న ఆర్జీయూకేటీలో 146 సాంక్షన్ పోస్టులు ఉంటే కేవలం 19 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలోనూ కొందరు సెలవుల్లో ఉండడం గమనార్హం. మరోపక్క పాలమూరు వర్సిటీలోనూ 136 పోస్టులకు 19మందే ఉన్నారు. తెలుగు వర్సిటీలో కేవలం 13 మంది, జేఎన్ఏఎఫ్ఏయూలో 14 మంది మాత్రమే రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉండడం గమనార్హం.

**సర్కారు వద్దే 'కొత్త' నివేదిక**

వర్సిటీ నియామకాల్లో పారదర్శకత, రోస్టర్ పాయింట్లు, పటిష్టమైన గైడ్‌లైన్స్ కోసం హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (టీజీసీహెచ్ ఈ) గతంలోనే ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి నేతృత్వంలో కమిటీని నియమించింది. ఈ కమిటీ స్టడీ చేసి నివేదిక సమర్పించింది. ఆ మేరకు ఏప్రిల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి గైడ్ లైన్స్ కూడా రిలీజ్ చేసింది. పోస్టులకు మూడు విధానాల్లో వెయిటేజీ మార్కులు ఇవ్వాలని ఆదేశించింది. అకడమిక్ రికార్డు, రీసెర్చ్ పర్ఫామెన్స్ కు 50% మార్కులు, టీచింగ్ స్కిల్స్ కు 30 మార్కులు, ఇంటర్వ్యూలకు 20 మార్కులు కేటాయించారు. ఈ క్రమంలోనే తమకు న్యాయం చేయాలని కోరుతూ కాంట్రాక్టు లెక్చరర్లు ఆందోళన చేయడంతో ఈ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆ తర్వాత మరోసారి విద్యాశాఖ ఉన్నతాధికారులు సర్కారుకు ప్రతిపాదనలు పంపగా, ప్రస్తుతం అది సర్కారు వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు.

**వీసీల ఆవేదన.. అరణ్య రోదన**

మరోవైపు ఫ్యాకల్టీ లేక వర్సిటీలను నడపలేక వీసీలు సతమతమవుతున్నారు. ప్రభుత్వ పెద్దలు, హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ నిర్వహించే సమావేశంలోనూ వీసీలు ఖాళీల అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఓయూకు సీఎం రేవంత్ రెడ్డి వచ్చినప్పుడు కూడా.. ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకుపోయారు. ప్రస్తుతం రెగ్యులర్ ఫ్యాకల్టీ లేకపోవడంతో కాంట్రాక్టు, పార్ట్ టైమ్, గెస్టు లెక్చరర్లతోనే నెట్టుకొస్తున్నారు. అత్యధికంగా ఓయూలో 720 మంది, కేయూలో 417 మంది, జేఎన్టీయూలో 381 మంది పనిచేస్తున్నారు.

**రెగ్యులర్ ఫ్యాకల్టీ లేకుంటే న్యాక్ గ్రేడ్ కష్టమే..**

వర్సిటీలు, వాటి పరిధిలోని కాలేజీలకు న్యాక్ గ్రేడింగ్ రావాలంటే బిల్డింగులు, స్టూడెంట్స్ ఉంటే సరిపోదు. రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉండాల్సిందే. న్యాక్ ఇచ్చే గ్రేడింగ్‌లో 'టీచింగ్ లెర్నింగ్', 'రీసెర్చ్' విభాగాలకే భారీ వెయిటేజీ ఉంటుంది. కాలేజీలో మంజూరైన పోస్టులన్నీ రెగ్యులర్ స్టాఫ్‌తో నిండి ఉంటేనే ఈ కేటగిరీల్లో ఫుల్ మార్కులు పడతాయి. కేవలం గెస్ట్, కాంట్రా లెక్చరర్లతో కొనసాగిస్తే 'స్టూడెంట్ టీచర్ రేషియో' బ్బతిని న్యాక్ బృందం మార్కుల్లో కోత విధిస్తుంది. పైగ పీహెచ్‌డీ, నెట్/సెట్ ఉన్న పర్మినెంట్ స్టాఫ్ లేకపో రీసెర్చ్ పేపర్లు, పబ్లికేషన్స్ ఉండవు. దీంతో యూని ర్సిటీలు, కాలేజీలకు ఏ++, ఏ+ లాంటి ఉత్తమ గ్రేడ్ రావడం కష్టం అవుతున్నది. రెగ్యులర్ నియామకాల చేపట్టకుండా న్యాక్‌కు వెళ్తే చేతులు కాల్చుకున్నట్టేన విద్యావేత్తలు చెప్తున్నారు.

### సర్కార్ వచ్చి రెండేండ్లయినా భర్తీ లేదు



**కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో వర్సిటీ పోస్టులు భర్తీ చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. రెండేండ్లవుతున్నా ఆ హామీ అమలు కాలే. గైడ్‌లైన్స్ ఇచ్చినా పోస్టులను మాత్రం నింపడం లేదు. పీహెచ్‌డీ చేసే స్టూడెంట్లకు గైడ్‌షిప్ ఇచ్చేవారు కూడా కరువయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే వర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేయాలె.**

**- టి. నాగరాజు, ఎస్ఎఫ్ఐ స్టేట్ సెక్రటరీ**

### 75 శాతం ఖాళీలే..



**వర్సిటీల్లో ప్రొఫెసర్లు లేక విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. వర్సిటీల్లో 75 శాతానికి పైగా టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్క ఓయూలోనే 1,296 పోస్టులకు గాను కేవలం 312 మందే పని చేస్తున్నారు. సెంట్రల్ వర్సిటీల్లో రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ జరుగుతుంటే.. మన దగ్గర మాత్రం ఆ ఊసే లేదు. వెంటనే టీచింగ్, నాన్ టీచింగ్ ఖాళీలను నింపాలె.**

**- పృథ్వీ తేజ, ఏబీవీపీ హైదరాబాద్ సిటీ సెక్రటరీ**

వార్త, హైదరాబాద్, ఆదివారం 25, జనవరి 2026

# 27 నుంచి సెట్స్ కమిటీల సమావేశం

## ఫిబ్రవరి 2 నుంచి నోటిఫికేషన్ల జారీ

**హైదరాబాద్, జనవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరంలో ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ పరీక్షలకి సంబంధించిన సెట్స్ కమిటీ సమావేశాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 27న ఈ సెట్‌తోపాటు లాసెట్ కమిటీల సమావేశాలు జరగనున్నాయి. ఆ తరువాత ఈ నెల 28, 29న ఇతర సెట్స్ కమిటీల మీటింగ్స్ జరగనుండగా.. ఈ నెల 30న ఎప్ సెట్-2026 మీటింగ్ జరగనుంది. ఇక సెట్స్ కమిటీల సమావేశాలు ముగిసిన అనంతరం ఫిబ్రవరి 2 నుంచి వివిధ సెట్స్‌కి సంబంధించిన నోటిఫికేషన్లను, ఆయా సెట్స్ నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను జారీ చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లకు సంబంధించిన తేదిలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి తేదిలను ప్రకటించింది. రాష్ట్రంలో నిర్వహించే 8 కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌కి సంబంధించిన తేదిలను ఉన్నత విద్యా మండలి గత ఏడాది డిసెంబర్ 30న ప్రకటించింది. వివిధ జాతీయ ప్రవేశ పరీక్షలతోపాటు వివిధ పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ అనుమతితో కామన్ ఎంట్రెన్స్ పరీక్షల తేదిలను ఉన్నత విద్యా మండలి ప్రకటించింది.

శనివారం । 24 । జనవరి । 2026
హైదరాబాద్ । www.sakshi.com

# ఆన్‌లైన్‌తో 'మేనేజ్' చేయలేమా?

**ఆన్‌లైన్‌లో బీటెక్ బీ కేటగిరీ సీట్లు.. సాధ్యాసాధ్యాలపై నివేదిక కోరిన ప్రభుత్వం**

- యాజమాన్య కోటా సీట్లలో చేరే విద్యార్థులవి లక్ష ర్యాంకుపైనే
- ఈ విధానం నాణ్యతను దెబ్బతీస్తోందంటున్న వీసీలు
- మెరిట్ ప్రాతిపదికగా సీట్లు ఇవ్వాలనేది వర్సిటీల అభిప్రాయం



సాక్షి, హైదరాబాద్ : ఇంజనీరింగ్ యాజమాన్య కోటా సీట్ల భర్తీ విధానంపై ప్రభుత్వం దృష్టి సారించింది. మెడికల్ సీట్ల తరహాలో ఆన్‌లైన్‌లో సీట్లు కేటాయించాలని భావిస్తోంది. సాధ్యాసాధ్యాలపై విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి నివేదిక కోరింది. కొన్నేళ్లుగా సీట్ల భర్తీ, ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలపై సమగ్ర డేటా ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలో 1.16 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. ఇందులో 30 శాతం యాజమాన్య కోటా కింద భర్తీ చేస్తారు. ఈ ప్రవేశాలపై కొన్నేళ్లుగా విమర్శలు వస్తున్నాయి. ఈ సీట్లను ఆన్‌లైన్ విధానంలో భర్తీ చేయాలని ఉన్నత విద్యామండలి గత ఏడాది ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. సాధారణ ఫీజు కన్నా రెట్టింపుతో

మిగతా 17వ పేజీలో ▶

# ఆన్‌లైన్‌తో 'మేనేజ్' చేయలేమా?

▶ మొదటి పేజీ తరువాయి

బీ కేటగిరీ, మూడు రెట్ల ఎక్కువతో సీ (ఎన్ఆర్ఐ కోటా) కేటగిరీ భర్తీ చేయాలని పేర్కొంది. అయితే, దీనిపై ప్రభుత్వం నుంచి గత ఏడాది ఎలాంటి స్పందన కనిపించలేదు. ఈ విద్యా సంవత్సరం నుంచి దీన్ని అమలు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది.

## లోపిస్తున్న నాణ్యత

యాజమాన్య కోటా కింద దాదాపు 31 వేల సీట్లు ఉంటాయి. ఇందులో 25 వేల సీట్లు భర్తీ అవుతున్నాయి. 80 శాతం సీట్లు కంప్యూటర్ సైన్స్, అనుబంధ ఎమర్జింగ్ కోర్సుల్లోనే నిండుతున్నాయి. వాస్తవానికి బీ కేటగిరీ సీట్లను మెరిట్ ప్రకారం భర్తీ చేయాలి. కానీ ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు మాత్రం ఇష్టారాజ్యంగా సీట్లు అమ్ముకుంటున్నాయనే విమర్శలున్నాయి. మెరిట్ ప్రకారం సీటివ్వలేదని ఉన్నత విద్యామండలికి ఏటా 200 వరకూ ఫిర్యాదులు వస్తున్నాయి. కాలేజీలకు నోటీసులిచ్చి కౌన్సిల్ చేతులు దులుపుకుంటోంది. ఆన్‌లైన్ విధానం లేకపోవడం వల్ల విద్యార్థి దరఖాస్తు చేసినట్టు ఆధారాలుండటం లేదు. ఆధారాలు లేకుండా తామేమీ చేయలేమని అధికారులు అంటున్నారు. దీంతో ఒక్కో సీటును రూ.12 నుంచి రూ. 20 లక్షల వరకూ ప్రైవేటు కాలేజీలు అమ్ముకుంటున్నాయి. ఈ వ్యాపారం దాదాపు రూ. వెయ్యి కోట్లకుపైగానే ఉంటోంది. ఇందులో అనుబంధ గుర్తింపు ఇచ్చే యూనివర్సిటీ పెద్దలకు ముడుపుల రూపంలో వెళ్తున్నాయి. విద్యాశాఖ ఉన్నతాధికారులకు వాటాలు అందుతున్నాయి. దీంతో ఆన్‌లైన్ విధానంపై ఇంతకాలం సీరియస్‌గా దృష్టి పెట్టలేదు. ఇటీవల వీసీల సమావేశంలో బీ కేటగిరీ సీట్ల భర్తీపై అనేక అంశాలు తెరమీదకు వచ్చాయి. లక్షకుపైగా ఎప్‌సెట్ ర్యాంక్ వచ్చిన వారికీ కంప్యూటర్ కోర్సుల్లో సీట్లు వస్తున్నాయి. దీనివల్ల నాణ్యత ప్రమాణాలు పడిపోతున్నాయని వీసీలు తెలిపారు.

## రింగ్ అవుతున్న యాజమాన్యాలు

ఆన్‌లైన్ విధానంలో సీట్ల భర్తీని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు ప్రతీసారి అడ్డుకుంటున్నాయి. యాజమాన్యాలన్నీ ఏకమై ప్రభుత్వం వద్ద లాబీయింగ్ చేస్తున్నాయి. ప్రభుత్వ పెద్దల నుంచి సీట్ల కోసం సిఫార్సులు వస్తున్నాయి. దీన్ని అడ్డుపెట్టుకొని యాజమాన్యాలు ఇష్టానుసారం సీట్లు అమ్ముకుంటున్నాయి. ప్రైవేట్ కాలేజీల వ్యవహారంపై 2017లో ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ వేసింది. తాజాగా 2025లోనూ తనిఖీల కమిటీని వేశారు. కొన్ని కాలేజీలను తనిఖీ చేసిన అధికారులు హడావిడి చేయడం మినహా సాధించిందేమీ లేదు. ఇప్పటి వరకూ తనిఖీల్లో తేలిందేంటి? ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. కేవలం ఫీజుల పెంపును అడ్డుకునేందుకే ఈ కమిటీ వేసినట్టు తెలుస్తోంది. ప్రైవేట్ కాలేజీలు ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నాయని కమిటీ నిగ్గు తేల్చినా, ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో యాజమాన్య కోటా సీట్ల కట్టడిపై కసరత్తు ఎంత వరకూ ఫలిస్తుందో వేచి చూడాల్సిందే.

ప్రభాత
వెలుగు
శుక్రవారం | హైదరాబాద్
23.01.2026
www.v6velugu.com

# ఉన్నతవిద్య అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

- ఏపీ, తెలంగాణ కౌన్సిల్ చైర్మన్ల నిర్ణయం

**హైదరాబాద్, వెలుగు:** హయ్యర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ కోసం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్స్ కలిసి పని చేయాలని నిర్ణయించాయి. గ్లోబల్ ఇండస్ట్రీ అవసరాలకు తగ్గట్టు స్టూడెంట్లను తీర్చిదిద్దేందుకు పరస్పరం సహకారం అందించుకోవాలని డిసైడ్ అయ్యాయి. గురువారం ఏపీలోని విజయవాడలో ఏపీఎస్ సీహెచ్ ఈ చైర్మన్ మధుమూర్తితో తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అకడమిక్ ఎక్సలెన్స్, రీసెర్చ్, ఇన్నోవేషన్లలో రెండు రాష్ట్రాల మధ్య సహకారం పెంచుకోవడంపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా మన స్టూడెంట్లలో స్కిల్స్ పెంచాలన్నారు. ఎమర్జింగ్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌ను అందిపుచ్చుకోవాలని సూచించారు.

# కొత్త పాలకమండలి వచ్చాకే పదోన్నతులు

**● జేఎన్‌టీయూ అనుబంధ కాలేజీల్లో కాంట్రాక్టు అధ్యాపకుల నియామకాలకు అనుమతి**

హైదరాబాద్ సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఆచార్యుల పదోన్నతులకు సంబంధించిన ఫైలును తాత్కాలిక పాలకమండలి తోసిపుచ్చింది. పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి వర్సిటీ ఉన్నతాధికారులు సమగ్రమైన సమాచారాన్ని ఇవ్వకపోవడంతో తాత్కాలిక పాలకమండలి సభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. గురువారం సచివాలయంలో జేఎన్‌టీయూ తాత్కాలిక పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫిబ్రవరి 7న జరగనున్న 14వ స్నాతకోత్సవం ఏర్పాట్లకు, వర్సిటీ అనుబంధ కాలేజీల్లో కాంట్రాక్టు అధ్యాపకుల నియామకాలకు తాత్కాలిక పాలకమండలి అనుమతించినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) కింద ఇంటర్వ్యూలకు హాజరైన ఆచార్యులు తమ పదోన్నతుల ఫైలును తాత్కాలిక పాలకమండలి సమావేశంలో సభ్యులు ఆమోదం తెలపలేదు. పూర్తిస్థాయి పాలకమండలి ఏర్పడ్డాకే ప్రమోషన్ల అంశం కొలిక్కి వస్తుందని, ఆచార్యులు అందాక వేచి ఉండక తప్పదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కిషన్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, కమిషనర్ దేవసేన తదితరులు పాల్గొన్నారు. ఆచార్యుల పదోన్నతుల ఫైలుకు పాలకమండలి ఆమోదించకపోవడానికి గల కారణాలపై వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్లను.. 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ద్వారా వివరణ కోరగా, మాట్లాడేందుకు వారు సుముఖత వ్యక్తం చేయలేదు.



జేఎన్‌టీయూ

# ఉన్నత విద్యలో ప్రాంతీయ సహకారం

**● తెలుగు రాష్ట్రాల ఉన్నత విద్యామండలి చైర్మన్ల భేటీ**

హైదరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో ప్రాంతీయ సహకారంపై చర్చించడానికి వీలుగా తెలుగు రాష్ట్రాల ఉన్నత విద్యామండళ్ల చైర్మన్లు భేటీ అయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డితో ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి సమావేశమయ్యారు. తెలంగాణ, ఏపీ మధ్య ఉన్నత విద్యలో సహకారం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అకడమిక్ ఎక్స్‌లెన్స్‌ను మెరుగుపరచడం, పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, సంస్థాగత భాగస్వామ్యాలను పెంపొందించే అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల మండళ్ల డైరీలను పరస్పరం మార్చుకున్నారు. సమావేశంలో తెలంగాణ, ఏపీ ఉన్నత మండళ్ల వైస్‌చైర్మన్లు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్‌లో రెండో రోజూ గణితం కఠినమే..!

ఈనాడు, అమరావతి: జేఈఈ మెయిన్‌లో గురువారం ఇచ్చిన ప్రశ్నపత్రాలు బుధవారం నాటి పేపర్లలాగే కఠినంగా ఉన్నట్లు అభ్యర్థులు తెలిపారు. షిఫ్టు-1లో గణితం నుంచి వచ్చిన ప్రశ్నలు ఎక్కువ సమయం తీసుకున్నాయని పేర్కొన్నారు. ప్రశ్నల్లో సందిగ్ధత కనిపించలేదని శ్రీచైతన్య ఆల్ ఇండియా ఐఐటీ కోఆర్డినేటర్ ఎం.ఉమాశంకర్ తెలిపారు. బుధవారం నాటి పేపర్లతో పోల్చితే భౌతికశాస్త్రం కొంత కఠినంగా ఉందని, 2 ప్రశ్నలు సందిగ్ధంగా ఉండటం, వాటికి సరైన సమాధానాలు ఇచ్చేందుకు విద్యార్థులకు ఎక్కువ సమయం పట్టిందని వెల్లడించారు. రసాయన శాస్త్రం ఓ మోస్తరు నుంచి కఠిన స్థాయిలో ఉందని, కొన్ని ప్రశ్నలు ఎన్‌సీఈఆర్టీ పాఠ్యాంశాలకు మించినవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి వచ్చిన ప్రశ్నలు ఎక్కువ సమయం తీసుకున్నాయని తెలిపారు.

◆ షిఫ్టు-2లో గణితంలో సుదీర్ఘ ప్రశ్నలు ఇచ్చారని, 5 ప్రశ్నలు ఎక్కువ సమయం తీసుకునేలా ఉన్నాయని ఎం.ఉమాశంకర్ తెలిపారు. మొత్తం మీద గణితం కఠినంగా ఉండగా.. అన్నింటికి జవాబులు రాసేందుకు 80 నిమిషాల వరకు సమయం అవసరమైందని, భౌతికశాస్త్రం నుంచి ప్రాక్టికల్ ఫిజిక్స్ నుంచి వచ్చిన ప్రశ్నలు ఎక్కువ సమయం తీసుకున్నాయన్నారు. షిఫ్టు-1లో కెమిస్ట్రీలో ఆర్గానిక్, ఇన్ ఆర్గానిక్‌లకు ప్రాధాన్యం ఇచ్చారని శారద విద్యా సంస్థల గణిత నిపుణులు విఘ్నేశ్వరరావు వెల్లడించారు. షిఫ్టు-2 భౌతికశాస్త్రం నుంచి ఆధునిక భౌతికశాస్త్రం, విద్యుదయస్కాంతత్వం నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చాయన్నారు.

# అంబేడ్కర్ వర్సిటీ పాత విద్యార్థులకు రీ అడ్మిషన్

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పాత విద్యార్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి వారు కోర్సు పూర్తి చేసుకోవడానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నామని విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.వై.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా సంవత్సరం 1986 నుంచి 2013 వరకు డిగ్రీ(బీఏ, బీకాం, బీఎస్సీ) బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు విశ్వవిద్యాలయం స్పెషల్ రీఅడ్మిషన్ పొందడానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నామన్నారు. వారు జూబ్లీహిల్స్‌లోని వర్సిటీ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ విద్యార్థి సేవల విభాగాన్ని సంప్రదించాలన్నారు. వివరాలకు కాల్ సెంటర్ 18005990101 లేదా హెల్ప్ డెస్క్ 040-23680222 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

# ఉన్నత విద్యలో ఏపీ, తెలంగాణ సహకరించుకోవాలి

● ఉన్నత విద్యామండళ్ల ఛైర్మన్ల నిర్ణయం

ఈనాడు, అమరావతి: ఉన్నత విద్యలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఏపీ, తెలంగాణ ఉన్నత విద్యామండళ్ల ఛైర్మన్లు మధుమూర్తి, బాలకిష్టారెడ్డి అభిప్రాయపడ్డారు. ఏపీ ఉన్నత విద్యామండలికి గురువారం బాలకిష్టారెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల్లో ఉన్నత విద్యలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలపై ఇద్దరు ఛైర్మన్లు చర్చించారు. అధ్యాపకుల శిక్షణలో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల్లో విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడం, పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, సంస్థాగత భాగస్వామ్యాలను పెంపొందించడం, విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమాలను మెరుగుపరచడంపై చర్చించారు. రెండు రాష్ట్రాల డైరీలను పరస్పరం మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఉన్నత విద్యామండలి వైస్‌ఛైర్మన్లు విజయ భాస్కరరావు, రత్నశీలమణి, కార్యదర్శి తిరుపతిరావు పాల్గొన్నారు.

వార్త, హైదరాబాద్, శుక్రవారం 23, జనవరి 2026

# ఉన్నత విద్యలో ప్రాంతీయ సహకారం బలోపేతం

## విద్యారంగ అభివృద్ధి, పరిశోధన, ఆవిష్కరణలకు ప్రోత్సాహం

## తెలంగాణ, ఏపి ఉన్నత విద్యామండళ్ల ఛైర్మన్ల సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నత విద్యలో ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్లు అభిప్రాయ పడ్డారు. రాబోయే రోజుల్లో రెండు రాష్ట్రాల మధ్య ఉన్నత విద్యలో ప్రాంతీయ సహకారం ఉండాలన్నారు. గురువారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె మధుమూర్తితో మంగళగిరిలోని ఏపీ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఏపి ఉన్నత విద్యా మండలి వైస్‌ఛైర్మన్లు ప్రొఫెసర్ ఎస్ విజయభాస్కర్ రావు, ప్రొఫెసర్ కె రత్నశీల మణి, కార్యదర్శి ప్రొఫెసర్ బి తిరుపతి రావు పాల్గొన్నారు. ఉన్నత విద్యా రంగంలో కొనసాగుతున్న కార్యక్రమాలకు సంబంధించిన కీలక అంశాలపై సమావేశంలో చర్చించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. విద్యా నైపుణ్యాన్ని పెంచడంతో పాటు పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్స హించాలన్నారు. సంస్థాగత భాగస్వామ్యాలను పెంపొందించడంతోపాటు రెండు రాష్ట్రాలలో విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమాలను మెరుగు పరచడంపై చర్చించారు. చర్చల సందర్భంగా ఏపి ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె. మధు మూర్తి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపి ఉన్నత విద్యా మండలి చేపడుతున్న వివిధ విద్యా కార్యక్రమాల గురించి తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డికి వివరించారు. క్వాంటం టెక్నాలజీస్‌లో చొరవలు, బోధన అభ్యాస ప్రక్రియల నాణ్యతను మెరుగుపరచడం, విద్యార్థులు, అధ్యాపకులకు అధికనాణ్యత ఆన్‌లైన్ కోర్సులకు ప్రాప్యతను విస్తరించడం లక్ష్యంగా ఏపి ఉన్నత విద్యా మండలి చేపడుతున్న కార్యక్రమాల విస్తృత అమలు కార్యక్రమాల గురించి వివరించారు. ప్రపంచ విద్యా, పరిశ్రమ అవసరాలను తీర్చడానికి రెండు రాష్ట్రాలలోని విద్యార్థులను సిద్ధం చేస్తూ, అభివృద్ధి చెందుతున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలలో నైపుణ్యాలతో సన్నద్ధం చేయవలసిన అవసరాన్ని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి నొక్కి చెప్పారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్నత విద్య నాణ్యతను పెంచడానికి రెండు కౌన్సిల్‌లు నైపుణ్యం, ఉత్తమ పద్ధతులు, వనరులను చురుకుగా పంచుకోవాలని సూచించారు. విద్యా విధానాల అభివృద్ధి, సంస్థలు, అధ్యాపకులు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడే ఉమ్మడి చొరవలను అన్వేషించడం, తద్వారా రెండు రాష్ట్రాలలో ఉన్నత విద్యారంగాన్ని మెరుగు పరచడమే లక్ష్యంగా ముందుకుసాగాలని నిర్ణయించారు.

## ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్లకు

# అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి

### 100 మందికిపైగా ప్రమోషన్లు

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి టిజిసిటిఎ కృతజ్ఞతలు

**హైదరాబాద్, జనవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న వారికి కెరీర్ అడ్వాన్స్‌మెంటన స్కీమ్ (సీఏఎస్) కింద అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పిస్తూ కళాశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని 104 ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతిలభించింది. వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న 100 మందికి పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు గురువారం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు 14 సంవత్సరాల బోధన సేవలను, పరిశోధనా అనుభవాన్ని గుర్తించి ఇచ్చే అసోసియేట్ ప్రొఫెసర్ పదోన్నతికి అన్ని సబ్జెక్టులలో కలిపి మల్టీజోన్-1 నుండి 50 మంది అధ్యాపకులు, మల్టీజోన్-2 నుండి 54 మంది అధ్యాపకులు ఎంపికయ్యారు. బోధనా రంగంలో ఉన్నతమైన అధ్యాపక వృత్తిలో అసోసియేట్ ప్రొఫెసర్ అనేది ఉన్నతమైన పదోన్నతి అని, 100మందికి పైగా ప్రభుత్వ అధ్యాపకులు ఈ ప్రమోషన్ పొందడం పట్ల తెలంగాణ రాష్ట్ర డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం(టిజిసిటిఎ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎరుగు బ్రిజేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం విద్యార్థుల, కళాశాల అభివృద్ధికైపాటు పడుతన్న అధ్యాపకులకు సకాలంలో అసోసియేట్ ప్రొఫెసర్ పదోన్నతి అందించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, కళాశాల విద్య కమిషనర్ ఏ శ్రీదేవసేనకు పదోన్నతుల విషయంలో భాగస్వాములైన ఇతర అధికారులకు, బోధనేతర సిబ్బందికి టిజిసిటిఎ రాష్ట్ర భాధ్యులు డాక్టర్ సౌందర్య జోసెఫ్, డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ అమరేందర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

THE NEW INDIAN EXPRESS

TELANGANA

HYDERABAD

THURSDAY 22.01.2026

# 'NIRF rankings to shape growth'

**EXPRESS NEWS SERVICE**
@ Hyderabad

TELANGANA Council of Higher Education (TGCHE) chairman Prof V Balakista Reddy on Wednesday said the NIRF rankings should be viewed not merely as an evaluation tool but as a roadmap for sustained and strategic growth of higher education in Telangana through interdisciplinary research, innovation and institutional collaboration.

He was speaking at a one-day workshop on the National Institutional Ranking Framework (NIRF), organised by TGCHE for the benefit of 16 state Universities. About 50 coordinators and nodal officers from universities and other institutions participated.

The workshop highlighted the role of NIRF rankings in guiding students' choice of institutions, facilitating scholar mobility, informing public policy, supporting funding decisions, benchmarking institutional performance nationally and globally, and attracting students, scholars and sustained competitive funding.

Prof Reddy said such initiatives were crucial for improving institutional funding opportunities, accreditation outcomes and overall quality across State Universities. He noted that Telangana, though a young state, had emerged as a knowledge and innovation hub, with increasing participation of its Central Institutions and State Universities in NIRF rankings. While acknowledging strengths in teaching-learning processes, inclusivity and outreach, he stressed the need to strengthen research output.

# Workshop on NIRF rankings

**The Hindu Bureau**
HYDERABAD

The Telangana Council of Higher Education organised a one-day workshop on National Institutional Ranking Framework at its office on Wednesday.

Chairman V. Balakista Reddy said the council was supporting institutions through capacity-building workshops on ranking parameters, data management practices, and strategic advisory support.

నమస్తే తెలంగాణ

## రాష్ట్రానికి 52 లక్షల ఎన్ఐఆర్ఎఫ్ నిధులు

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని వర్సిటీలు, విద్యాసంస్థలకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌పై అవగాహన కల్పిచేందుకు కేంద్రం రూ. 52లక్షల నిధులు మంజూరుచేసింది. వీటిలో తొలివిడతగా రూ. 13లక్షలు విడుదల చేసింది. బుధవారం ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌పై నోడల్ ఆఫీసర్లకు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, ఎస్కే మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు.

# విద్యా నాణ్యత పెంపులో ఎన్ఐఆర్ఎఫ్‌ది కీలక పాత్ర

- ఉన్నత విద్యామండలి చైర్మెన్, ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) వంటి జాతీయ ర్యాంకింగ్ వ్యవస్థలు విశ్వవిద్యాలయాలకు నిధుల లభ్యత, అక్రిడిటేషన్ ఫలితాలు, మొత్తం విద్యా నాణ్యత పెంపులో కీలక పాత్ర పోషిస్తాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మెన్, ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఎన్ఐఆర్ఎఫ్‌పై ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. అందులో రాష్ట్రంలోని 16 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల నుంచి 50 మంది ఎన్ఐఆర్ఎఫ్ కోఆర్డినేటర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు. దాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ...తెలంగాణలోని కేంద్ర సంస్థలు, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు చురుకుగా ర్యాంకింగ్స్‌లో పాల్గొంటున్నాయని తెలిపారు. బోధనాభ్యాస విధానాలు, సమానత్వం, విస్తరణ కార్యక్రమాల్లో రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు ఉన్న బలాలను ప్రశంసించారు. పరిశోధన, సైటేషన్లు, పేటెంట్లు, నిధులు పొందిన ప్రాజెక్టులు, అకడమిక్ ప్రతిష్టను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఎన్ఐఆర్ఎఫ్‌ను కేవలం మూల్యాంకన సాధనంగా కాకుండా తెలంగాణ ఉన్నత విద్యకు దీర్ఘకాలిక, వ్యూహాత్మక అభివృద్ధికి మార్గదర్శకంగా చూడాలని సూచించారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ ఈ.పురుషోత్తం మాట్లాడుతూ.. ర్యాంకింగ్స్ విశ్వవిద్యాలయాల అభివృద్ధిపై చూపే ప్రభావంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్, కన్సల్టెంట్ అడ్వైజర్ డాక్టర్ కె.వీరాంజనేయులు మాట్లాడుతూ..ఉన్నత ప్రమాణాల జర్నల్స్‌లో పరిశోధనా ప్రచురణలు, పరిశోధన వాతావరణం బలోపేతం, అంతర్జాతీయ సహకారాలు వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ అకడమిక్ ఎక్సలెన్స్ డైరెక్టర్ కె.వెంకటేశ్ మాట్లాడుతూ..ఎన్ఐఆర్ఎఫ్ ఫ్రేమ్‌వర్క్, డేటా మేనేజ్‌మెంట్‌పై ప్రజెంటేషన్ ఇచ్చారు. డేటా అప్‌లోడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ప్రతినిధులకు ధ్రువపత్రాలను బాలకిష్టారెడ్డి అందజేశారు.



గురువారం । 22 । జనవరి । 2026
హైదరాబాద్ । www.sakshi.com

# ఫీవర్ తెప్పించిన ఫిజిక్స్

లెక్కల్లో సగం తిప్పలే..కెమిస్ట్రీ ఒక్కటే హాట్ కేక్

మొత్తంగా జేఈఈ మెయిన్స్ పేపర్ కఠినమే

తొలి రోజు జేఈఈపై అసంతృప్తి

బట్టీ చదువుల విద్యార్థుల బోల్తా

సమయం తినేసిన సుదీర్ఘ ప్రశ్నలు


హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్ తొలి రోజే దడ పుట్టించింది. ప్రశ్నపత్రం కఠినంగా ఉందని విద్యార్థులు చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఫిజిక్స్ ప్రశ్నలున్నాయని తెలిపారు. కెమిస్ట్రీ సులభంగానే ఉందన్నారు. జేఈఈ మెయిన్స్ తొలి విడత బుధవారం నుంచి మొదలైంది. పలు పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు పరీక్ష రాసిన విద్యార్థులు 'సాక్షి'ప్రతినిధులతో మాట్లాడారు. మొత్తంగా పరీక్ష కఠినంగానే ఉందని అభిప్రాయపడ్డారు. పెద్దగా స్కోర్ చేసే అవకాశం లేదన్నారు. కార్పొరేట్ కాలేజీ విద్యార్థుల్లోనూ పూర్తి విశ్వాసం కనిపించలేదు. బట్టీ పట్టించే విధానంలో సబ్జెక్టులు పూర్తి చేయడమే విద్యార్థులకు జేఈఈ శాపంగా మారిందని నిపుణులు అంటున్నారు. వివిధ రూపాల్లో ప్రశ్నలు రావడంతో సరైన సమాధానం ఎంపికలో గందరగోళానికి గురయ్యారని జేఈఈ అధ్యాపక నిపుణులు చెబుతున్నారు.

### ఫిజిక్స్‌తో పరేషాన్

మూల సూత్రాలపై పట్టులేని విద్యార్థులను ఫిజిక్స్ ప్రశ్నలు ఇబ్బంది పెట్టాయి. కొన్ని ప్రశ్నలను ట్విస్ట్ చేసి ఇచ్చారు. కాన్సెప్ట్‌తో లోతైన అవగాహన ఉంటే తప్ప సమాధానం ఇవ్వలేని విధంగా ఉన్నాయి. రే ఆప్టిక్స్, గ్రావిటేషన్, సెమీ కండక్టర్స్, వేవ్ ఆప్షన్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్ చాప్టర్ల నుంచి వచ్చిన ప్రశ్నలు తికమక పెట్టే విధంగా ఉన్నాయని విద్యార్థులు చెప్పారు. సూత్రాలతోపాటు న్యూమరికల్ క్యాలుక్యులేషన్స్ ప్రశ్నలు ఇచ్చారు. సాధారణంగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఇచ్చే గ్రాఫికల్ విశ్లేషణ మెయిన్స్‌లోనూ ఉండటం విద్యార్థులకు కష్టంగా ఉంది. రే డయాగ్రామ్స్, సైన్ కన్వెన్షన్స్, మ్యాగ్నిఫికేషన్, మిర్రర్ ఫార్ములా చాప్టర్స్ నుంచి వచ్చిన ప్రశ్నలకు ఐచ్ఛికాలు గుర్తించడం కొంత ఇబ్బందిగా అనిపించిందని విద్యార్థులు చెప్పారు. మోడ్రన్ ఫిజిక్స్ ప్రశ్నలు కాన్సెప్ట్ ఆధారంగా ఉన్నాయి. ఫొటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్, థ్రెషోల్డ్ ఫ్రీక్వెన్సీ, గ్రాఫ్ బేస్డ్ ప్రశ్నలు ఈసారి కఠినంగా ఉన్నాయి. సెమీ కండక్టర్స్‌లో ట్రాన్స్‌సిస్టర్స్ నుంచి అడ్వాన్స్‌డ్ ప్రశ్నలు వచ్చాయి.

### మేథ్స్‌లో మైండ్ గేమ్

మేథ్స్‌లో సగం ప్రశ్నలు ఈజీగా ఉన్నాయనేది విద్యార్థుల అభిప్రాయం. మిగతా సగం మాత్రం మైండ్ గేమ్ ఆడినట్టు ఉన్నాయని తెలిపారు. చూడడానికి సాధారణంగా అనిపించినా, సమాధానం గుర్తించడానికి ఎక్కువ సమయం పట్టిందని చెప్పారు. సుదీర్ఘ లెక్క చేస్తే తప్ప కచ్చితమైన సమాధానం రాబట్టలేని పరిస్థితి కనిపించింది. 3 డీ జామెట్రీ-2, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినేట్స్, వెక్టర్ ఆల్‌జీబ్రా, ఇన్‌డెఫినేట్, డెఫినేట్ ఇంటిగ్రేషన్స్, ప్రాబబులిటీ, పెర్మ్ కాంబినేషన్స్, సీక్వెన్స్ సిరీస్, సర్కిల్స్, స్ట్రాటజిక్ లెన్స్, స్టాటిస్టిక్స్ ఎల్‌సీడీ, ఫంక్షన్స్ నుంచి వచ్చిన మేథ్స్ ప్రశ్నలు బహుళ ఐచ్ఛికాల ఆన్సర్స్‌లో గందరగోళానికి గురిచేశాయి. ఒకటికి రెండుసార్లు లెక్క చేస్తేనే కచ్చితమైన సమాధానం ఇవ్వగలిగామని విద్యార్థులు తెలిపారు.

### కాపాడిన కెమిస్ట్రీ

చాలామంది విద్యార్థులు రసాయనశాస్త్రం నుంచి వచ్చిన ప్రశ్నలు తేలికగా ఉన్నాయని చెప్పారు. ఎక్కువ స్కోర్ కెమిస్ట్రీలోనే సాధ్యమన్నారు. ఈ విభాగంలో ప్రశ్నలన్నీ ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ నుంచే వచ్చాయి. కెమికల్ బాండింగ్, ఆటమిక్ స్ట్రక్చర్, పీరియాడిక్ టేబుల్, కో-ఆర్డినేట్ కాంపౌండ్స్, బేసిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, థియరీ డైనమిక్స్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి వచ్చిన ప్రశ్నలకు తేలికగా సమాధానాలు ఇవ్వగలిగామని విద్యార్థులు తెలిపారు. పెద్దగా మూలకాల జోలికి వెళ్లకపోవడం విద్యార్థులకు తేలికైంది.

### కాన్సెప్ట్ ఉన్న వారికే ఈజీ



సబ్జెక్టుపై పట్టు ఉన్నవారికే ఈసారి జేఈఈ మెయిన్స్ తేలికగా ఉందని చెప్పాలి. మొత్తంగా పేపర్ మధ్యస్థమని విశ్లేషించాలి. అయితే, ఫిజిక్స్ మాత్రం ఈసారి విద్యార్థులను ఆడుకుందనేది వాస్తవం. కెమిస్ట్రీలో టిపికల్ ప్రశ్నలు లేకపోవడం విశేషం. లోతుగా సబ్జెక్టును విశ్లేషించే ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ నుంచి ప్రశ్నలు రావడం వల్ల బట్టీతో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గందరగోళానికి గురయ్యే వీలుంది.

– ఎంఎన్‌రావు, జేఈఈ శిక్షణ నిపుణుడు

## ఎన్ఐఆర్ఎఫ్‌పై ఉన్నత విద్యామండలిలో వర్క్‌షాప్

ప్రారంభించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)పై ఉన్నత విద్యా మండలిలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు పొందేందుకు అవసరమైన విధానాలు పాటించాలని ఈ సందర్భంగా వర్సిటీ ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్రంలోని 16 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల నుంచి సుమారు 50 మంది కోఆర్డినేటర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ప్రారంభిస్తూ ఎన్ఐఆర్ఎఫ్ వంటి జాతీయ ర్యాంకింగ్ వ్యవస్థలు విశ్వవిద్యాలయాలకు నిధుల లభ్యత, అక్రెడిటేషన్ ఫలితాలు, మొత్తం విద్యా నాణ్యత పెంపులో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు.

ఈనాడు గురువారం జనవరి 22, 2026

# కొలువు రావాలి.. ఆంత్రప్రెన్యూర్లుగా మారాలి

- గ్రాడ్యుయేట్‌లకు అవసరమైన నైపుణ్యాలు నేర్పించండి
- ఉన్నత విద్యామండలికి 100 రోజుల ఎజెండా నిర్దేశించిన సర్కారు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో డిగ్రీ స్థాయి పట్టా అందుకున్న ప్రతి విద్యార్థి భవిష్యత్ అవసరాలను తీర్చేలా వారిలో నైపుణ్యాలను పెంపొందించాలి. ప్రతి విద్యార్థి ఉద్యోగిగా లేదా ఆంత్రప్రెన్యూర్‌గా మారాలి. అందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలికి వచ్చే 100 రోజుల ఎజెండాను రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి విద్యా వ్యవస్థలో సంస్కరణలకు మార్గదర్శిగా మారాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా ఉన్నత విద్యామండలి, వైస్ ఛాన్సలర్లు, ఏం చేయాలి?.. ఏమి మార్చాలి? ఏ అంశాలపై దృష్టి సారించాలో సమగ్ర నివేదికను విద్యామండలికి తాజాగా అందించింది. ఇక చర్చలు ఆపి.. కార్యాచరణకు దిగాలని పేర్కొంది. వర్సిటీలు తయారు చేసే ప్రతి



భావంతులపైనే తెలంగాణ విజన్ 2047 ఆధారపడి ఉంటుందని అభిప్రాయపడింది.

- విద్యార్హతకు తగిన ఉద్యోగం సాధించేలా లేదంటే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా విశ్వవిద్యాలయాలు ఫ్యూచర్ రెడీ గ్రాడ్యుయేట్లను తయారు చేయాలి. ప్రతి వర్సిటీ పరిశోధన కేంద్రంగా మారాలి. మొత్తంగా 2047 నాటికి రాష్ట్రంలోని వర్సిటీలు ప్రపంచవ్యాప్త గుర్తింపును పొందాలి.
- లక్ష్యాన్ని సాధించేందుకు సిలబస్‌ను మార్చుకోవాలి. ల్యాబ్‌లు, మౌలిక వసతులను విద్యాసంస్థలు సమష్టిగా వినియోగించుకోవాలి. యుద్ధప్రాతిపదికన ఎవరికి వారు వ్యక్తిగత పరిశోధన చేపట్టాలి.
- బోధన సిబ్బందిని పెంచుకోవాలి. బోధన తీరును, పరిశోధన సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవాలి. పరిశోధన, నవకల్పన, పేటెంట్లపై దృష్టి పెట్టాలి. విద్యాసంస్థలు.. పరిశ్రమల అనుసంధానం పెరగాలి. తెలంగాణ ఇంటర్న్‌షిప్ అండ్ అప్రెంటిస్‌షిప్ గ్రిడ్‌ను సృష్టించుకోవాలి.

## జేఈఈ మెయిన్స్...

# తొలిరోజు ప్రశాంతం

» మోడరేట్‌గా ప్రశ్నపత్రాలు

హైదరాబాద్ సిటీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర ప్రభుత్వ ఫండింగ్ విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ ప్రవేశాలకై నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. నగరంలోని అన్ని టీసీఎస్ అయాన్ డిజిటల్ జోన్‌లతో పాటు ఎంపిక చేసిన కొన్ని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లోనూ పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం సెషన్‌లో ఉదయం 9గంటల నుంచి 12గంటలవరకు, మధ్యాహ్నం సెషన్‌లో 3గంటల నుంచి సాయంత్రం 6గంటలవరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షాకేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థుల అడ్మిట్ కార్డులను, ఐడీప్రూఫ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశాకనే అధికారులు వారిని ఎగ్జామ్ హాళ్లలోకి అనుమతించారు. జేఈఈ మెయిన్ పరీక్షలు ఈ నెల 22, 23, 24, 28, 29 తేదీల్లోనూ జరుగుతాయి. కాగా, జేఈఈ మెయిన్ మొదటి సెషన్ తొలి రోజు 2 విడతల్లోనూ ప్రశ్నపత్రాలు మోడరేట్‌గా ఉన్నాయి. మ్యాథ్స్‌లో ప్రాబ్లెమ్స్‌ను సాల్వ్ చేసేందుకు ఎక్కువ సమయం పట్టిందని విద్యార్థులకు తోడు అధ్యాపకులూ చెబుతున్నారు. కెమిస్ట్రీలో ప్రశ్నలు ఎప్పటి మాదిరిగానే ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే వచ్చాయి. కెమిస్ట్రీని వాస్తవానికి స్కోరింగ్ సబ్జెక్టుగా విద్యార్థులు భావిస్తారు. అయితే ఈ సారి కాన్సెప్ట్ ఆధారిత అలాగే అప్లికేషన్ మోడ్‌లో ప్రశ్నలు ఉండటంతో కెమిస్ట్రీ కూడా కష్టంగా ఉందని కొందరు అంటున్నారు. సాపేక్షంగా ఫిజిక్స్ సులువుగా ఉందని హైదరాబాద్‌లోని ఎక్సలెన్షియాకు చెందిన డాక్టర్ పవన్ కుమార్ కాసు వివరించారు.

గురువారం | హైదరాబాద్
22.01.2026
www.v6velugu.com
ప్రభాత
వెలుగు

# వర్సిటీలకు వంద రోజుల ప్లాన్

- పాత పద్ధతులు బంద్.. ప్రొఫెసర్లకూ నెలకోసారి ట్రైనింగ్
- సిలబస్ పూర్తి చేయడం కాదు.. స్కిల్స్ నేర్పడమే ముఖ్యం
- హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్‌కు నివేదిక పంపిన విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా



**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలోని యూనివర్సిటీల పనితీరు మారబోతోంది. డిగ్రీలు అచ్చేసి చేతిల పెట్టే ఫ్యాక్టరీల మాదిరిగా కాకుండా.. ఉద్యోగులను తయారు చేసే అడ్డాలుగా వర్సిటీలను మార్చాలని సర్కార్ నిర్ణయించింది. ఇందుకోసం యూనివర్సిటీలు, హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ పనితీరులో మార్పులు తేవాలని డిసైడ్ అయింది. దీనికి అనుగుణంగా విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా వంద రోజుల ప్లాన్ రెడీ చేసి కౌన్సిల్‌కు పంపారు. 2047 నాటికి మన వర్సిటీలు ఇంటర్నేషనల్ రేంజ్‌లో ఉండాలన్నదే టార్గెట్‌గా ఈ రిపోర్ట్ రూపొందించినట్టు స్పష్టం చేశారు. వర్సిటీల్లో సిలబస్ పూర్తి చేశామా? లేదా? అన్నది ముఖ్యం కాదని.. స్టూడెంట్లకు సబ్జెక్టు అర్థమైందా? లేదా? అనేది ముఖ్యమనేలా పనితీరు ఉండాలని వెల్లడించారు.

**ల్యాబ్‌లు షేర్...**

అన్ని వర్సిటీల్లో ఏ క్యాంపస్ ల్యాబ్.. ఆ క్యాంపస్‌కే పరిమితం. ఇకపై అట్ల కుదరదు. ఖరీదైన పరికరాలు కొని ఎవరికి వారు దాచుకోవడం కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలన్నీ ఆ ల్యాబ్‌లను వాడుకునేలా 'షేర్డ్ ల్యాబ్స్' సిస్టమ్ తేవాలని రిపోర్టులో సూచించారు. దీనికోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించాలని ఆదేశించారు. డూప్లికేట్ సామన్లు కొని పైసలు వేస్ట్ చేయొద్దని సూచించారు. దీనికోసం రాష్ట్రమంతటా ల్యాబ్స్ నెట్‌వర్క్ ఉండాలనీ, ఆన్‌లైన్లో బుక్ చేసుకుంటే ఎవరైనా వచ్చి ప్రయోగాలు చేసుకునేలా ఉండాలని పేర్కొన్నారు.

**ప్రొఫెసర్లకు కూడా క్లాసులే..**

మారుతున్న కాలానికి అనుగుణంగా ఫ్యాకల్టీలోనూ మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది. దీనికోసం లెక్చరర్లు, ప్రొఫెసర్లకు ట్రైనింగ్ ఇప్పించాలని సర్కారు భావిస్తోంది. నెలకోసారి మాస్టర్ క్లాస్ నిర్వహించి.. కొత్త బోధనా పద్ధతులు, ఏఐ టూల్స్ మీద ట్రైనింగ్ ఇవ్వనున్నారు. పరిశ్రమల నుంచి నిపుణులను పిలిపించి క్లాసులు చెప్పించాలని డిసైడ్ అయ్యారు. విదేశాల్లో ఉన్న మనోళ్లను, ఇండస్ట్రీ నిపుణులను 'అడ్జంక్ట్ ఫ్యాకల్టీ'గా తీసుకురావాలని నిర్ణయించారు.

**గ్రౌండ్ చాలెంజెస్‌పై రీసెర్చ్..**

పరిశ్రమలతో కేవలం అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకుని చేతులు దులుపుకోవడం కాకుండా, క్షేత్రస్థాయిలో ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పని చేసేలా ప్లాన్ చేయాలని ప్రణాళికలో పేర్కొన్నారు. డెలివరీ లేని ఎంఓయూలను రికార్డుల్లో చూపించవద్దని, ఆ ఒప్పందాల వల్ల విద్యార్థులకు ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్స్ వస్తేనే వాటిని పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే వర్సిటీల్లో జరిగే రీసెర్చ్ ఏదో చేశామనిపించేలా ఉండకూడదని, హెల్త్, అగ్రిటెక్, క్లీన్ ఎనర్జీ వంటి రంగాల్లో రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా 'తెలంగాణ గ్రౌండ్ చాలెంజెస్' పేరుతో పరిశోధనలు జరగాలని పేర్కొన్నారు.

**మూడు నెలలకోసారి వర్సిటీలపై రివ్యూ**

**వచ్చే మూడు నెలల్లో కౌన్సిల్, వర్సిటీలు ఏం చేయాలో అజెండాను ఫిక్స్ చేశారు. ప్రతి వర్సిటీ తమ దగ్గర ఉన్న కోర్సులు, ల్యాబ్స్, ఇండస్ట్రీ లింకేజీలపై పక్కా రిపోర్ట్ (బేస్‌లైన్ మ్యాపింగ్) ఇవ్వాలని, ప్రతి స్టూడెంట్‌కూ ఇంటర్న్‌షిప్ దొరికేలా బ్లూప్రింట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్సిటీలకు స్వయంప్రతిపత్తి ఇస్తున్నాం కదా అని గాలికి వదిలేయబోమని, దానికి తగ్గ జవాబుదారీతనం కూడా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి మూడు నెలలకోసారి ప్రోగ్రెస్ రివ్యూ ఉంటుందని, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు కాకుండా గ్రౌండ్ లెవల్‌లో వచ్చిన ఫలితాలనే కొలమానంగా తీసుకుంటామని వివరించారు.**

ఈనాడు బుధవారం జనవరి 21, 2026

# సిలబస్ మార్పులో అన్ని రంగాల నిపుణులు

- అప్రెంటిస్‌షిప్ కోర్సులను ప్రోత్సహిద్దాం
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఈసీ సమావేశంలో నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్నత విద్యలో సిలబస్‌ను ఇప్పటికాలానికి అనుగుణంగా యుద్ధప్రాతిపదికన మార్చాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఈసీ) సమావేశం నిర్ణయించింది. అందుకు రాష్ట్రంలోని సీసీఎంబీ, ఐఐసీటీ లాంటి పరిశోధనా సంస్థలు, ఐఐటీ, హెచ్‌సీయూ తదితర జాతీయ స్థాయి విద్యాసంస్థలతోపాటు డీఆర్‌డీఏ నిపుణుల సహకారం తీసుకోవాలని సమావేశం అభిప్రాయపడింది. దాదాపు ఏడాదిన్నర తర్వాత కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డితోపాటు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, రాష్ట్ర సాంకేతిక, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పలువురు వైస్ ఛాన్సలర్లు పాల్గొన్నారు. విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ ఆయా వర్సిటీల వీసీలను కూడా భాగస్వాములను చేసి వారి అభిప్రాయాలను తీసుకొని సిలబస్‌ను ఆధునికీకరించాలని సూచించారు. ప్రభుత్వ ఆమోదం తీసుకున్న తర్వాతే కన్సల్టెంట్ల నియామకం, వాహనాల కొనుగోలు తదితర వాటిపై విద్యామండలి ముందుకువెళ్లాలని ఆమె సూచించినట్లు సమాచారం. ఈ సందర్భంగా పలువురు వీసీలు ఆచార్యుల ఖాళీల భర్తీ, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల నియామకం గురించి ప్రస్తావించారు. స్పందించిన యోగితా రాణా మాట్లాడుతూ ఆయా దస్త్రాలను ముఖ్యమంత్రికి పంపామని సమాధానమిచ్చినట్లు తెలిసింది. సమావేశంలో విద్యామండలి ఉపాధ్యక్షులు పురుషోత్తం, మహమూద్ అలీ, కార్యదర్శి శ్రీరాం వెంకటేష్, వీసీలు టీకేకే రెడ్డి, అల్తాఫ్ హుస్సేన్, ఘంటా చక్రపాణి, కుమార్, యాదగిరిరావు, ఉమేష్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చర్చించిన అంశాలు...నిర్ణయాలు ఇవీ...

- ఆయా వర్సిటీలు తమ ప్రాంగణాల్లోని ల్యాబ్‌లను పాలిటెక్నిక్ విద్యార్థులు ఉపయోగించుకునేలా.. నైపుణ్యాలను పెంచేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రస్తుతం చదువుకుంటూ సంపాదించే తరహా అప్రెంటిస్‌షిప్ కోర్సులు 23 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉన్నాయి. వాటిని మరింతగా పెంచాలి. ఈ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు రూ.5 వేలను కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఆ మొత్తాన్ని ఆయా వర్సిటీలు, ఉన్నత విద్యామండలి భరించాలి.

బుధవారం | హైదరాబాద్
21.01.2026
www.v6velugu.com

ప్రభాత
వెలుగు

# చదువుతూ సంపాదించే కోర్సులకు పెద్దపీట

## డిగ్రీ, పీజీ సిలబస్‌లో సమగ్ర మార్పులు

- ఐఐటీ, సీసీఎంబీ, డీఆర్డీఓ నిపుణులతో పాఠాల రూపకల్పన
- పాలిటెక్నిక్ స్టూడెంట్లకు వర్సిటీల ల్యాబ్‌లు, గ్రౌండ్లు
- టీజీసీహెచ్ఈ కీలక నిర్ణయాలు



**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో డిగ్రీ, పీజీ సిలబస్‌ను సమూలంగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. మారుతున్న కాలానికి అనుగుణంగా, ఇండస్ట్రీ అవసరాలకు తగ్గట్టుగా సిలబస్ ఉండాలని భావిస్తున్నది. ఈ నేపథ్యంలో ఐఐటీ, సీసీఎంబీ, డీఆర్డీఓ, సెంట్రల్ వర్సిటీల వంటి ప్రతిష్టాత్మక సంస్థల సీనియర్ ప్రొఫెసర్ల సలహాలు, సూచనలతో కొత్త కరికులం రూపొందించాలని హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ నిర్ణయించింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలి ఆఫీసులో కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం టీజీసీహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా సమక్షంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. డిగ్రీ, పీజీ చేస్తూనే ఉపాధి పొందేలా రూపొందించిన 'చదువుతూ సంపాదించే'కోర్సులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 23 కాలేజీల్లోనే ఈ తరహా కోర్సులు ఉన్నాయని, వీటిని మరిన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలకు విస్తరించాలని సమావేశంలో అధికారులు స్పష్టం చేశారు.

**వర్సిటీల సాయం పాలిటెక్నిక్‌లకు..**

వనరుల వినియోగంలో పరస్పర సహకారం ఉండాలని కౌన్సిల్ ఈసీ నిర్ణయించింది. ముఖ్యంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు యూనివర్సిటీలు అండగా నిలవాలని సూచించారు. వర్సిటీల్లో అందుబాటులో ఉన్న అధునాతన ల్యాబ్‌లు, స్పోర్ట్స్ గ్రౌండ్స్‌ను పాలిటెక్నిక్ స్టూడెంట్స్ కూడా వాడుకునేలా అవకాశం కల్పించాలని నిర్ణయించారు. రాబోయే కామన్ ఎంట్రెన్స్ టెస్టులను పకడ్బందీగా, విద్యార్థులకు ఎలాంటి టెక్నికల్, ఇతర ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే, వర్సిటీల్లో ఖాళీ పోస్టుల భర్తీ, వర్సిటీలకు పాలక మండళ్ల ఏర్పాటు అవశ్యకతను కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి, పలువురు వీసీలు.. విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు ఆమె చెప్పినట్లు తెలిసింది. కాగా, కౌన్సిల్‌లో ఏమైనా వస్తువులు కొనుగోలు చేసినా, సిబ్బంది నియామకాలు చేపట్టినా కచ్చితంగా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని అధికారులకు ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో కౌన్సిల్ వైస్ చైర్మన్లు ఇటిక్యాల పురుషోత్తం, మహమూద్, శ్రీదేవసేన తదితరులు పాల్గొన్నారు

హైదరాబాద్, బుధవారం 21 జనవరి 2026

నమస్తే తెలంగాణ

Telangana Today

Wednesday
January 21, 2026
HYDERABAD

# UG, PG syllabus to be rejigged

## TGCHE to constitute subjectwise committees shortly

CITY BUREAU
Hyderabad

The Telangana Council of Higher Education (TGCHE) has decided to revamp the UG and PG syllabus. Accordingly, it will shortly constitute subject-wise committees headed by Vice Chancellors.

This decision was made during the TGCHE Executive Council meeting chaired by TGCHE Chairman Prof V Balakista Reddy here on Tuesday. While approving the first-year UG revamped syllabus, the EC gave its nod for revising the second and third-year UG and PG syllabi.

To ensure the syllabus is industry-oriented and to equip students with necessary skills, it has been decided to seek suggestions from research institutions such as CCMB, IITs, IICT and DRDO.

> To ensure the syllabus is industry-oriented, TGCHE has decided to seek suggestions from research institutions such as CCMB, IITs, IICT and DRDO

Furthermore, apprenticeship-embedded courses, which allow students to earn while they learn, will be expanded to all government degree colleges with NAAC accreditation in the forthcoming academic year. Presently, these courses are being offered in 23 colleges, with 1,071 student enrolment. In addition, the TGCHE and universities have decided to bear the skill development registration fee of Rs 5000 for students who enrol in apprenticeship-embedded courses.

During the meeting, the universities were asked to handhold the polytechnic colleges under their jurisdiction. The varsities were also asked to provide an opportunity for polytechnics to utilise their laboratories and technological resources. The issue of filling up posts in the TGCHE was also discussed. However, since the file is with the Chief Minister, it was decided to proceed only after formal approval.

Education Department Secretary Dr Yogita Rana, TGCHE Vice-Chairman-I Prof E Purushottam and Vice Chairman-II Prof SK Mahmood, Commissioner of Collegiate Education A Sridevasena, several university Vice-Chancellors, among other officials, participated.

# సిలబస్ రూపకల్పనలో సీసీఎంబీ, ఐఐటీలు

## మరిన్ని ఎంబెడెడ్ కోర్సులు

- ఇంజనీరింగ్ కాలేజీ లేబుల్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులు
- వర్సిటీల్లో నియామకాలపై ప్రత్యేక దృష్టి
- పాలకమండలిలో కొత్త యూనివర్సిటీలకు స్థానం
- ఉన్నత విద్యామండలి కీలక నిర్ణయాలు



సాక్షి, హైదరాబాద్ : సాంకేతిక విద్యకు సంబంధించిన కోర్సుల్లో మరిన్ని మార్పులు తేవాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. సీసీఎంబీ, ఐఐటీలు సహా మరిన్ని దేశీయ పరిశోధన సంస్థలను సిలబస్ రూపకల్పనలో భాగస్వామ్యం చేయాలని తీర్మానించింది. ఉన్నత విద్యా కౌన్సిల్ పాలక మండలి సమావేశం మంగళవారం జరిగింది. మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య, మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కె మహమ్మూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, ఆయా వర్సిటీల వీసీలు ప్రొఫెసర్లు ఎం.కుమార్, ఉమేశ్‌కుమార్, గంటా చక్రపాణి, జీఎన్ శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, అల్తాఫ్ ఉస్సేన్, టీకేకే రెడ్డి పాల్గొన్నారు. పలు ఆర్థిక నిర్ణయాలకు సమావేశం ఆమోదం తెలిపింది. ఉపాధి అవకాశాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా రూపొందించే సిలబస్‌పై సమావేశంలో చర్చ జరిగింది. ఆ వివరాలను బాలకిష్టారెడ్డి వివరించారు.

### ఉపాధికి మరిన్ని కోర్సులు

ఉన్నత విద్యలో సిలబస్ మార్పుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. అన్ని స్థాయిల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిలబస్‌ను తీసుకొచ్చే దిశగా బాలకిష్టారెడ్డి నిపుణులతో కొంత కాలంగా కృషి చేశారు. ఉన్నతవిద్య చదివే విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు పెంచేందుకు సులభమైన రీతిలో ఇంగ్లిష్ పుస్తకాలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చారు. వీటన్నింటినీ కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యలో మరిన్ని అనుబంధ కోర్సులు అవసరమని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. ఇంటర్ స్థాయి నుంచి స్వల్ప, దీర్ఘకాలిక కోర్సులను అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

### వర్సిటీల్లో వసతులేవి?

ఆయా వర్సిటీల వీసీలు కౌన్సిల్ సమావేశంలో తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాకల్టీ కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల బోధన కుంటుపడుతోందని తెలిపారు. పరిశోధన కార్యక్రమాలకు ప్రొఫెసర్లు లేకపోవడంతో ఇబ్బంది కలుగుతోందని చెప్పారు. అధ్యాపకుల నియామకాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని, సమస్యలను ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పరిష్కారం లభించే వీలుందని యోగితారాణా తెలిపారు. పాలక మండలిలో అన్ని యూనివర్సిటీలకు ప్రాతినిధ్యం ఉండాలని కోరారు. యూనివర్సిటీలు, ఉన్నత విద్యామండలి, విద్యాశాఖ మధ్య సమన్వయం కోసం ప్రత్యేక వ్యవస్థ అవసరమని ఆమె సూచించారు.

### సాంకేతిక విద్యలో కొత్తదనం

ఇంజనీరింగ్ విద్యలో గుణాత్మక మార్పులు అవసరమని యోగితా రాణా సూచించారు. నైపుణ్యం ప్రామాణికంగా వీటి రూపకల్పన జరగాలన్నారు. దీనికోసం సీసీఎంబీ వంటి పరిశోధన సంస్థల భాగస్వామ్యం అవసరమని చెప్పారు. పాలిటెక్నిక్ విద్యను ఆధునీకరించే దిశగా అడుగులు పడాలని, థియరీతోపాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరమని ఆమె సూచించారు. ఇంజనీరింగ్ కాలేజీ లేబొరేటరీలను కూడా పాలిటెక్నిక్ విద్యార్థులు వాడుకునే అవకాశం కల్పించాలన్నారు. అన్ని వర్సిటీలు దీనికోసం ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

## నేటి నుంచి జేఈఈ మెయిన్స్

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్) తొలి విడత బుధవారం నుంచి దేశవ్యాప్తంగా మొదలవుతుంది. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షలు ఈనెల 29 వరకు కొనసాగుతాయి. దేశవ్యాప్తంగా 13.8 లక్షల మంది జేఈఈ మెయిన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు 60 వేలకుపైగానే ఉంటారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అభ్యర్థులకు అడ్మిట్ కార్డులను విడుదల చేసింది. హైదరాబాద్, సికింద్రాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్, నిజామాబాద్, సూర్యాపేట, సిద్దిపేట, జగిత్యాల, కొత్తగూడెంలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను, మెటీరియల్‌ను పరీక్షకు అనుమతించేది లేదని ఎన్‌టీఏ స్పష్టంచేసింది.

ఆంధ్రప్రభ

హైదరాబాద్

బుధవారం 21-1-2026

# డిగ్రీ, పీజీ కోర్సుల్లో పరిశోధనలకు పెద్దపీట

- ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఎంఓయూలు
- వర్సిటీల్లో అధ్యాపక ఖాళీల భర్తీకి చర్యలు
- ఉన్నత విద్యామండలి పాలకవర్గ సమావేశం నిర్ణయం

**హైదరాబాద్,ఆంధ్రప్రభబ్యూరో:** డిగ్రీ, పీజీ కోర్సుల్లో పరిశోధనలకు పెద్ద పీట వేయాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. ఇందు కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ప్రతిపాదించింది. తెలంగాణ లోని అన్ని విశ్వ విద్యాలయాలు ఆయా కోర్సుల్లో చేరిన విద్యార్థులను పరిశోధ నల వైపు దృష్టి సారించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సంకల్పిం చింది.పరిశోధనలను మరింత వేగవంతం చేసేందుకు నగరంలో ఉన్న డిఫెన్స్ సంస్థలు,సీసీఎంబీ,ఎన్జీఆరవతీతీ, ఐఐసిటీ వంటి ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థలతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించారు. మం గళవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి అధ్యక్షతన మండలి కార్యాలయంలో జరిగిన పాలక వర్గ సమావేశంలో కీలక అంశాలపై చర్చించారు. విద్యా శాఖ కార్యదర్శి యోగితా రానా, సాంకేతిక విద్యా శాఖ కమీషనర్ శ్రీదేవసేన,ఉస్మానియా,కాకతీయ,మహాత్మా గాంధీ,శాతవాహన, పాలమూరు,జేఎన్టీయూ,అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయాల ఉపకుల తులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి 27 అంశాలతో రూపొందించిన ఎజెండాకు మండలి కార్యవర్గ సభ్యులం తా ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. ఉన్నత విద్యా మండలి పాలక వర్గంలో కొత్తగా ఏర్పాటైన చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం, కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ ఉపకులతులను కూడా సభ్యులుగా చేర్చాలని విద్యా శాఖ కార్యదర్శి యోగితా రానా సూచించగా అం దుకు సంబంధించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని బాలకిష్టారెడ్డి తెలి పారు. ఉన్నత విద్యా మండలి ఏర్పాటు చేసే వివిధ కమిటీల్లో డిగ్రీ,పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులకు కూడా భాగస్వా మ్యం కల్పించాలన్న సాంకేతిక, కళాశాల విద్యా కమీషనర్ శ్రీదేవసేన చేసిన సూచ నను పరిగణలోకి తీసు కుంటామని బాల కిష్టారెడ్డి చెప్పారు. ఉన్నత విద్యా మండలి లో పని చేస్తున్న అధికారులు ఉద్యోగ విర మణ చేస్తున్నారని వారి స్థానాల్లో కన్సల్టెంట్లను నియమించుకోవాలన్న ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి ఆదేశాలను అమలు చేయాలని నిర్ణయించామని ఆయన చెప్పారు. డిగ్రీ లో చేరే విద్యార్థులకు నైపుణ్యత పెంచి వారికి ఉపాధి దొరికేలా ప్రభుత్వం చర్యలు చెపట్టిందని ఇందుకయ్యే ఖర్చును ఇప్పటిదాకా విద్యార్థులే భరించేవారని ఇక నుంచి విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న రూ ఐదు వేలు ఉన్నత విద్యా మండలి, సంబంధిత వర్సిటీలు భరించేలా చూడాలన్న శ్రీదేవసేన సూచనను పరిగణలోకి తీసుకుని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలయ్యేలా చూస్తా మని బాలకిష్టారెడ్డి హామీ ఇచ్చారు.విశ్వ విద్యాలయాల్లో ఎన్నో ఏళ్ళ నుంచి ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్న అంశం చర్చకు రాగా ఇం దుకు సంబందించిన దస్త్రం ముఖ్యమంత్రి కార్యాలయానికి ఆమోదం కోసం పంపించినట్టు యోగితా రానా తెలిపారు. విద్యా శాఖలో ఉప కార్యదర్శిగా పని చేసి ఇటీవలే ఉద్యోగ విరమణ చేసిన చిట్టి రాణిని ఉన్నత విద్యా మండలిలో కన్సల్టెంట్ గా నియమించాలని యోగి తా రానా చేసిన ప్రతిపాదనకు మండలి కార్యవర్గం ఆమోదం తెలిపింది. చిట్టి రాణి విద్యా శాఖకు సంబంధించి ప్రభుత్వానికి మండలికి మధ్య వారధిగా పని చేస్తారు.బీఆరవతీతీస్ ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన చిట్టి రాణిని ఉన్నత విద్యా మండలిలో కన్సల్టెంట్ గా నియమించాలని తీసుకున్న నిర్ణయం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శనివారం జనవరి 17, 2026

ఈనాడు

# కొత్త వర్సిటీనా..? ఆర్‌జీయూకేటీని విస్తరిస్తారా..?

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన నేపథ్యంలో చర్చ

ఈనాడు, హైదరాబాద్: బాసర ఆర్‌జీయూకేటీలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని నిర్మల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో కొత్త వర్సిటీని ఏర్పాటు చేస్తారా? ఉన్న ట్రిపుల్‌ఐటీని విస్తరిస్తారా? అన్న చర్చ విద్యాశాఖలో కొనసాగుతోంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఆర్‌జీయూకేటీ వర్గాలు సైతం తమకూ స్పష్టత లేదని చెబుతున్నాయి. ప్రస్తుతం ఆర్‌జేయూకేటీలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్(ఇంటర్ రెండేళ్లు, బీటెక్ నాలుగేళ్లు) కోర్సులు మాత్రమే ఉన్నాయి. కాకపోతే ప్రస్తుత విద్యా సంవత్సరం(2025-26) నుంచి మహబూబ్‌నగర్‌లో తాత్కాలిక భవనంలో కొత్త క్యాంపస్‌ను ప్రారంభించి ప్రవేశాలు చేపట్టారు. శాశ్వత ప్రాంగణానికి శనివారం ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. మరో క్యాంపస్‌ను ఎల్కతుర్తిలో ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఆదిలాబాద్ మినహా అన్ని ఉమ్మడి జిల్లాల్లో ఏదో ఒక శాఖ పరిధిలో పూర్తిస్థాయి వర్సిటీలున్నాయి. ఉన్నత విద్యాశాఖ పరిధిలో నిర్మల్ జిల్లా బాసరలో ఆర్‌జీయూకేటీ ఉన్నా.. అది కేవలం ఒక కోర్సుకే పరిమితమని.. పూర్తిస్థాయి విశ్వవిద్యాలయం లేదన్న భావన జిల్లా వాసుల్లో ఉంది. ఈ క్రమంలోనే వర్సిటీని ఏర్పాటు చేస్తానని సీఎం ప్రకటించినా.. దానిపై స్పష్టత లేకపోవడంతో విద్యాశాఖవర్గాలతోపాటు జిల్లావాసుల్లోనూ చర్చ నెలకొంది. ట్రిపుల్‌ఐటీని బలోపేతం చేయాలని అడిగామని... అంతకంటే తమకు కూడా తెలియదని ఆర్‌జీయూకేటీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

17

# సాక్షి

బుధవారం
14-1-2026

# ఫిబ్రవరి మొదటివారంలో ఏప్‌సెట్ నోటిఫికేషన్

**సన్నాహాలు చేస్తున్న సెట్ కన్వీనర్**

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏప్ సెట్) నోటిఫికేషన్ ఫిబ్రవరి మొదటివారంలో ఇవ్వనున్నారు. దీనికోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్‌సెట్ మే నెలలో జరుగుతుంది. దరఖాస్తుల స్వీకరణ, ఫీజుల వివరాలు, సిలబస్‌తో కూడిన నోటిఫికేషన్‌ను సెట్ కన్వీనర్ విడుదల చేయాల్సి ఉంది. ఇంటర్ సెకండియర్ విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతారు. ఈ కారణంగా ఈ ఏడాది ఇంటర్ చదివే విద్యార్థుల పూర్తి ఆన్‌లైన్ డేటా అందాల్సి ఉందని సెట్ వర్గాలు తెలిపాయి. ఏప్‌సెట్‌కు దరఖాస్తు చేసే క్రమంలో ఆధార్, లేదా ఇంటర్ హాల్ టికెట్ నంబరును ఎంటర్ చేయగానే విద్యార్థి డేటా మొత్తం ఆన్‌లైన్‌లోకి వస్తుంది. ఇది జరగాలంటే ముందుగా ఇంటర్ బోర్డు హాల్ టికెట్లు విడుదల చేయాలి. ప్రీ హాల్ టికెట్లను ఇంటర్ బోర్డు ఇప్పటికే విడుదల చేసింది. అయితే, ఈ డేటాను ఆన్‌లైన్ చేయలేదు. పూర్తి ఆన్‌లైన్‌తో కూడిన హాల్ టికెట్లను మరో 15 రోజుల్లో విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తవ్వగానే ఏప్‌సెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఈసారి పరీక్ష కేంద్రాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. బాలికలకు సమీపంలోనే పరీక్ష కేంద్రం ఉండేలా చూస్తామని అధికారులు తెలిపారు.

**ఇంటర్ హాల్ టికెట్లు వచ్చాకే...**



సెట్ నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశాం. త్వరలోనే సెట్ కమిటీ సమావేశమవుతుంది. ఇంటర్ హాల్‌టికెట్లను విడుదల చేయాలని ఇంటర్ బోర్డును కోరాం. విద్యార్థి సమగ్ర సమాచారం బోర్డు నుంచే తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో ఆధార్ లేదా ఫోన్ నంబర్‌తో ఏప్‌సెట్‌కు లాగిన్ అయితే, ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా సమాచారం వస్తుంది. హాల్ టికెట్లు విడుదలైన తర్వాత ఏప్‌సెట్ నోటిఫికేషన్ ఇస్తాం. ఫిబ్రవరి మొదటి వారంలో నోటిఫికేషన్ ఇవ్వాలనుకుంటున్నాం.

– ప్రొఫెసర్ కె విజయకుమార్‌రెడ్డి,
ఏప్‌సెట్ కన్వీనర్

**15 రోజుల్లో ఇంటర్ హాల్ టికెట్లు**



ఇంటర్ థియరీ పరీక్షల హాల్‌టికెట్లు మరో 15 రోజుల్లో విడుదల చేస్తాం. ఇప్పటికే నమూనా హాల్ టికెట్లు ఇచ్చాం. ప్రాక్టికల్స్‌కు సంబంధించినవి విద్యార్థులకు వెళ్లాయి. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఒకటికి రెండుసార్లు పరిశీలించాల్సి ఉంటుంది. దీంతో పాటు ఆన్‌లైన్‌లోనూ హాల్‌టికెట్లు అందుబాటులోకి తేవడానికి అవసరమైన సాఫ్ట్‌వేర్ కూడా సిద్ధం చేశాం.

– జయప్రదాబాయి
ఇంటర్ పరీక్షల విభాగం అధికారి

# ఎప్‌సెట్ అభ్యర్థులకు డిజిటల్ పాఠాలు

హైదరాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్-27 పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం డిజిటల్ కంటెంట్ అందిస్తున్నామని టీ-శాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 12 నుంచి ప్రారంభమైన కంటెంట్ ప్రసారం మే రెండోతేదీ వరకూ సాగుతుందని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులపై 112 రోజులు 450 పాఠ్యాంశాలను రోజూ ఉదయం 7 గంటలకు, నిపుణ చానల్‌లో సాయంత్రం 7 గంటలకు ప్రసారం చేస్తామన్నారు. ఈ ప్రసారాలు టీ-శాట్ శాటిలైట్ చానళ్లతో పాటు యాప్, యూ-ట్యూబ్‌ల్లోనూ అందుబాటులో ఉంటాయన్నారు.

మంగళవారం । 13 । జనవరి । 2026
హైదరాబాద్ । www.sakshi.com

# ముందే 'సెట్' చేద్దాం!

**ఇంజనీరింగ్ సెట్ నోటిఫికేషన్ రాకుండానే ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల అనధికార ప్రవేశాలు**

**ఫైనలియర్‌లో క్యాంపస్ కొలువులు ఇప్పిస్తామంటూ విద్యార్థులకు డీమ్డ్ వర్సిటీలు, అటానమస్ కాలేజీల ఎర**

**పీఆర్‌వోలు, కన్సల్టెన్సీల ద్వారా బేరాలు.. ఒప్పుకుంటే భారీ ఆఫర్లు**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్ ఉమ్మడి ప్రవేశపరీక్ష నోటిఫికేషన్ ఇంకా విడుదల కానప్పటికీ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు మాత్రం ప్రవేశాల కోసం ఇప్పట్నుంచే హడావుడి చేస్తున్నాయి. అటానమస్, డీమ్డ్ యూనివర్సిటీలు ఇంజనీరింగ్ సెట్‌తో పనిలేకుండానే సీట్లు ఇస్తామంటున్నాయి. అనుబంధ గుర్తింపుతో నడిచే కాలేజీలు మాత్రం యాజమాన్య కోటా సీట్ల భర్తీపై దృష్టి పెడుతున్నాయి. టాప్–10 కాలేజీలు మినహా అన్ని కాలేజీలూ ఇదే దారిలో వెళ్తున్నాయి. ఇంజనీరింగ్ ఉమ్మడి ప్రవేశపరీక్ష మేలో జరుగుతుంది. మే నెలాఖరులో ఫలితాలు వెలువడతాయి. సాధారణంగా ఆగస్టులో ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఇదే క్రమంలో యాజమాన్య కోటా సీట్ల భర్తీకి అనుమతినిస్తారు. ప్రైవేటు కాలేజీలు మాత్రం ఈ షెడ్యూల్‌కు విరుద్ధంగా అనధికార అడ్మిషన్లు కొనసాగిస్తున్నాయి.

## విద్యార్థుల జాబితా సేకరణ

ప్రతి ఇంటర్ కాలేజీ నుంచి సెకండియర్ విద్యార్థుల వివరాలను ఆయా ఇంజనీరింగ్ కాలేజీల తరపున కన్సల్టెన్సీలు, పీఆర్వోలు సేకరిస్తున్నారు. అంతర్గతంగా జరిగే పరీక్షల్లో వారి మార్కులను పరిశీలిస్తున్నారు. జేఈఈ, ఇంజనీరింగ్ కోచింగ్ కోసం నిర్వహించే పరీక్షల్లో వచ్చే మార్కులను పరిశీలిస్తున్నారు. దీని ఆధారంగా విద్యార్థులను కేటగిరీలుగా విభజిస్తున్నారు. టాప్ ర్యాంకులు వస్తాయనుకునే, విద్యార్థులను మినహాయించి ద్వితీయ శ్రేణి విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. కోరుకున్న బ్రాంచీలో సీట్లు ఇస్తామని చెబుతున్నారు. డీమ్డ్, అటానమస్ కాలేజీలు మరో అడుగు ముందుకేస్తున్నాయి. ఇంజనీరింగ్ ఫైనలియర్‌లో క్యాంపస్ నియామకాలు ఉంటాయని.. ఉద్యోగం కచ్చితంగా లభిస్తుందని చెబుతున్నాయి. కొన్ని సంస్థలతో ఉపాధికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇప్పిస్తామంటున్నాయి.

## రంగంలోకి కన్సల్టెన్సీలు

పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్లు, కన్సల్టెన్సీ సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులకు మెసేజీలు పంపుతూ ముందే సీటు బుక్ చేసుకోవాలని కోరుతున్నాయి. కాలేజీల్లో చేరుస్తామని చెప్పే వారి నుంచి అడ్వాన్స్‌లు తీసుకుంటున్నాయి. మరికొందరి నుంచి సమ్మతి పత్రాలపై సంతకాలు పెట్టించుకుంటున్నాయి. సెట్‌కు ముందు

మిగతా 2వ పేజీలో ▶

# ముందే 'సెట్' చేద్దాం!

▶ మొదటి పేజీ తరువాయి

చేరే విద్యార్థులకు రాయితీలతోపాటు కోరుకున్న బ్రాంచీల్లో సీట్లు ఇస్తామని హామీ ఇస్తున్నాయి. కన్సల్టెన్సీ సంస్థలకు కొన్ని ఇంజనీరింగ్ కాలేజీలు భారీ కమీషన్లు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. తల్లిదండ్రులు, విద్యార్థులను తమ వైపు తిప్పుకోవడంపై కొన్ని కాలేజీలు పీఆర్వోలకు ఏకంగా శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తున్నాయి. యాజమాన్య కోటా సీట్ల భర్తీని ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ఉన్నత విద్యామండలి గతేడాది ప్రభుత్వానికి నివేదిక పంపగా దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఇప్పట్నుంచే కాలేజీలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి.

నమస్తే తెలంగాణ హైదరాబాద్, సోమవారం 12 జనవరి 2026

# ఎప్‌సెట్ హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్

- పరిశీలనలో మరో విడత మాక్ కౌన్సెలింగ్
- డిగ్రీ ఇంటర్న్‌షిప్, స్టైపెండ్
- డిగ్రీ కోర్సుల్లో 50% అమ్మాయిలే
- 'నమస్తే తెలంగాణ'తో ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : ఎప్‌సెట్ సహా అన్ని రకాల ప్రవేశ పరీక్షల హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించనున్నట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల అడ్రస్‌ను విద్యార్థులు సులభంగా తెలుసుకునేందుకు క్యూఆర్‌కోడ్ ముద్రిస్తున్నామని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, లా, ఎంబీఏ, ఎంసీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియను ఉన్నత విద్యామండలి ఇటీవలే ప్రారంభించింది. ప్రవేశ పరీక్షలు నిర్వహించే వర్సిటీలను ఖరారుచేయడమే కాకుండా కన్వీనర్లను సైతం నియమించింది. పరీక్షల షెడ్యూల్‌ను సైతం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో బాలకిష్టారెడ్డి ఆదివారం 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు. ఎప్‌సెట్ వెబ్‌కౌన్సెలింగ్‌లో ఈ ఏడాది మరో విడత కౌన్సెలింగ్‌ను జోడించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. అన్ని రకాల ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్లు ఫిబ్రవరిలో విడుదల చేస్తామని వెల్లడించారు. డిగ్రీ కోర్సుల్లో 50% అమ్మాయిలే ఉన్నట్టు పేర్కొన్నారు. ఫస్టియర్‌లో 2,05,140 మంది చేరితే, వీరిలో 1,08,941 మంది అమ్మాయిలే ఉన్నట్టు తెలిపారు. అన్ని వర్సిటీల్లో కామన్ క్రెడిట్ విధానం అమలుకు నిర్ణయించి, డిగ్రీ క్రెడిట్లను 142గా ఖరారు చేశామని తెలిపారు. డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌తోపాటు స్టైపెండ్‌ను కూడా అందజేస్తామని తెలిపారు. విద్యార్థులకు నైపుణ్యాలు కల్పించడం కోసం నాస్కామ్ తో, ఫార్మా పరిశ్రమల్లో అవకాశాల కల్పనకు బల్క్‌డ్రగ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్‌తో, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ కోసం టీశాట్ సంస్థతో, విద్య సహకారం, ఉపాధి, ఆవిష్కరణల కోసం యూనివర్సిటీ ఆఫ్ శాన్‌డియాగోతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు.

ఆంధ్రప్రభ

హైదరాబాద్

శనివారం 10-1-2026

# ఉన్నత విద్యామండలి క్యాలెండర్ ఆవిష్కరణ




**హైదరాబాద్,ఆంధ్రప్రభ:**తెలంగాణ ఉన్నత విద్యామండలి సరికొత్త క్యాలెండర్‌ను ఆవిష్కరిం చింది. కేవలం తేదీలను సూచించే క్యాలెండర్‌గానే కాకుండా, విద్యార్థులు, అధ్యాపకుల్లో మేధోపరమైన చర్చను రేకెత్తించేలా రూపొందించిన క్యాలెండర్-కమ్-ప్లానర్-2026ను మండలి ఛైర్మన్ ప్రొ. వి. బాలకిష్టా రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండలి వైస్-ఛైర్మన్లు ప్రొ. పురుషోత్తం, ప్రొ. ఎస్.కె. మహమూద్, కార్యదర్శి ప్రొ. శ్రీరామ్ వెంకటేష్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. విశ్వ విద్యావేత్తలు అనే ఇతివృత్తంతో, ప్రపంచవ్యాప్తంగా జ్ఞాన వ్యాప్తికి, విద్యా రంగంలో ప్రజాస్వామ్యీ కరణ కు కృషిచేసిన 12 మంది మహనీయులను ఈ క్యాలెండర్ ద్వారా పరిచయం చేశారు. ఈ క్యాలెండర్‌లో ప్రాచీన కాలం నుండి ఆధునిక యుగం వరకు విద్యా విధానాలను ప్రభావితం చేసిన మేధావుల సమాచారాన్ని పొందుపరిచారు.

మన తెలంగాణ
శనివారం 10, జనవరి 2026

# ఉన్నత విద్యామండలి డైరీ, క్యాలెండర్ విడుదల




మనతెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ఉన్నత విద్యామండలి 2026 డైరీ, క్యాలెండర్‌ను ఛైర్మన్ వి. బాలకిష్టా రెడ్డి విడుదల చేశారు. శుక్రవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్‌లు పురుషోత్తం,ఎస్.కె. మహమూద్, కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఛైర్మన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ, ఉన్నత విద్యపై విస్తృత చర్చ జరగాలని ఆకాంక్షించారు.

THE NEW INDIAN EXPRESS
TELANGANA
HYDERABAD
SATURDAY 10.01.2026

EXPRESS READ

## TGCHE releases 2026 planner-cum-calendar

Hyderabad: The Telangana Council of Higher Education (TGCHE) on Friday released an innovative planner-cum-calendar for 2026. TGCHE Chairman Balakista Reddy said that while last year's calendar featured Indian personalities such as Savitribhai Phule, Dr Zakir Hussain and Gautama Buddha for their contributions to education, scientific temper, human rights and rationality, the 2026 edition takes the debate on higher education forward through global thinkers, scholars and activists. He said the new calendar includes figures such as Confucius, Socrates, Quintilian and Michel de Montaigne, whose ideas influenced many aspects of society.

ఈనాడు శనివారం జనవరి 10, 2026

# డిగ్రీలో ఇంటర్న్‌షిప్ తప్పనిసరి

- వర్సిటీలు, ఉన్నత విద్యామండలి నుంచి స్టైపెండ్ చెల్లింపు
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వర్తింపు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలుకు సర్కారు కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: నైపుణ్యాలున్న వారికి మాత్రమే ప్రస్తుతం కొలువులు లభిస్తున్నాయి. మా అవసరాలకు అనుగుణంగా పనిచేయడం అన్నదే ప్రధానం అని పరిశ్రమలు తెగేసి చెబుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం విద్యాశాఖ అధికారులతో ఎప్పుడు సమీక్ష నిర్వహించినా విద్యార్థులకు నైపుణ్యాలు ఎలా పెంచుతారు? ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎలా కల్పిస్తారని ప్రశ్నిస్తున్నారు. అందుకే విద్యాశాఖ ఈ దిశగా రంగంలోకి దిగింది. ప్రాథమికంగా చర్చించాక రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేయాలని నిర్ణయించింది. డిగ్రీ మూడో సంవత్సరంలో ఒక సెమిస్టర్‌లో ఈ సౌకర్యం కల్పించాలని భావిస్తోంది. వచ్చే విద్యాసంవత్సరం(2026-27)లో ఇంటర్న్‌షిప్/అప్రెంటిస్‌షిప్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది.



## విద్యార్థులకు స్టైపెండ్..

ఇంటర్న్‌షిప్ అంటే విద్యార్థులు వివిధ పరిశ్రమలు, కార్యాలయాలు, దుకాణాల్లో కొన్నాళ్లు ఉద్యోగంలా పనిచేయాల్సి ఉంటుంది. ఒక రకంగా ఇది కూడా శిక్షణ. ఉచితంగా ఇంటర్న్‌షిప్ చేయాలంటే వారు ఆసక్తి చూపకపోవచ్చని.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరుతున్న వారిలో అధికశాతం మంది పేద, దిగువ మధ్యతరగతి వారుంటున్నారని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే వారికి ఇంటర్న్‌షిప్ కాలానికి నెలకు కొంత స్టైపెండ్ చెల్లించాలని విద్యాశాఖ నిర్ణయానికి వచ్చింది. అందుకు ఆయా వర్సిటీలు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆ మొత్తాన్ని చెల్లించేలా కసరత్తు చేస్తోంది. వర్సిటీలు తమ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు స్టైపెండ్ చెల్లిస్తాయి. కొంత మొత్తం విద్యామండలి తన వాటాగా ఇస్తుంది. ఆయా పరిశ్రమలు ఇంకొంత చెల్లించేలా చేయాలన్నది ఆలోచన. ఈ దిశగా కసరత్తు జరుగుతోంది.

## అమలు అనుకున్నంత సులభం కాదు!

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ లేదా అప్రెంటిస్‌షిప్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వం, వివిధ నియంత్రణ సంస్థలైన ఏఐసీటీఈ, యూజీసీ చెబుతూనే ఉన్నాయి. ఏఐసీటీఈ దీనికోసం ప్రత్యేక పోర్టల్‌నే ప్రారంభించింది. అయినా అధిక శాతం మంది బీటెక్ విద్యార్థులకే ఇంటర్న్‌షిప్ అమలు కావడంలేదు. ఆయా విద్యాసంస్థలతో పరిశ్రమలకు అనుసంధానం లేదు. ఫలితంగా ఇంటర్న్‌షిప్ కొన్ని ప్రముఖ కళాశాలలకే పరిమితమైంది.

■ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇంజినీరింగ్ సిలబస్‌ను ఉన్నతీకరించేందుకు.. బీటెక్ విద్య స్వరూపాన్ని ఇప్పటికి అనుగుణంగా మార్చేందుకు నియమించిన నిపుణుల కమిటీ పలు సిఫారసులు చేసింది. బీటెక్ రెండో ఏడాది రెండో సెమిస్టర్‌లో ఒకటి, మూడో ఏడాది రెండో సెమిస్టర్ పూర్తయ్యేనాటికి మరొకటి ఇండస్ట్రియల్ ఇంటర్న్‌షిప్‌లు పూర్తి చేయడం తప్పనిసరని పేర్కొంది.

■ తమకు బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు ఇవ్వడానికే ప్రతినెలా ఇబ్బంది అవుతోందని, అభివృద్ధి పనులకు నిధులు అసలే లేవని వర్సిటీలు మొత్తుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో డిగ్రీ విద్యార్థులకు స్టైపెండ్ ఎలా చెల్లించగలమని వైస్ ఛాన్స్‌లర్లు అంతర్గతంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వార్త, హైదరాబాద్, శనివారం 10, జనవరి 2026

# ఉన్నత విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలే లక్ష్యం

## తెలంగాణ ఉన్నత విద్యామండలి 2026 డైరీ, క్యాలెండర్ విడుదల

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నత విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలే లక్ష్యంగా పనిచేయనున్నట్టు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి తెలిపారు. మార్కెట్‌లో ఉన్న అవసరాల మేరకు కొత్త సిలబస్‌ను రూపొందించి.. తెలంగాణ విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా చేయనున్నట్టు తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి రూపొందించిన 2026 సంవత్సరపు డైరీ, క్యాలెండర్‌ను ఆయన శుక్రవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్-1 ప్రొఫెసర్ ఈ పురుషోత్తం, వైస్ ఛైర్మన్-2 ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తోపాటు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. గత ఏడాది భారత రత్నాలు, ఈ ఏడాది విశ్వ విద్యావేత్తలను గౌరవించుకోవాలని భావించినట్టు తెలిపారు. గత సంవత్సరం (2025) క్యాలెండర్‌లో దేశానికి చెందిన మహనీయులైన సావిత్రీబాయి పూలే, డా. జాకిర్ హుస్సేన్, చాణక్యుడు, గౌతమ బుద్ధుడు, గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్, స్వామి వివేకానంద, సర్వేపల్లి రాధాకృష్ణన్, మదర్ థెరిస్సా, గిజుభాయ్ బధేకా, ఏపీజే అబ్దుల్ కలాం, పండిట్ మదన్ మోహన్ మాలవ్య, కైలాష్ సత్యార్థి వంటి ప్రముఖులను గౌరవించినట్లు తెలిపారు. ఈ ఏడాది విద్య వ్యాప్తి, శాస్త్రీయ దృక్పథం, మానవ హక్కులు, హేతువాదాన్ని పెంపొందించడంలో వారి కృషిని దృష్టిలో ఉంచుకుని ఆ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఈ ఏడాది ఉన్నత విద్యపై విస్తృత చర్చకు శ్రీకారం చుట్టనున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే 2026 క్యాలెండర్ ఒక విభిన్నమైన లక్ష్యంతో రూపొందించబడిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా జ్ఞానం, సమాచారం యొక్క వ్యాప్తి, ప్రజాస్వామ్యీకరణలో అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించిన మేధావులు, పండితులు, క్రియాశీలుల ద్వారా ..ఉన్నత విద్యపై చర్చను మరింత ముందుకు తీసుకుపోవాలని మండలి సంకల్పించిందన్నారు. ఈ మహనీయులు.. సామాజికనైతిక విలువలు, విమర్శనాత్మక ఆలోచన, మేధోపరమైన పరిశోధన, విద్యార్థుల పట్ల మానవీయత, నిరంతర అభ్యాసం, తరగతి గదిలో ప్రజాస్వామ్యం, సమస్య పరిష్కార పద్ధతులు, విద్యార్థికేంద్రీకృత విధానాలు, అనుభవపూర్వక అభ్యాసం, ఉపాధ్యాయ శిక్షణ, విభిన్నత (డైవర్సిటీ), సిలబస్‌లో ప్రపంచ దృక్పథాలను పొందుపరచడంలో విశేష సేవలందించారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో 2026 క్యాలెండర్‌లో ప్రముఖ విద్యావేత్తలు.. కన్ఫ్యూషియస్, సోక్రటీస్, క్వింటిలియన్, మిషెల్ డి మోంటైన్, జాన్ లాక్, మేరీ వోల్‌స్టోన్‌క్రాఫ్ట్, హోరేస్ మాన్, జాన్ డ్యూయి, డైసాకు ఇకెడా, సేమోర్ అబ్రే పాపర్ట్, న్గుగే వా తియోంగో, హోమి కె భాభా సేవలను గుర్తుచేసుకోనున్నట్టు బాలకిష్టా రెడ్డి తెలిపారు.

శనివారం । 10 । జనవరి । 2026
హైదరాబాద్ । www.sakshi.com




# ర్యాంకులు రావాల్సిందే!

- ప్రభుత్వ ఆదేశాలతో ఉన్నత విద్యామండలి కసరత్తు
- వర్సిటీలు వెనుకబడటంపై దృష్టి
- ఎన్ఐఆర్ఎఫ్‌కు దరఖాస్తు విధానంలో లోపాలున్నట్టు గుర్తింపు
- వర్సిటీకి ఇద్దరు చొప్పున అవగాహన కల్పించాలని నిర్ణయం
- ప్రత్యేక కన్సల్టెన్సీ ఏర్పాటు.. 21న అవగాహన సదస్సు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు జాతీయ ర్యాంకుల సాధనలో ముందుండేలా చేయడంపై ఉన్నత విద్యా మండలి దృష్టి పెట్టింది. ఇతర అంశాలు పక్కన పెడితే అసలు దరఖాస్తు విధానంలోనే లోపం ఉందని గుర్తించి, వాటిని సరి చేసేందుకు నడుం బిగించింది. ప్రభుత్వ ఆదేశాలతో వాస్తవానికి దీనిపై గత కొంతకాలంగా ఉన్నత విద్యామండలి కసరత్తు చేసింది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకుల్లో వర్సిటీలు ఎందుకు వెనుకబడ్డాయో

మిగతా 18వ పేజీలో ▶

## ఉన్నత విద్యా మండలి కేలండర్, డైరీ ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యా మండలి వినూత్నంగా రూపొందించిన కేలండర్–కమ్–ప్లానర్–2026 డైరీని మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. మండలి వైస్‌చైర్మన్లు ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కే మహమూద్, మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ సహా కార్యాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశానికి విశిష్టమైన సేవలు అందించిన దివంగత ప్రముఖుల చిత్రాలను కేలండర్‌లో పొందుపర్చారు. నైతిక విలువ పెంపు కోసమే సరికొత్త విధానంలో కేలండర్ రూపొందించినట్టు బాలకిష్టారెడ్డి తెలిపారు.

# ర్యాంకులు రావాల్సిందే!

▶ మొదటి పేజీ తరువాయి

గుర్తించింది. దరఖాస్తు విధానంలో లోపాలను అధిగమించేందుకు ప్రతి యూనివర్సిటీ నుంచి ఇద్దరికి దీనిపై అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు ప్రక్రియలో కీలక భూమిక పోషించే నోడల్ అధికారితో పాటు మరో వ్యక్తిని అవగాహన కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలని భావిస్తోంది. దీనికోసం ఓ కన్సల్టెన్సీని అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ఈ నెల 21వ తేదీన మండలి కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తెలిపారు.

### ర్యాంకుల్లో వర్సిటీల వెనుకబాటు

రాష్ట్రంలో వ్యవసాయ యూనివర్సిటీ సహా మొత్తం 13 విశ్వవిద్యాలయాలున్నాయి. ప్రతి సంవత్సరం ప్రకటించే జాతీయ ర్యాంకుల్లో ఇవి వెనుకబడుతున్నాయి. వందేళ్ళ చరిత్ర ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాయానికి ఎన్ఐఆర్ఎఫ్ ఓవరాల్ విభాగంలో 2022లో 46వ ర్యాంకు వస్తే, 2023లో ఇది 64కు 2024కు 70కి పడిపోయింది. అయితే 2025లో 53వ ర్యాంకు సాధించడం కాస్త ఊరట కల్గించే అంశం. టాప్–100 యూనివర్సిటీల ర్యాంకులో 2022లో 22వ ర్యాంకు దక్కించుకున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం 2025లో 30కి పడిపోయింది. సాంకేతిక విద్యకు కీలకమైన జేఎన్‌టీయూహెచ్ ఓవరాల్ ర్యాంకుల్లో అసలు పోటీలోనే లేకపోవడం గమనార్హం. కాగా టాప్–100లో గత ఏడాది వందో ర్యాంకు దక్కించుకుంది. మిగతా వర్సిటీల్లో చాలావరకూ ఏమాత్రం పోటీ పడలేకపోతున్నాయి. అదే సమయంలో ప్రైవేటు విద్యా సంస్థలు జాతీయ ర్యాంకుల సాధనలో దూసుకుపోతున్నాయి. ఈ ర్యాంకులకు విస్తృతంగా ప్రచారం కల్పించి, సీట్లకు డిమాండ్ పెంచుకుంటున్నాయి. ఈ పరిస్థితిని మార్చాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది.

### దరఖాస్తులోనే లోపం

అన్ని యూనివర్సిటీల్లోనూ బోధకుల కొరత ఉంది. 70 శాతం వరకు కాంట్రాక్టు అధ్యాపకులతోనే నెట్టుకొస్తున్నాయి. దీంతో నాణ్యత ప్రమాణాలు దెబ్బతింటున్నాయనేది వీసీల వాదన. ఓయూకు గత కొన్నేళ్ళుగా కేంద్ర సంస్థల నుంచి రావాల్సిన ప్రాజెక్టులు 50 శాతం మేర పడిపోయాయి. ప్రొఫెసర్ల కొరత కారణగా పీహెచ్‌డీలూ తగ్గుతున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తైతే, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుకు దరఖాస్తు చేసే విషయంలో యూనివర్సిటీలు సరైన అవగాహనతో వ్యవహరించడం లేదు. విశ్వవిద్యాలయంలో మూడేళ్ళుగా విద్యార్థుల చేరిక, ఇతర దేశాల విద్యార్థుల సంఖ్య, ఫ్యాకల్టీ, విద్యార్థుల మార్కులు, ఉపాధి అవకాశాలు, అక్కడ జరుగుతున్న పరిశోధనలు ఇలా అనేక అంశాలను ర్యాంకులకు కొలమానంగా తీసుకుంటారు. వీటిని సరైన ఫార్మాట్‌లో, సరైన డేటాతో పంపడంలో వర్సిటీలు దృష్టి పెట్టడం లేదు. ప్రధానంగా ఈ కారణంతోనే ర్యాంకుల్లో వెనుకబడిపోతున్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలోనే వర్సిటీలకు అవగాహన పెంపొందించాలని నిర్ణయించారు.

### ప్రమాణాలకు ర్యాంకులే గీటురాయి



రాష్ట్ర వర్సిటీల ప్రమాణాలకు జాతీయ ర్యాంకులే గీటురాయి. ఎన్ఐఆర్ఎఫ్‌లో ముందుకు వెళ్ళాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీనికి అనుగుణంగానే మరింత అవగాహన కల్పించేందుకు కన్సల్టెన్సీ సంస్థను ఏర్పాటు చేశాం. ఫిబ్రవరిలోగా వర్సిటీలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు కోసం సరైన పద్ధతిలో దరఖాస్తు చేయాలి. ఈ మేరకు అవసరమైన డేటాను పొందుపర్చేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

**- ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి**
**(ఉన్నత విద్యా మండలి చైర్మన్)**

### రీసెర్చ్ డెవలప్‌మెంట్‌పై ఎన్ఐఆర్ఎఫ్ దృష్టి



ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల సాధనంలో రీసెర్చ్ డెవలప్‌మెంట్ అనేది ముఖ్యం . విశ్వవిద్యాలయాల్లో జరిగే పరిశోధనలు, పబ్లిషింగ్స్ కీలక పాత్ర పోషిస్తాయి. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి విద్యార్థులు ఎంత మంది చదువు కోసం ఆయా వర్సిటీలకు వస్తున్నారనేది కూడా చూస్తారు. టీచింగ్, లెర్నింగ్ విధానాలపైనా దృష్టి పెడతారు. ప్రస్తుతం ప్రభుత్వం భారీగా నిధులు ఇవ్వడానికి సిద్ధమవ్వడం, ఫ్యాకల్టీ కొరత తీరుస్తామని హామీ ఇస్తుండటంతో భవిష్యత్‌లో ఓయూ ర్యాంక్ పెరుగుతుందని ఆశిస్తున్నాం.

**- ప్రొఫెసర్ కుమార్ మొలుగరం (వీసీ, ఓయూ)**

ఈనాడు
శుక్రవారం జనవరి 9, 2026

# ప్రతి విద్యాసంస్థలోనూ కౌన్సెలర్ తప్పనిసరి

- 100 మంది విద్యార్థులు దాటితే నియమించుకోవాల్సిందే
- మానసిక ఆరోగ్య విధానం రూపొందించుకోవాలి
- కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లకూ నిబంధనల వర్తింపు
- మార్కులు, ర్యాంకులను బట్టి బ్యాచ్‌లుగా విభజించకూడదు
- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



ఈనాడు, హైదరాబాద్: విద్యార్థుల ఆత్మహత్యల నివారణ... వారి మానసిక ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ర్యాంకులు, మార్కుల వేటలో విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లకు అడ్డుకట్ట వేసేలా మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రంలో వంద మంది విద్యార్థులకు మించి ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలతోపాటు కోచింగ్ సంస్థలు, హాస్టళ్ల నిర్వాహకులు కౌన్సెలర్ లేదా సైకాలజిస్ట్‌ను తప్పనిసరిగా నియమించుకోవాలి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తాజాగా జీవో నం.1 జారీ చేశారు.

## విద్యార్థుల ఆత్మహత్యలను నివారించేందుకు...

విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోతున్న నేపథ్యంలో... వాటిని నివారించే నిమిత్తం అన్ని రాష్ట్రాలు మానసిక ఆరోగ్య విధానాన్ని (మెంటల్ హెల్త్ పాలసీ) రూపొందించుకోవాలని గతేడాది జులై 25న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఈ క్రమంలోనే విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు... ఆత్మహత్యల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యాసంస్థలను ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. మార్గదర్శకాలను పాటించకున్నా... నిబంధనలను ఉల్లంఘించినా విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది. విద్యాసంస్థలన్నీ మెంటల్ హెల్త్ పాలసీ రూపొందించుకోవాలని ఆదేశించింది. కలెక్టర్ ఛైర్మన్‌గా ప్రతి జిల్లాలో జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ నియమించుకోవాలంది. ఆ కమిటీలో విద్య, వైద్యం, బాలల రక్షణ రంగాలకు చెందిన నిపుణులను, సామాజిక స్పృహ ఉన్నవారిని నియమించాలని సూచించింది. ఫిర్యాదులు వచ్చినప్పుడు ఈ కమిటీ తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వం పేర్కొంది.

## మార్గదర్శకాల్లో ముఖ్యమైనవివీ...

- పరీక్షల సమయంలో విద్యార్థులకు నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి. తక్కువ మంది విద్యార్థులున్న విద్యాసంస్థలు మానసిక ఆరోగ్య నిపుణులతో ఒప్పందం కుదుర్చుకొని అవసరమైన కౌన్సెలింగ్ ఇప్పించాలి.
- మార్కులు, ర్యాంకుల ఆధారంగా విద్యార్థులను బ్యాచ్‌లుగా విభజించకూడదు. ముఖ్యంగా శిక్షణ సంస్థలు దీన్ని పాటించాలి. విద్యార్థుల శక్తిసామర్థ్యాలకు మించి వారికి మార్కులు/ర్యాంకుల లక్ష్యం విధించకూడదు.
- ఆత్మహత్యల నివారణకు సహకరించేవారి ఫోన్ నంబర్లు, టెలిమానస్ నంబర్లను హాస్టళ్లు, తరగతి గదులు, కామన్ ఏరియాల్లో ప్రదర్శించాలి. వెబ్‌సైట్‌లోనూ పొందుపరచాలి.
- విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై క్రమంతప్పకుండా ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్ ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి.
- విద్యార్థుల శ్రేయస్సు నిమిత్తం నిర్వహించే మానసిక ఆరోగ్య కార్యక్రమాలతో కూడిన వార్షిక నివేదిక రూపొందించుకోవాలి. వాటిని రాష్ట్ర విద్యాశాఖకు, విశ్వవిద్యాలయాలకు, సీబీఎస్‌ఈ, యూజీసీ, ఏఐసీటీఈ తదితర నియంత్రణ సంస్థలకు సమర్పించాలి.
- క్రీడలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందించే విద్యేతర కార్యక్రమాలు నిర్వహించాలి.
- విద్యార్థుల్లో మానసిక సమస్యలను గుర్తించేందుకు వీలుగా బోధన, బోధనేతర సిబ్బంది సంవత్సరంలో కనీసం రెండుసార్లు మానసిక ఆరోగ్య నిపుణులతో శిక్షణ పొందాలి.
- రెసిడెన్షియల్ విద్యాసంస్థలు ట్యాంపర్ ప్రూఫ్ సీలింగ్ ఫ్యాన్లు లేదా భద్రత పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థులు ఒకవేళ ఉరివేసుకుంటే కిందకు సాగే ఫ్యాన్లను ఇప్పటికే రాజస్థాన్ కోటాలోని శిక్షణ సంస్థలు వినియోగిస్తున్నాయి.
- విద్యార్థులు భవనంపైకి, ముప్పు ఉన్న ఇతర ప్రదేశాలకు వెళ్లకుండా నిషేధించాలి. బాల్కనీలకు ఇనుప గ్రిల్స్ తప్పనిసరిగా బిగించాలి.

# 21 నుంచి జేఈఈ మెయిన్ పేపర్-1

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ పరీక్షల తేదీలపై పూర్తి స్పష్టత వచ్చింది. గత నవంబరులో నోటిఫికేషన్ సమయంలో జనవరి 21-30 మధ్య పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించిన జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) తాజాగా పేపర్-1, పేపర్-2 తేదీలను ప్రకటించింది. తొలి ఐదు రోజులు అంటే.. ఈ నెల 21, 22, 23, 24, 28 తేదీల్లో బీటెక్ సీట్లలో ప్రవేశానికి పేపర్-1 పరీక్షలు నిర్వహిస్తారు. రోజుకు రెండు షిఫ్టుల చొప్పున పరీక్షలు జరుగుతాయి. ఈ నెల 29వ తేదీన బీఆర్క్, బీ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి పేపర్-2 నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. పరీక్షా కేంద్రం ఏ నగరంలో కేటాయించారో (జేఈఈ మెయిన్ సిటీ ఇన్‌ఫర్మేషన్ స్లిప్) గురువారం నుంచి తెలుసుకోవచ్చని, అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబరు, పాస్‌వర్డ్, సెక్యూరిటీ పిన్ ఎంటర్ చేసి మీకు కేటాయించిన నగరం తెలుసుకోవచ్చని పేర్కొంది.

గురువారం । 8 । జనవరి । 2026
హైదరాబాద్ । www.sakshi.com

# ఉమ్మడి ప్రవేశ పరీక్షలపై విస్తృత ప్రచారం

- ప్రతి విద్యార్థికి సెట్ వివరాలు
- పరీక్షల నిర్వహణలో మరింత పారదర్శకత
- ఎప్ సెట్‌పై మరింత దృష్టి... దరఖాస్తులు పెరిగే అవకాశం
- సెట్ కన్వీనర్లతో ఉన్నత విద్యామండలి చైర్మన్ తొలి భేటీ



వివిధ సెట్ల కన్వీనర్లతో మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మే నెలలో మొదలయ్యే ఉమ్మడి ప్రవేశ పరీక్షలపై విస్తృత ప్రచారం కల్పించాలని సెట్ కన్వీనర్లకు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి సూచించారు. ఫోన్ మెసేజ్‌లే కాకుండా వాట్సాప్ పరిజ్ఞానాన్ని కూడా ఉపయోగించుకోవాలని కోరారు. విద్యార్థి స్నేహపూర్వక ధోరణిలో సెట్ నిర్వహణ ఉండాలని ఆకాంక్షించారు. మండలి కార్యాలయంలో ఆయన ఏడు ఉమ్మడి ప్రవేశ పరీక్షల కన్వీనర్లతో తొలిసారి భేటీ అయ్యారు. సమగ్ర వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. రాష్ట్రంలో ఎక్కువ మంది విద్యార్థులు హాజరయ్యే ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్)ను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ మొదలు కొని, ఫలితాలు అందించేవరకూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కోరారు. వారి సందేహాలు తీర్చేలా ఆన్‌లైన్ వేదికను ఏర్పాటు చేయాలన్నారు.

## ఫిబ్రవరిలో నోటిఫికేషన్లు

ఉమ్మడి ప్రవేశ పరీక్షల సమగ్ర నోటిఫికేషన్లను ఫిబ్రవరి మొదటి వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈలోగా అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను సమకూర్చుకోవాలని, మార్పులు, చేర్పులతో విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని భావించారు. గత కొన్నేళ్లుగా చేపట్టిన ఉమ్మడి ప్రవేశ పరీక్షల తీరుతెన్నులు, ఎదురైన సవాళ్లపై సమావేశంలో చర్చించారు. పరీక్ష కేంద్రాల సౌలభ్యం, సాంకేతిక సమస్యలను సెట్ కన్వీనర్లు సమావేశంలో ప్రస్తావించారు. వీటి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టబోతున్నట్టు బాలకిష్టారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సెట్స్ కన్వీనర్లు ప్రొఫెసర్లు కె.విజయకుమార్ రెడ్డి, బి.వెంకట్రామిరెడ్డి, అలువాల రవి, పి.చంద్రశేఖర్, బి.విజయలక్ష్మి, కె.వెంకటేశ్వరరావు, రాజేశ్‌కుమార్, మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంజనీరింగ్ దరఖాస్తులు పెరగొచ్చు

'రాష్ట్రంలో కీలకమైన ఎప్‌సెట్ నోటిఫికేషన్ విడుదలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఇంటర్ హాల్ టికెట్లు విడుదలైన తర్వాత నోటిఫికేషన్ విడుదలపై దృష్టి పెడతాం. 2025 ఎప్‌సెట్‌కు ఇంజనీరింగ్ విభాగానికి 2,07,190 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాది వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అగ్రి, ఫార్మా దరఖాస్తుల సంఖ్య తగ్గవచ్చని భావిస్తున్నాం'

**- ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కె విజయకుమార్ రెడ్డి**

# వర్సిటీ భూములు కాజేసేందుకు కాంగ్రెస్ 'మిషన్‌మోడ్'

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపాటు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యావ్యవస్థను బడ్జెట్ కేటాయింపులు లేకుండా ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం... ఇప్పుడు యూనివర్సిటీల భూములను కాజేయడంపై 'మిషన్ మోడ్'లో పనిచేస్తోందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఎక్స్‌వేదికగా ఆయన స్పందిస్తూ...ప్రభుత్వం జారీచేసిన జీవోను ట్యాగ్ చేసి పోస్ట్‌చేశారు. 'కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నించింది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మొట్టికాయలు వేస్తే వెనక్కు తగ్గింది. ఇప్పుడు ప్రఖ్యాత మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ భూములపై కన్నేసింది. యూనివర్సిటీలోని 50 ఎకరాలను వెనక్కు తీసుకుని మళ్లీ ప్రైవేటుకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసింది'అని మండిపడ్డారు. 'ల్యాండ్ బ్యాంక్ పెంచుకోవడం.. యూనివర్సిటీ భూములను ఆర్థిక దోపిడీకి వాడుకోవడంపైనే రేవంత్ సర్కారు ఆసక్తి చూపిస్తోంది తప్ప రాష్ట్రంలో విద్యావ్యవస్థ, వర్సిటీల పురోగతిని మాత్రం అంధకారంలోకి నెట్టేస్తోంది' అని కిషన్‌రెడ్డి ఆందోళన వెలిబుచ్చారు.

# వర్సిటీల భూముల్లో 'రియల్' దందా చేస్తున్నారు

## ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థను, విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేస్తోందని, చదువులకు నిలయమైన యూనివర్సిటీల్లో రియల్ దందా చేస్తూ, భావితరాల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. యూనివర్సిటీల భూములను ప్రభుత్వం టార్గెట్ చేయడంపై ఆయన ఎక్స్ వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి బలవంతంగా 100 ఎకరాలకు పైగా భూములను లాక్కోగా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాలకు పైగా అటవీ భూమిని తాకట్టు పెట్టి పర్యావరణ వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, తాజాగా మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయానికి చెందిన 50 ఎకరాలపై ప్రభుత్వం కన్ను పడిందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు జ్ఞానాన్ని అందించాల్సిన చోట ఇలా భూములను లాక్కోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. విద్యా సంస్థల భూములను కూడా రియల్ ఎస్టేట్ వెంచర్లలా చూస్తారా? అని హరీశ్‌రావు మండిపడ్డారు.

ఈనాడు

గురువారం జనవరి 8, 2026

# అమ్మాయిలకు అందుబాటులో పరీక్షా కేంద్రాలు

- ఎప్‌సెట్ సహా ప్రవేశ పరీక్షల్లో అమలు
- కన్వీనర్ల సమావేశంలో ఉన్నత విద్యామండలి నిర్ణయం



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే మే నెలలో నిర్వహించే ఎప్‌సెట్, ఎడ్‌సెట్, ఐసెట్ తదితర ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే అమ్మాయిలకు అందుబాటులో ఉండేలా పరీక్షా కేంద్రాలను కేటాయించనున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఛైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి సమక్షంలో బుధవారం సాయంత్రం జరిగిన ఏడు ప్రవేశ పరీక్షల కన్వీనర్ల సమావేశంలో నిర్ణయించారు. మధ్యాహ్నం షిఫ్ట్ పరీక్ష పూర్తయ్యేసరికి సాయంత్రం 6 గంటలవుతోంది. వారికి హైదరాబాద్ నగర శివారులో పరీక్షా కేంద్రాలు కేటాయిస్తే.. ట్రాఫిక్, దూరాభారం వల్ల ఇళ్లకు వెళ్లే సరికి ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో ఉదయం షిఫ్ట్‌లోనే అమ్మాయిలు పరీక్షలు రాసే అవకాశాలపై తొలుత ఆలోచన చేసినా.. ఆన్‌లైన్ పరీక్షల వల్ల నార్మలైజేషన్ సమస్య వస్తుందని చర్చ సాగింది. అందుకే సాధ్యమైనంత వరకు.. జీహెచ్ఎంసీ పరిధిలో దరఖాస్తు చేసుకున్నవారికి హైదరాబాద్ నగరంలోనే పరీక్షా కేంద్రాలు కేటాయించాలని... మధ్యాహ్నం షిఫ్ట్‌లో దాన్ని తప్పనిసరిగా పాటించాలన్న నిర్ణయానికి వచ్చారు. వివిధ ప్రవేశ పరీక్షలకు దాదాపు 50 శాతం మంది అమ్మాయిలే హాజరవుతున్నారు. ఎప్‌సెట్ అగ్రికల్చర్-ఫార్మసీ విభాగంలో 60-70 శాతం మంది వారే ఉంటున్నారు. అందుకే వారి భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు బాలకిష్టారెడ్డి తెలిపారు. గత ఏడాది కంటే ఈ సారి విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయన కన్వీనర్లకు దిశానిర్దేశం చేశారు. పరీక్షా కేంద్రాల పెంపునకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

### ఈ నెలాఖరులో సెట్స్ సమావేశాలు

గత ఏడాదికి భిన్నంగా ఈ సారి ఈ నెలాఖరులోనే ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్స్)పై సమావేశాలు నిర్వహించనున్నారు. అదే సందర్భంలో నోటిఫికేషన్ల జారీ, దరఖాస్తుల స్వీకరణ తదితర పూర్తి షెడ్యూల్‌ను నిర్ణయిస్తారు. మొత్తానికి ఫిబ్రవరి రెండో వారంలోపు నోటిఫికేషన్లు వెలువరించాలని నిర్ణయించినట్లు సమాచారం. దరఖాస్తు ఫీజుల్లో ఎలాంటి మార్పు ఉండదు. సమావేశంలో విద్యామండలి ఉపాధ్యక్షులు పురుషోత్తం, మహమూద్ అలీ, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎప్‌సెట్ కన్వీనర్ ఆచార్య కె.విజయకుమార్‌రెడ్డి, పీజీఈసెట్ కన్వీనర్ ఆచార్య కె.వెంకటేశ్వరరావు, కన్వీనర్లు అలువాల రవి(ఐసెట్), చంద్రశేఖర్(ఈసెట్), వెంకట్రాంరెడ్డి(ఎడ్‌సెట్), రాజేశ్‌కుమార్(పీఈసెట్), విజయలక్ష్మి(లాసెట్) పాల్గొన్నారు.

# ఐఐటీల్లో అమ్మ భాష

## బీటెక్ తొలి సెమిస్టర్.. కోరుకున్న మాధ్యమంలో చదువుకునే వెసులుబాటు

- ఎంటెక్ సిలబస్ ప్రక్షాళన.. ఇంటర్న్‌షిప్ తప్పనిసరి
- క్రీడలు, ఒలింపియాడ్ కోటా సీట్లూ జోసా ద్వారా భర్తీ
- 56వ ఐఐటీ కౌన్సిల్ నిర్ణయాలివీ..




ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులకు ఆంగ్ల భాష సమస్యగా మారకుండా... ఇంజినీరింగ్ విద్యనూ మాతృభాషల్లో అందించాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఐఐటీల్లో బీటెక్ ప్రథమ సెమిస్టర్‌ను వారు కోరుకున్న భాషల్లో చదువుకునే అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. వివిధ రాష్ట్రాలు, వివిధ భాషల్లో ఇంటర్, తత్సమాన చదువు పూర్తి చేసి ఐఐటీల్లో సీట్లు సాధించిన వారు తొలి ఆరు నెలలు ఆంగ్లానికి అలవాటు పడే వరకూ మాతృభాషలో చదువుకునేందుకు వీలుకల్పిస్తారు. ఆయా భాషల్లో పాఠ్యాంశాల వీడియోలను ఉంచుతారు. పుస్తకాలను కూడా ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంచుతారు. ఎవరైనా మాట్లాడుతుంటే అప్పటికప్పుడు ఆంగ్ల ఉపన్యాసాలను ప్రాంతీయ భాషల్లోకి తర్జుమా చేసేలా కృత్రిమ మేధ(ఏఐ)ను సమర్థంగా ఉపయోగించుకోవాలని, అందుకు ఐఐటీలు ఇతర సాంకేతిక విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలవాలని కేంద్ర విద్యాశాఖ సూచించింది.

...మిగతా 2లో

# ఐఐటీలలో అమ్మభాష

(మొదటి పేజీ తరువాయి)

గత ఆగస్టు 25వ తేదీన దిల్లీలో 56వ ఐఐటీ కౌన్సిల్ సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. కేంద్ర విద్యాశాఖ మంత్రి ఛైర్మన్‌గా ఉన్న కౌన్సిల్ సమావేశంలో 23 ఐఐటీల డైరెక్టర్లు, వాటి ఛైర్మన్లు, యూజీసీ, ఏఐసీటీఈ తదితర అధికారులు పాల్గొంటారు. ఐఐటీలకు సంబంధించి ఏ కీలక నిర్ణయమైనా ఇందులోనే తీసుకుంటారు. నాటి సమావేశ తీర్మానాలను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. ప్రథమ సెమిస్టర్ తర్వాత విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. గత రెండేళ్ల నుంచి ఐఐటీ జోధ్‌పుర్‌లో బీటెక్ ఫస్టియర్‌ను హిందీలో చదువుకునే వెసులుబాటు కల్పించారు.

### పరిశ్రమల అవసరాల మేరకు ఎంటెక్...

ఎంటెక్ సిలబస్‌ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు. భారత్‌లో బీటెక్ పూర్తయిన తర్వాత ఎందుకు ఎంటెక్‌లో చేరటం లేదన్న దానిపై చర్చించిన ఐఐటీలు.. అందుకు పరిమితంగా స్పెషలైజేషన్లు ఉండటం, ఇంటర్న్‌షిప్ అవకాశాలు లేకపోవడం కారణంగా భావించారు. అందుకే ఎంటెక్‌లో ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేయాలని నిర్ణయించారు. పరిశ్రమల నిపుణులతో కూడిన కమిటీలను నియమించి.. ఇండస్ట్రీ అవసరాల మేరకు కోర్సులను రూపొందించాలని నిర్ణయించారు.

### మరికొన్ని నిర్ణయాలు...

★ ఒక్కో ఐఐటీలో 3 వేల నుంచి 18 వేల మంది విద్యార్థులున్నారు. వారి మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన కౌన్సెలర్, సైకాలజిస్ట్, సైకియాట్రిస్ట్ లాంటి పోస్టులు సృష్టించనున్నారు. వాటిని రెగ్యులర్ లేదా కాంట్రాక్ట్ విధానంలో నియమించుకుంటారు. విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నందున వాటిని నివారించేందుకు గత కొన్నేళ్లుగా దీనిపై చర్చ సాగుతోంది.

★ ఐఐటీల్లో సీట్లను జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా) ద్వారా భర్తీ చేస్తున్న విషయం తెలిసిందే. క్రీడలు, సైన్స్ ఒలింపియాడ్‌ల ద్వారా కొన్ని సూపర్ న్యూమరరీ సీట్లను ఆయా ఐఐటీలు విడిగా భర్తీ చేసుకుంటున్నాయి. పారదర్శకత కోసం వాటిని కూడా జోసా ద్వారానే భర్తీ చేస్తారు.

★ ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ ఆచార్యులను గుర్తించి వారిని నియమించాలని.. అందుకు అవసరమైతే నిబంధనలను మార్చుకోవాలని కేంద్ర విద్యాశాఖ ఆదేశించింది.

★ ఐఐటీలకు భవిష్యత్తులో కూడా సమర్థులైన డైరెక్టర్లను నియమించేందుకు 300-350 మంది చురుకైన ఆచార్యులను గుర్తించి నాయకత్వ లక్షణాలపై రెండేళ్లపాటు శిక్షణ ఇస్తారు. దీనికి ఐఐఎంల సహకారం తీసుకుంటారు. ఐఐటీలను ఎలా తీర్చిదిద్దాలో ప్రణాళిక రూపకల్పనకు ఐఐటీ 2047 పేరిట విజన్ కమిటీని కేంద్ర విద్యాశాఖ నియమించనుంది.

★ ఈ నిర్ణయాలన్నీ వచ్చే విద్యా సంవత్సరంలో అమలయ్యే అవకాశం లేదని, జోసా ద్వారా క్రీడలు, ఒలింపియాడ్ కోటా సీట్లు, మాతృభాషలో చదువుకునే అవకాశం లాంటివి కొన్ని అమలు కావొచ్చని ఐఐటీ వర్గాలు చెబుతున్నాయి.

ప్రభాత
వెలుగు
గురువారం | హైదరాబాద్
08.01.2026
www.v6velugu.com

# రియల్ దందా కోసమే ఉర్దూ వర్సిటీ భూములు లాక్కుంటున్నరు

○ రాష్ట్ర సర్కార్‌పై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఫైర్

హైదరాబాద్, వెలుగు:

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ (మను) నుంచి 50 ఎకరాలు వెనక్కి తీసుకుంటామంటూ కలెక్టర్ నోటీసులివ్వడంపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర సర్కారు పెద్దలు వేల కోట్ల విలువైన భూములను అమ్మి, దోచుకోవాలనుకుంటున్నారని బండి సంజయ్ ఆరోపించారు. "వర్సిటీల్లో కనీస సౌకర్యాలు కల్పించడం చేతగాని ప్రభుత్వం.. ఉన్న భూములను లాక్కోవడం సిగ్గుచేటు. పాతబస్తీలో సల్కం



చెరువును కబ్జా చేసిన ఒవైసీపై చర్యలు తీసుకోలేని సర్కార్.. విద్యార్థుల భవిష్యత్ అవసరాల కోసం ఉన్న భూములపై పడితే ఊరుకోం. విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం" అని హెచ్చరించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్.. యూనివర్సిటీల భూములను కాజేయడమే పనిగా పెట్టుకుందని, దీనికోసం మిషన్ మోడ్‌లో పనిచేస్తోందని కిషన్ రెడ్డి విమర్శించారు. "మొన్న హెచ్‌సీయూ భూములను ప్రైవేటు పరం చేయబోయి సుప్రీంకోర్టుతో మొట్టికాయలు తిన్నారు. ఇప్పుడు ఉర్దూ వర్సిటీపై పడ్డారు. ల్యాండ్ బ్యాంక్ పేరుతో రియల్ దందా చేస్తూ ఖజానా నింపుకోవడానికే రేవంత్ రెడ్డి సర్కారు ఆసక్తి చూపిస్తోంది" అని మండిపడ్డారు.

# ఫిబ్రవరిలో సెట్స్ నోటిఫికేషన్

○ టీజీసీహెచ్ఈ చైర్మన్ బాలకిష్టారెడ్డి



హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో వివిధ ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్టుల (సెట్స్) నోటిఫికేషన్లను ఫిబ్రవరిలో విడుదల చేయనున్నట్టు హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని టీజీసీహెచ్ఈ కార్యాలయంలో సెట్స్ కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ, షెడ్యూల్ ఖరారుపై చర్చించారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ అయిన వెంటనే ఎప్‌సెట్ షెడ్యూల్ విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు నుంచే వివిధ ప్రవేశపరీక్షల షెడ్యూల్ రిలీజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిసైడ్ అయ్యారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. ప్రవేశ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని, ఈసారి కూడా సెట్స్ నిర్వహణలో తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టీజీసీహెచ్ఈ వైస్ చైర్మన్లు ఇటిక్యాల పురుషోత్తం, మహమూద్, సెక్రటరీ శ్రీరామ్ వెంకటేశ్, ఎప్‌సెట్ కన్వీనర్ విజయకుమార్ రెడ్డి, వివిధ సెట్స్ కన్వీనర్లు ఏ.రవి, వెంకటేశ్వర్ రావు, విజయలక్ష్మి, రాజేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీల్లో భూదందాలా?

○ వాటిని రియల్ ఎస్టేట్ వెంచర్లలా చూస్తరా?: హరీశ్ రావు



హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను, విశ్వవిద్యాలయాలను రేవంత్ ప్రభుత్వం నాశనం చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. యూనివర్సిటీల్లో రియల్ ఎస్టేట్ దందా చేస్తూ భావితరాల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. భావితరాలకు జ్ఞానాన్ని అందించే పరిశోధనా కేంద్రాలను కాపాడుకోవడమే అభివృద్ధి అని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. "మొన్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి బలవంతంగా 100 ఎకరాలకు పైగా భూములను లాక్కున్నారు. 60 ఏండ్లుగా ఎంతో కష్టపడి కాపాడుకుంటూ వస్తున్న ఔషధ, సుగంధ మొక్కల పరిశోధనా కేంద్రంలోని 60 ఎకరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాలకుపైగా అటవీ భూమిని తాకట్టుపెట్టి విధ్వంసం చేశారు. తాజాగా మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ వర్సిటీకి చెందిన 50 ఎకరాలను కూడా రేవంత్ ప్రభుత్వం లాక్కోవాలని చూస్తోంది" అని హరీశ్ మండిపడ్డారు.

# రానున్న రోజుల్లో ఉద్యోగావకాశాలు అపారం

హైదరాబాద్ సిటీ, జనవరి6 (ఆంధ్రజ్యోతి): సముద్ర అంతర్భాగం నుంచి ఆకాశయానం వరకు రానున్న రోజుల్లో ఉద్యోగ అవకాశాలు అపారంగా వస్తాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా మారిటైమ్ (సముద్ర)రంగంలో కొన్నిలక్షల కొలువులు అవసరమవుతాయని చెప్పారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో 'మహిళల ఆత్మకథలు, జీవిత చరిత్రలు - సమాలోచనం'పై మంగళవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఆచార్య వి. బాలకిష్టారెడ్డి జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏరోస్పేస్, డిఫెన్స్, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలని అభిలాషించారు. ప్రముఖ సాహిత్య విమర్శకురాలు ప్రొ. కాత్యాయని విద్మహే కీలకోపన్యాసం చేస్తూ వివక్ష, అసమానతలు, హింస వంటి అవాంతరాలు, అడ్డంకులను దాటి.. విముక్తి వైపు ఆధునిక మహిళ ప్రయాణించడానికి అవసరమైన స్ఫూర్తిని ఆత్మకథలు, జీవిత చరిత్రలు అందిస్తాయని అన్నారు. వర్సిటీ వీసీ ప్రొ. సూర్యాధనంజయ్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు సాగే ఈ సదస్సులో 55మంది మహిళల ఆత్మకథలు, స్వీయచరిత్రలు... ఒక్కొక్క పుస్తకంపై ఒక్కో వక్త సంభాషిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్ లోకపావని, అసిస్టెంట్ ప్రొఫెసర్ దేవేంద్ర, ఓయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకరశర్మ, ఎస్. రఘు తదితరులు పాల్గొన్నారు.




సదస్సులో మాట్లాడుతున్న బాలకిష్టారెడ్డి

# ఇక డీమ్డ్ వర్సిటీలు ఉండవు

## అవి పూర్తి స్థాయి విశ్వవిద్యాలయాలే




**న్యూఢిల్లీ :** ఇకపై యూనివర్సిటీల పేర్లకు ముందు 'డీమ్డ్' అనే ట్యాగ్ కనిపించదు. అవన్నీ ఇక పూర్తి స్థాయి విశ్వవిద్యాలయాలుగా పనిచేస్తాయి. వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ (వీబీఎస్ఏ) బిల్లు రూపకల్పనే దీనికి కారణం. అత్యుత్తమ పనితీరు కనబరచిన కళాశాలలకు డిగ్రీలు ప్రదానం చేసే అధికారాన్ని కూడా ఈ బిల్లు కేంద్రానికి కట్టబెట్టబోతోంది. యూజీసీ చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్ర చట్టాల ద్వారా ఏర్పడిన యూనివర్సిటీలు, ఆ చట్టం ద్వారా ఏర్పడిన డీమ్డ్-టు-బి-యూనివర్సిటీలు విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయాల్సి ఉంటుంది. అయితే నరేంద్ర మోడీ ప్రభుత్వం యూజీసీ చట్టం, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చట్టం, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ చట్టం...ఈ మూడింటినీ రద్దు చేసి వాటి స్థానంలో ప్రతిపాదిత వీబీఎస్ఏ చట్టాన్ని ముందుకు తెచ్చింది. యూజీసీ చట్టం రద్దుతో డీమ్డ్-టు-బి- యూనివర్సిటీల ఏర్పాటు నిబంధనకు కాలం చెల్లుతుంది. ప్రస్తుతం మన దేశంలో 150 డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయి. 2000-2010 మధ్య కాలంలో ఇలాంటి విద్యా సంస్థల సంఖ్య బాగా పెరిగింది. అర్హత లేని సంస్థల నుంచి డీమ్డ్ ట్యాగ్ తొలగింపుపై సూచనలు అందజేసేందుకు 2009లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ సమయంలో పనిచేస్తున్న 126 సంస్థలలో 44 సంస్థల నుంచి ట్యాగ్‌ను తొలగించాలని కమిటీ ప్రతిపాదించింది. అయితే ఆ సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించి ఊరట పొందాయి. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం ముందుకు తెచ్చిన బిల్లు డీమ్డ్-టు-బి-యూనివర్సిటీ కాన్సెప్ట్‌కు స్వస్తి చెప్పాలని కోరుతోంది. ప్రముఖ కళాశాలలకు డిగ్రీలు ప్రదానం చేసే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి దఖలు పరచే దిశగా ఓ నూతన యంత్రాంగాన్ని తీసుకొచ్చింది. వీబీఎస్ఏలో నియంత్రణ మండలి ఉంటుంది. అది ఆయా కళాశాలల నుంచి వచ్చే దరఖాస్తులను అధ్యయనం చేసి డిగ్రీలు ప్రదానం చేసేందుకు అనుమతిస్తుంది. నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి పొంది, విశ్వవిద్యాలయం కాకుండా మరేదైనా గుర్తింపు పొందిన ఉన్నత విద్యా సంస్థకు డిగ్రీలు ప్రదానం చేసే అధికారాన్ని ఇవ్వవచ్చునని బిల్లు చెబుతోంది. ఒకవేళ ఆ కళాశాలలు నిబం ధనలను ఉల్లంఘిస్తే దానికి ఇచ్చిన అధికారాన్ని రద్దు చేసి, ఆ అధికారాన్ని నియంత్రణ మండలికి ఇస్తారు.

ఈనాడు                                                                                 బుధవారం జనవరి 7, 2026

# సులువా/కఠినమా.. ప్రశ్నల ఛాయిస్ మీదే!

- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అమలుకు కసరత్తు
- కంప్యూటరైజ్డ్ అడాప్టివ్ టెస్టింగ్ విధానాన్ని సిఫారసు చేసిన ఐఐటీ కాన్పూర్
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలో అత్యంత కఠిన పరీక్షల్లో ఒకటైన జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సంబంధించి కోచింగ్ పరిశ్రమ ప్రాబల్యాన్ని అరికట్టడం, విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందరికీ ఒకటే ప్రశ్నపత్రం కాకుండా... విద్యార్థుల విద్యా సామర్థ్యాలకు అనుగుణంగా ప్రశ్నలు ఇచ్చే కంప్యూటరైజ్డ్ అడాప్టివ్ టెస్టింగ్(క్యాట్) తరహా విధానాన్ని అమలు చేయాలని భావిస్తోంది. ఈ విధానంపై అధ్యయనం చేసిన ఐఐటీ కాన్పూర్ కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే సిఫారసు చేసింది.

- ఈ విధానంలో తొలుత తేలికపాటి ప్రశ్నలు వస్తాయి. వాటికి సరైన జవాబులు గుర్తించేకొద్దీ ప్రశ్నల కఠిన స్థాయి పెరుగుతూ పోతుంది. ఒకరకంగా ఒక్కో విద్యార్థికి ఒక్కో ప్రశ్నపత్రం అన్నట్లే. మరో మాటలో వ్యక్తిగత పరీక్షలనీ చెప్పొచ్చు.
- విద్యార్థులు కఠిన ప్రశ్నలకు సరైన సమాధానమిస్తే అధిక మార్కులు, తేలిక ప్రశ్నలకు సరైన జవాబులిస్తే తక్కువ మార్కులు వస్తాయి.
- ప్రస్తుత విధానంలో జేఈఈ మెయిన్‌లో కనీస మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ రాస్తున్నారు. మొదటి ర్యాంకు వచ్చిన వారికి... చివరి ర్యాంకు వచ్చిన వారికీ ఒకే ప్రశ్నలు ఉంటున్నాయి.



- కొత్త విధానంలో అభ్యర్థి సరైన సమాధానాలు చెప్పేకొద్దీ క్లిష్టమైన ప్రశ్నలు వస్తుంటాయి. తప్పుగా జవాబులిస్తే సులభమైన ప్రశ్నలు వస్తాయి. వాటి ఆధారంగా వెంటనే స్కోర్ లభిస్తుంది.
- తొలుత ప్రయోగాత్మకంగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి... వచ్చిన ఫలితాల ఆధారంగా అడాప్టివ్ టెస్టింగ్ విధానాన్ని అమలు చేసేందుకు దశలవారీగా రోడ్ మ్యాప్ రూపొందించుకోవాలని కేంద్రం భావిస్తోంది.

కొత్త విధానంతో తల్లిదండ్రులపై ఆర్థిక ఒత్తిడి కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. అమలుకు సూత్రప్రాయంగా అంగీకరించిన కేంద్ర విద్యాశాఖ.. విధివిధానాల రూపకల్పనకు కార్యాచరణ

ప్రారంభించాలని ఐఐటీ కాన్పూర్‌కు సూచించింది. అయితే, ఈ కొత్త విధానం అమలుకు ఏడాది కాలం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. రానున్న సే నెలలో కాకుండా 2027 మేలో జరిగే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అమలుకు అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం జేఈఈ మెయిన్‌ను దాదాపు 14 లక్షల మంది రాస్తున్నారు. వారిలో 2.50 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత సాధిస్తున్నారు.

### ఐఐటీ కాన్పూర్ సిఫారసులు ఇవీ...

- తగిన అడాప్టివ్ టెస్టింగ్ విధానాన్ని రూపొందించేందుకు నిపుణుల కమిటీని నియమించాలి. అందుకు ఐఐటీ కాన్పూర్ నేతృత్వం వహిస్తుంది.
- జేఈఈ అడ్వాన్స్‌డ్ అసలు పరీక్షకు రెండు నెలల ముందు నమూనా పరీక్ష(మాక్ టెస్ట్) ఉచితంగా నిర్వహించాలి. దీనివల్ల విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను అంచనా వేసుకొని... అసలు పరీక్ష నాటికి మరింత సన్నద్ధం అవుతారు.
- ప్రశ్నలను ఉత్పత్తి చేసే టూల్‌ను అభివృద్ధి చేయాలి. సులభం, మధ్యస్థం, కఠినం లాంటి ప్రశ్నలను రూపొందించే టెక్నాలజీని తయారు చేసుకోవాలి.

# రేపటి భవిష్యత్తు నేటి విద్యార్థినులదే



సదస్సులో మాట్లాడుతున్న ప్రొ.జి.బాలకిష్టారెడ్డి

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: మహిళలు నేడు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారని.. రేపటి భవిష్యత్తు నేటి విద్యార్థినులదేనని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొ. జి.బాలకిష్టారెడ్డి అన్నారు. కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళావిశ్వవిద్యాలయం తెలుగు శాఖ, రూసా, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంయుక్తాధ్వర్యంలో వీసీఐడబ్ల్యూలో నిర్వహిస్తున్న 'మహిళల ఆత్మకథలు, జీవిత చరిత్రలు-సమాలోచనం' రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును మంగళవారం ప్రారంభించారు. సభాధ్యక్షులు వీసీఐడబ్ల్యూయూ ఇన్‌ఛార్జి వీసీ ప్రొ.సూర్యా ధనుంజయ్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ, ఊడుకూరు లక్ష్మీకాంతమ్మ, సావిత్రీబాయి పులె, మాలావత్ పూర్ణ వంటి వారి జీవిత ప్రయాణాలు ఎందరికో దారి దీపంలా నిలుస్తాయని పేర్కొన్నారు. ఓయూ తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొ.సాగి కమలాకర శర్మ, ప్రముఖ విశ్లేషకులు ప్రొ.కాత్యాయని, విద్మహే తదితరులు ప్రసంగించారు.

యూజీసీ వేతనాలు ఇంకెప్పుడు?

సుల్తాన్‌బజార్: రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1200 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు యూజీసీ వేతనాలు ఇవ్వాలని అసిస్టెంట్ ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానంటూ ఏడాది కిందట ఇచ్చిన హామీ ఏమైందని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొ.జి.బాలకిష్టారెడ్డిని ప్రశ్నించారు. సదస్సు ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన్ను వీసీఐడబ్ల్యూయూ, ఓయూకు చెందిన పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు అడ్డుకుని ఘెరావ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల అధ్యాపకులతో మండలిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈనాడు బుధవారం జనవరి 7, 2026



# యూజీ కోసం యూఎస్



- అమెరికాలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులపై భారతీయ విద్యార్థుల ఆసక్తి
- 'ఓపెన్ డోర్స్' నివేదికలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై టారిఫ్‌ల మోత మోగించినా.. ఆ దేశంతో ఈమధ్యకాలంలో సంబంధాలు కాస్త క్షీణించినా.. ఇప్పటికీ చదువుల కోసం అమెరికావైపే చూసే యంగిస్థాన్‌ల సంఖ్య తగ్గడం లేదు. 2021-22లో 27,545 మంది, 2022-23లో 31,954 మంది, 2023-24లో 36,053 మంది అక్కడి విద్యాసంస్థల్లో డిగ్రీ(అండర్ గ్రాడ్యుయేట్-యూజీ)లో చేరగా.. 2024-25లో ఆ సంఖ్య 40,135కి పెరిగింది. అక్కడికెళ్లిన విద్యార్థుల్లో 43.40% మంది కంప్యూటర్ సైన్స్ కోర్సులోనే చేరడం విశేషం. 22% మంది ఇంజినీరింగ్, 2.60% మంది మాత్రమే సోషల్ సైన్సెస్‌లో ప్రవేశం పొందారు. అత్యధికంగా 44.40% మంది ఇరాన్ విద్యార్థులు ఇంజినీరింగ్‌లో చేరారు. అమెరికాలో అంతర్జాతీయ విద్యార్థుల చదువులపై ఇటీవల విడుదలైన ఓపెన్ డోర్స్-2025 నివేదిక ఈ ఆసక్తికర అంశాలను వెల్లడించింది. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ (స్టెమ్) కోర్సుల్లో ఆసియా విద్యార్థులే అత్యధికంగా ప్రవేశాలు పొందుతున్నట్లు.. ఐరోపా విద్యార్థులు ఎక్కువ ఒత్తిడి లేని కోర్సులు ఎంచుకుంటున్నారని వరల్డ్ వైడ్ ఎడ్యుకేషన్ అండ్ కెరియర్స్ ఎండీ యు.వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

...మిగతా 2లో

**అమెరికాలో వివిధ కోర్సులు - మొదటిస్థానంలో ఉన్న వివిధ దేశాలకు చెందిన విద్యార్థుల శాతం ఇలా..**

| ఇంజినీరింగ్ | కంప్యూటర్ సైన్స్ | బిజినెస్ మేనేజ్‌మెంట్ | భౌతిక/జీవశాస్త్రాలు | సోషల్ సైన్సెస్ | హెల్త్ | ఇంటెన్సివ్ ఇంగ్లిష్ |
|---|---|---|---|---|---|---|
| ఇరాన్ 44.40 | భారత్ 43.40 | స్పెయిన్ 24.50 | నైజీరియా 18.30 | యూకే 16.10 | కెనడా 10.50 | జపాన్ 8.60 |

## యూజీ కోసం యూఎస్

(మొదటి పేజీ తరువాయి)

సాధారణంగా భారత్‌లో బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)లో సైన్స్, ఇంజినీరింగ్ కలిపే ఉంటాయి. అమెరికాలో మాత్రం ఈ రెండు సబ్జెక్టులు వేర్వేరు. యూఎస్‌లో ఎం.ఎస్. కంప్యూటర్ సైన్స్‌లో చేరే మన భారతీయులు దీనికోసమే కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి ఒకట్రెండు అదనపు సబ్జెక్టులు చదువుతారు. మొత్తమ్మీద మన విద్యార్థుల్లో 65 శాతానికిపైగా మంది కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్‌లోనే ప్రవేశాలు పొందుతున్నారు. ఉన్నత చదువుల కోసం అత్యధికులు టెక్సాస్, న్యూయార్క్, మసాచ్యుసెట్స్, కాలిఫోర్నియా, ఇల్లినోయి రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలను ఎంచుకుంటున్నారు. అందులో 63.10% మంది ప్రభుత్వ విద్యాసంస్థలు, 36.90% మంది ప్రైవేట్ వర్సిటీల్లో చేరుతున్నారు. అండర్‌గ్రాడ్యుయేట్స్ భారతీయ విద్యార్థుల సంఖ్య పెరగగా, పీజీలో మాత్రం 1,96,567 నుంచి 1,77,892కి తగ్గింది. చదువు పూర్తైన తర్వాత ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)లో చేరినవారి సంఖ్య 97,556 నుంచి ఏకంగా 1,43,740కి పెరగడం విశేషం.

బుధవారం | 7 | జనవరి | 2026
హైదరాబాద్ | www.sakshi.com

# ఎప్‌సెట్ ప్రశ్నలు.. ఎలా.. ఎవరితో

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీ సెట్) ప్రశ్నపత్రం రూపకల్పనపై అధికారుల మధ్య సమన్వయం కొరవడుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ సెట్ పరీక్షపై అధికారులు భిన్న ప్రతిపాదనలు ముందుకు తెచ్చారు. అయితే ప్రైవేటు కాలేజీలతో పరోక్ష సంబంధం ఉన్న వారిని తెర మీదకు తేవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సెట్ కో–కన్వీనర్, జేఎన్‌టీయూహెచ్ వీసీ దీనికి సంబంధించిన ప్యానల్‌లోకి కొన్ని పేర్లు సూచించారని, అయితే వారికి క్లీన్ చిట్ లేదని అంటున్నారు. అలాంటి వారికి అవకాశం ఇస్తే పారదర్శకత దెబ్బతింటుందని ఉన్నత విద్యా మండలి అధికారులు అభిప్రాయపడుతున్నట్టు తెలిసింది. ఉమ్మడి ప్రవేశ పరీక్షల కన్వీనర్లు, కో– కన్వీనర్లతో బుధవారం మండలి అధికారులు సమావేశం అవుతున్నారు. ఇందులో ఈఏపీసెట్ ప్రశ్నపత్రాల వ్యవహారంపైనే ప్రధానంగా చర్చించే వీలుందని సమాచారం. ఈఏడాది కూడా ఈఏపీ సెట్ నిర్వహణ బాధ్యతను జేఎన్‌టీయూహెచ్‌కే అప్పగించిన సంగతి తెలిసిందే. మే 4 నుంచి 11 వరకూ పరీక్షలు జరగనున్నాయి.

- 12 సెట్ల ప్రశ్నపత్రాల తయారీకి నిపుణుల కోసం అన్వేషణ
- అధికారుల మధ్య కొరవడిన సమన్వయం
- ప్రైవేటు కాలేజీలతో లింక్ ఉన్న వారి పేర్లు ప్యానల్‌లోకి..!
- నేడు జరిగే సెట్ కమిటీ సమావేశంలో చర్చించే అవకాశం

## ప్రశ్నపత్రం తయారీ ఇలా...

ఇంజనీరింగ్ ప్రశ్నపత్రం రూపకల్పనకు భారీ కసరత్తు జరుగుతుంది. సెట్ కన్వీనర్ ఎంపిక జరిగిన వెంటనే ఈ ప్రక్రియ మొదలవ్వాలి. ముందుగా నిపుణుల నుంచి ప్రశ్నావళిని తీసుకుంటారు. కొన్ని వేల ప్రశ్నలు ఇందులో ఉంటాయి. వీటిల్లో కొన్ని కఠినం, మరికొన్ని మధ్యస్తం, మరికొన్ని తేలికపాటివి ఉంటాయి. ఇందు కోసం ప్రతి సబ్జెక్టు నుంచి ఆరుగురు చొప్పున నిపుణులను ఎంపిక చేస్తారు. ఈ క్రమంలో అనేక నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. సుదీర్ఘ అనుభవం, ప్రైవేటు కాలేజీలతో ఎలాంటి సంబంధాలు ఉండకపోవడంతో పాటు ఎలాంటి ఆరోపణలు లేని వారిని ఎంపిక చేస్తారు. ఒక్కొక్కరూ మూడు సెట్ల ప్రశ్నపత్రాన్ని అందిస్తారు. వీటిని క్రోడీకరించి మొత్తంగా 12 ప్రశ్నపత్రాలు తయారు చేస్తారు. వీటిల్లోంచి మూడు సెట్లను కంప్యూటర్‌కు ఫీడ్ చేస్తారు. ఈ మేరకు సాఫ్ట్‌వేర్‌ను వాడతారు. దీంతో కన్వీనర్‌కు కూడా ప్రశ్నపత్రంలోని ప్రశ్నలు తెలిసే అవకాశం ఉండదు. పాస్ వర్డ్ కన్వీనర్ పర్యవేక్షణలోనే ఉంటుంది. పరీక్షకు కొన్ని నిమిషాల ముందు ఆన్‌లైన్ ద్వారా పరీక్ష కేంద్రానికి మూడింటిలో ఏదో ఒక సెట్‌ను పంపుతారు. ఎక్కడన్నా పేపర్ లీక్ అయితే, మరో సెట్‌ను వినియోగిస్తారు.



## కొందరి పేర్లపై సందేహాలు!

ప్రశ్నపత్రం తయారు చేసే అధ్యాపకుల అకడమిక్ చరిత్రను పరిశీలించి, అవసరమైన వారిని ఎంపిక చేసే అధికారం కన్వీనర్‌కు ఉంటుంది. కానీ ఈసారి కో–కన్వీనర్, వీసీ కొన్ని పేర్లు తెరమీదకు తెచ్చారని, వారిపై ఉన్నత విద్యా మండలి విచారణలో సందేహాలు వ్యక్తమవ్వడంతో ఈ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసినట్టు సమాచారం. ఓ కార్పొరేట్ కాలేజీలో బోధిస్తున్న ముగ్గురు, మరో ప్రైవేటు కాలేజీ యాజమాన్యంతో సన్నిహిత సంబంధాలున్న ఇంకో నలుగురు. ఈ జాబితాలో ఉన్నారని గుర్తించినట్టు తెలిసింది. దీనిపై బుధవారం జరిగే సెట్ కమిటీ సమావేశంలో వివరణ కోరే అవకాశం ఉందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. కాగా సెట్ ప్రశ్నపత్రాల పాస్‌వర్డ్ కూడా తనకూ ఇవ్వాలని జేఎన్‌టీయూహెచ్ ఉన్నతాధికారి ద్వారా కో కన్వీనర్ ఒత్తిడి చేస్తున్నారని, దీనిపై కూడా సమావేశంలో చర్చించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

THE NEW INDIAN EXPRESS

TELANGANA

HYDERABAD

WEDNESDAY 07.01.2026

# TGCHE redraws UG playbook

EXPRESS NEWS SERVICE
@ Hyderabad

THE Telangana Council of Higher Education (TGCHE) has released a comprehensive report outlining major initiatives and reforms, including revision of the undergraduate curriculum for the 2025-26 academic year and introduction of an internship programme to provide hands-on experience in higher education governance.

The measures aim to bridge academia and industry, foster innovation, and build skills in digital transformation and sustainability.

The report covers the period from October 2024 to December 2025 and offers an overview of policy interventions, academic and governance reforms, curriculum restructuring, admissions and examination reforms, research promotion, and student-centric measures undertaken by TGCHE.

These initiatives align with the vision of the Government of Telangana and the National Education Policy-2020. Senior officials recently submitted the report on initiatives, reforms and achievements to the Telangana Governor and Chancellor.

A key highlight is revision of the undergraduate curriculum covering BA, BSc, BCom and BBA programmes. Credits have been rationalised to 142 from 124, in line with the University Grants Commission framework, emphasising skill-based education, reduced student pressure, and stronger English proficiency.

ప్రభాత
వెలుగు
బుధవారం | హైదరాబాద్
07.01.2026
www.v6velugu.com

# ఆ 50 ఎకరాల్లో ఉర్దూ వర్సిటీ విస్తరణ!

## మాస్టర్ ప్లాన్ రెడీ.. డీపీఆర్ కోసం ఎదురుచూస్తున్నం

- రంగారెడ్డి కలెక్టర్ షోకాజ్ నోటీసుపై స్పందించిన 'మనూ' రిజిస్ట్రార్
- సమగ్ర నివేదికకు రెండు నెలల గడువు కోరుతూ లేఖ



**హైదరాబాద్, వెలుగు:**

గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మనూ) భవిష్యత్ అవసరాలు, క్యాంపస్ విస్తరణపై దృష్టి సారించింది. వర్సిటీకి కేటాయించిన భూముల్లో.. మణికొండ జాగీర్ పరిధిలోని 50 ఎకరాల భూమిని వెనక్కి ఎందుకు తీసుకోకూడదో చెప్పాలంటూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జారీ చేసిన షోకాజ్ నోటీసుపై వర్సిటీ సానుకూలంగా స్పందించింది. ఆ భూమిలో చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలను వెల్లడిస్తూ, పూర్తి స్థాయి నివేదిక సమర్పించేందుకు సమయం కావాలని కోరింది. సీపీడబ్ల్యూడీ నుంచి డీపీఆర్ రావాల్సి ఉన్నందున, షోకాజ్ నోటీసుకు పూర్తి స్థాయి వివరణ ఇచ్చేందుకు తమకు రెండు నెలల సమయం కావాలని జిల్లా కలెక్టర్‌ను రిజిస్ట్రార్ అభ్యర్థించారు. వర్సిటీ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ విజ్ఞప్తిని పరిశీలించాలని కోరారు.

**నిర్మాణ పనులు 'యాక్టివ్'గానే..**

రంగారెడ్డి కలెక్టర్ నోటీసుకు సమాధానంగా మనూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్ కె ఇంతియాజ్ అహ్మద్ ఈ నెల 1న లేఖ రాశారు. ఆ 50 ఎకరాల భూమి ఖాళీగా లేదని.. భవిష్యత్ విస్తరణ కోసం రిజర్వ్ చేసినట్టు అందులో పేర్కొన్నారు. విశ్వవిద్యాలయానికి అవసరమైన నూతన అకడమిక్ భవనాలు, విద్యార్థులకు హాస్టళ్లు, సిబ్బందికి నివాస సముదాయాల నిర్మాణ ప్రక్రియ ఇప్పటికే చురుగ్గా సాగుతోందని తెలిపారు. ఈ భూమిలో చేపట్టబోయే ప్రాజెక్టులకు సంబంధించి సీపీడబ్ల్యూడీ హైదరాబాద్ విభాగం 'సమగ్ర ప్రాజెక్టు నివేదిక' (డీపీఆర్)ను సిద్ధం చేస్తోందని వివరించారు. ఆ నివేదిక రాగానే నిధుల మంజూరు కోసం కేంద్ర విద్యాశాఖ, హెఫాకు ప్రతిపాదనలు పంపుతామని లేఖలో పేర్కొన్నారు.

**అసలు విషయం ఇదీ..**

1998లో ఉర్దూ వర్సిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వం గండిపేట మండలం మణికొండ జాగీర్ గ్రామంలోని సర్వే నంబర్ 211, 212లో 200 ఎకరాలను కేటాయించింది. అయితే, ఇందులో 50 ఎకరాలు ఇంకా ఖాళీగానే ఉందని, నిబంధనల ప్రకారం వినియోగంలో లేని ప్రభుత్వ భూమిని ఎందుకు వెనక్కి తీసుకోకూడదో తెలపాలని డిసెంబర్ 15, 2025న రెవెన్యూ శాఖ తరపున రంగారెడ్డి కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. దీనిపై స్పందించిన వర్సిటీ.. తాము ఆ భూమిని వృథాగా ఉంచలేదని, రాబోయే రోజుల్లో భారీ నిర్మాణాలు చేపట్టబోతున్నామని స్పష్టం చేసింది.

## బీఫార్మసీ స్టూడెంట్లకు

# రీఎగ్జామ్స్

### ఈ నెల 27, 29న పరీక్షల నిర్వహణ

**హైదరాబాద్, వెలుగు:** నిరుడు నవంబరులో ప్రైవేటు కాలేజీల సమ్మె కారణంగా పరీక్షలకు దూరమైన బీఫార్మసీ విద్యార్థులకు జేఎన్టీయూహెచ్ పరీక్షలు రాసేందుకు అవకాశం ఇచ్చింది. నవంబరు 4, 6వ తేదీల్లో జరగాల్సిన బీఫార్మసీ పరీక్షలకు అప్పట్లో హాజరుకాలేకపోయిన వారి కోసం ప్రత్యేకంగా రీఎగ్జామ్ షెడ్యూల్ ను విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకార ఈ నెల 27, 29న పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే.. సమ్మె వల్ల హాజరుకాలేకపోయిన వారే కాకుండా.. పరీక్ష రాసినవారికి కూడా అవకాశం కల్పించారు. అప్పుడు ఎగ్జామ్ కు హాజరైన వారు మళ్లీ పరీక్ష రాసుకునేందుకు చాన్స్ ఇచ్చారు. అయితే, పాత మార్కులను వదులుకుంటామని అండర్ టేకింగ్ ఇచ్చి మళ్లీ పరీక్షకు హాజరు కావచ్చని వర్సిటీ అధికారులు ప్రకటించారు.

# ఎప్‌సెట్-2026 దరఖాస్తుకు యాప్!

## ▸▸ అందుబాటులోకి తీసుకురానున్న జేఎన్‌టీయూ

హైదరాబాద్ సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎప్‌సెట్-2026 పరీక్ష దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేసేందుకు జేఎన్‌టీయూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రవేశపరీక్ష దరఖాస్తుల సమర్పణకు 'మొబైల్ అడాప్టివ్ వెబ్ లేదా యాప్‌ను అందుబాటులోకి తేవాలని అనుకుంటున్నారు. ఈ మేరకు బిట్‌శాట్, విట్ శాట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్న పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు వినియోగిస్తున్న మొబైల్ అప్లికేషన్లను అధ్యయనం చేస్తున్నారు. ఆయా యాప్‌ల్లో అభ్యర్థులు మొబైల్ నంబర్ లేదా ఈ-మెయిల్ సాయంతో కేవలం రెండు నిమిషాల్లో అకౌంట్‌ను సృష్టించుకునే అవకాశం ఉంటుంది. ఫొటో, సంతకాలను టాచ్ చేయడం, దరఖాస్తు సమర్పణ, ఫీజు చెల్లింపు, హాల్ టికెట్ జారీ వరకు అన్ని ప్రక్రియలు సులువుగా ఉంటాయి. అలాగే, యూపీఐ, వాలెట్, నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులతో పరీక్ష ఫీజులు చెల్లించే సౌలభ్యం కూడా ఉంటుంది. చివరికి హాల్ టికెట్‌ను యాప్ నుంచే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్ష ఫలితాలను కూడా యాప్‌లోనే తెలుసుకోవచ్చు. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ కూడా టీజీఎప్‌సెట్, పీజీఈసెట్ వంటి ప్రవేశపరీక్షల దరఖాస్తుకు మొబైల్ అప్లికేషన్/యాప్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

# న్యాక్‌గా పైపైకి..!

- రాష్ట్రంలోని 396 ఉన్నత విద్యాసంస్థలకు గుర్తింపు
- రెండేళ్లలో 14వ స్థానం నుంచి 9కి చేరిన తెలంగాణ
- కొత్తగా 98 కాలేజీలకు గ్రేడ్

ఈనాడు, హైదరాబాద్: జాతీయ మదింపు, గుర్తింపు మండలి(న్యాక్) గుర్తింపు సాధిస్తున్న ఉన్నత విద్యాసంస్థల సంఖ్య రాష్ట్రంలో గణనీయంగా పెరుగుతోంది. అత్యధిక న్యాక్ గుర్తింపు కాలేజీలున్న రాష్ట్రాల్లో తెలంగాణ తొమ్మిదో స్థానంలో నిలిచింది. రెండేళ్ల క్రితం వరకు మొత్తం 298 న్యాక్ గ్రేడ్ కళాశాలలు ఉండగా... తాజాగా ఆ సంఖ్య 396కు చేరుకోవడం విశేషం. అత్యధిక న్యాక్ గ్రేడ్ కళాశాలలు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండేళ్ల క్రితం (2023లో) 14వ స్థానంలో ఉంది. దక్షిణాదిలోని మిగిలిన నాలుగు రాష్ట్రాలతోపాటు గుజరాత్, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, యూపీ, పశ్చిమ బెంగాల్ మన కంటే ముందంజలో నిలిచాయి. ఈ ఏడాది హరియాణా, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్‌లను... దాటేసి తొమ్మిదో ర్యాంకు సాధించింది. అయితే, గతంలో మాదిరిగానే దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణది చివరి స్థానమే.




### 65 శాతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు..

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, డిగ్రీ తదితర అన్ని రకాల ఉన్నత విద్యాసంస్థలు కలిపి 2,085 ఉన్నాయి. వాటిలో 396 (19%) విద్యాసంస్థలకే న్యాక్ గుర్తింపు ఉంది. 149 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలుండగా... వాటిలో 97 (65%) కాలేజీలు న్యాక్ గ్రేడ్ పొందటం విశేషం. వీటి సంఖ్య గత రెండేళ్లలో 65 నుంచి 97కి పెరిగింది. కొత్తగా మరో 10 డిగ్రీ కళాశాలలు న్యాక్ కోసం దరఖాస్తు చేసుకున్నాయని... త్వరలో గుర్తింపు రానుందని కళాశాల విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ పరిధిలో 13 వర్సిటీలు ఉండగా... ఇప్పటికీ పాత విశ్వవిద్యాలయాలైన తెలంగాణ, శాతవాహన (కరీంనగర్)లతో

**దక్షిణాదిలో న్యాక్ గుర్తింపు పొందిన విద్యాసంస్థల సంఖ్య**

| రాష్ట్రం | 2023 మే | 2025 ఆగస్టు | వృద్ధి శాతం |
| --- | --- | --- | --- |
| కర్ణాటక | 1,028 | 1,136 | 10.50 |
| తమిళనాడు | 904 | 1,063 | 17.59 |
| ఆంధ్రప్రదేశ్ | 419 | 531 | 26.73 |
| కేరళ | 329 | 438 | 33.13 |
| తెలంగాణ | 298 | 396 | 32.88 |

పాటు కొత్తగా ఏర్పాటైన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, కొత్తగూడెంలోని మన్‌మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి న్యాక్ గుర్తింపు లేదు. ఆచార్యుల పోస్టులే మంజూరు కానందువల్ల రెండు కొత్త వర్సిటీలకు ఇప్పట్లో ఆ గుర్తింపు దక్కే అవకాశం కనిపించడం లేదు. ఇక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో వందకుపైగా న్యాక్ గుర్తింపు సాధించాయి. ఇతర వృత్తి విద్యా సంస్థలతోపాటు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు మాత్రం బాగా వెనకబడ్డాయి. .ఫలితంగా రాష్ట్రం టాప్-5కి చేరుకోలేకపోతోంది. న్యాక్ గుర్తింపు ఉంటే సంబంధిత విద్యాసంస్థలో అధ్యాపకులు, కనీస మౌలిక వసతులున్నట్లుగా భావిస్తారు.

### కేరళను ఏడాదిలో దాటేస్తాం

ప్రైవేట్ కళాశాలలపై దృష్టి సారించాం. సొంత స్థలం, భవనాలున్న వాటిని గుర్తించి దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నాం. అందుకు రూ. లక్ష వరకు ఆర్థిక సహకారం ఇస్తామని ఇప్పటికే ప్రకటించాం. మార్గదర్శనం కూడా చేస్తాం. మరిన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు న్యాక్ దక్కుతుంది. తెలంగాణ, శాతవాహన వర్సిటీలూ ఆ ప్రయత్నాల్లో ఉన్నాయి. దక్షిణాదిలో మన కంటే ముందున్న కేరళను మరో ఏడాదిలో అధిగమిస్తాం.



– ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, ఛైర్మన్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి

శనివారం | హైదరాబాద్
03.01.2026
www.v6velugu.com
ప్రభాత
వెలుగు

# వాట్సాప్‌కే ఇంటర్ హాల్ టికెట్లు

- ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం
- పేరెంట్స్ నంబర్‌కు నేరుగా డౌన్‌లోడ్ లింక్
- తప్పులుంటే ముందే సరిచూసుకునే అవకాశం
- సెకండియర్ హాల్ టికెట్‌పై ఫస్టియర్ మార్కులు
- ఫిబ్రవరి 2 నుంచి ప్రాక్టికల్స్ షురూ

**హైదరాబాద్, వెలుగు:** ఇంటర్మీడియట్ స్టూడెంట్లకు, వారి పేరెంట్స్‌కు తెలంగాణ ఇంటర్ బోర్డు గుడ్ న్యూస్ చెప్పింది. హాల్ టికెట్ల కోసం కాలేజీల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా లింక్‌ను నేరుగా పేరెంట్స్ మొబైల్ నంబర్లకే 'వాట్సాప్' ద్వారా పంపనుంది. ఫిబ్రవరి 2 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 25 నుంచి పబ్లిక్ పరీక్షలు మొదలు కానున్నాయి. ఈ పరీక్షల్లో పారదర్శకత కోసం హాల్ టికెట్లను నేరుగా పేరెంట్స్ నంబర్లకు పంపించాలని ఇంటర్మీడియట్ అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే బోర్డులో రిజిస్టర్డ్ అయిన పేరెంట్స్ ఫోన్లకు వచ్చే లింక్ ద్వారా హాల్ టికెట్ ప్రివ్యూను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫస్టియర్ విద్యార్థులు తమ టెన్త్ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీతో, సెకండియర్ విద్యార్థులు ఫస్టియర్ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీతో ఈ లింక్ ఓపెన్ చేసుకునే అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో హాల్ టికెట్‌లోని గ్రూపు, మీడియం, ఫొటో, సంతకం వంటి వివరాల్లో ఏవైనా తప్పులుంటే వెంటనే కాలేజీ ప్రిన్సిపాల్ లేదా డీఐఈఓ దృష్టికి తీసుకెళ్లి సరిచేయించుకునే వెసులుబాటును బోర్డు కల్పించింది. శనివారం నుంచే పేరెంట్స్ కు మెసేజ్‌లు పంపించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ వివరాల్లో తప్పులుంటే ఒకటి, రెండు రోజుల్లో ఆఫీసర్ల దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. చాలా కాలేజీల్లో యాజమాన్యాలు సరిగ్గా పరీక్షల ముందు హాల్‌టికెట్లను తమ వద్ద పెట్టుకొని స్టూడెంట్లు, పేరెంట్స్‌ను ఫీజుల కోసం వేధిస్తున్నాయి. ఇప్పుడు హాల్ టికెట్లు ఫోన్లకే రానుండడంతో ఇక కాలేజీల చుట్టూ తిరిగే తలనొప్పి తప్పనుంది.

**మార్కుల లిస్ట్ కూడా..**

సెకండియర్ విద్యార్థుల హాల్ టికెట్ ప్రివ్యూలో మరో ప్రత్యేకత ఉంది. ఫస్టియర్‌లో ఏయే సబ్జెక్టులు పాసయ్యారు, ఎన్ని మార్కులు వచ్చాయి, ఏవైనా ఫెయిల్ అయ్యారా అనే పూర్తి వివరాలు ఇంటర్ హాల్ టికెట్ లోనే ప్రింట్ చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులకు తమ పిల్లల చదువుపై క్లారిటీ వస్తుందని బోర్డు తెలిపింది.

**ముఖ్యమైన తేదీలివే..**

**ఇంగ్లిష్ ప్రాక్టికల్స్:** జనవరి 21 (ఫస్టియర్), జనవరి 22 (సెకండియర్)

**ఎథిక్స్ అండ్ ఎన్విరాన్మెంట్:** జనవరి 23, 24 తేదీలు

**జనరల్ ప్రాక్టికల్స్:** ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు

శుక్రవారం । 2 । జనవరి । 2026
హైదరాబాద్ । www.sakshi.com

# ఉన్నత విద్యలో సంస్కరణలు కొనసాగాలి

## మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి ముఖ్యమంత్రి ప్రశంసలు



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యలో సంస్కరణల ఒరవడి ఇదే స్థాయిలో కొనసాగాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉన్నత విద్యా మండలి పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు వినూత్న ఆలోచనలకు ఉన్నత విద్యా మండలి కేంద్ర బిందువుగా నిలుస్తోందని ఆయన మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డిని ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బాలకిష్టారెడ్డి గురువారం కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఆయన సేవలను మెచ్చుకున్నారు.

**TGCHE plans maritime, aviation courses for UG**

Hyderabad: To boost enrolment and reduce academic load, the TGCHE is planning to introduce several new UG courses in 2026-27 academic year like maritime, aviation and defence | P2

THE NEW INDIAN EXPRESS | TELANGANA

02 HYDERABAD FRIDAY 02.01.2026

# TGCHE PLANS MARITIME & AVIATION COURSES

## It's time to update or perish , says TGCHE chairman, steals a march over private colleges

**MEGHNA NATH** @ Hyderabad

WITH twin objectives of increasing enrolment and reducing academic load, the Telangana Council of Higher Education (TGCHE) is planning to introduce several new undergraduate courses in 2026-27 academic year.

According to officials, the move is aimed at enhancing the employability of the students, and among the key new streams likely to be introduced in the upcoming academic year are maritime, aviation and defence.

Curriculum update, the TGHCE officials said, will be a starting point for educational reforms that will help in addressing low student attendance.

Speaking to *TNIE*, TGCHE chairman Prof V Balakista Reddy said, "For the last six months,the council has been working on bringing changes in the degree courses. As I keep



saying, today's mantra is that be updated or you will be outdated."

"In any field, updation is very important. This is more so in the field of education where introduction of new courses and change in syllabus is very vital. All ITIs have been converted into advanced training centres. All 59 polytechnics will also updated very soon. In view of this, we had a meeting recently to discuss what kind of courses are required to prepare our students for their future careers," he added.

Prof Reddy also stressed on the need to introduce courses in emerging and interdisciplinary streams.

"Recently, we also had a meeting with a number of vice-chancellors where we discussed the key academic agenda items, including the importance of systematic academic planning, trends and observations in UG and PG admissions for 2025-26, introduction of new courses in emerging and interdisciplinary areas. We also spoke about the launch of innovative programmes aligned with global and industry needs."

"During our discussion, we realised that students were not enrolling for some courses in certain state-run institutions. Because of this, we thought we can come up with a few new courses," he added.

### Futuristic courses

The TGCHE chairman also revealed plans to involve industries in designing these new courses.

"We are planning to introduce a few futuristic courses. These include maritime, aviation and defence. We came up with this idea because none of the management (private) collages are offering aviation and other courses," he informed.

"We will try to involve industries in designing these courses. The main objective is to make the students industry-ready," he said.

Prof Reddy also said that the council is also trying to address the issues the students face, especially those related to communication.

"As communicating in English is one of the problems the students have been facing, we have come up with English learning material. TGCHE will also help universities in preparing not just syllabus but also reading material," he added.

# CM LAUDS TSCHE REFORMS, CALLS FOR FASTER PACE

HANS NEWS SERVICE
HYDERABAD

- CM Revanth Reddy praises higher education reforms in Telangana
- Urges continuation of momentum and introduction of more reforms
- Government assures full support for future initiatives
- Commends Council Chairman Prof V Balakista Reddy for innovative leadership
- Emphasis on skill development, syllabus changes and global collaborations
- Vision to make Telangana's higher education globally competitive

TELANGANA Chief Minister A Revanth Reddy has lauded the ongoing reforms in higher education, describing them as commendable and urging that the momentum must continue.

Expressing satisfaction with the performance of the Telangana State Council of Higher Education, the CM congratulated its Chairman, Professor V Balakista Reddy, for his leadership and innovative approach.

Balakista Reddy met the Chief Minister on Thursday to extend New Year greetings. On the occasion, the CM acknowledged his services and praised his efforts in coordinating reforms across multiple levels, particularly in skill development. "Well done! This momentum must continue. Bring in more reforms, and the government will provide full support," the CM remarked, highlighting the importance of sustained progress.



Revanth Reddy reiterated his vision that Telangana's higher education system should be able to compete with national and international institutions. Over the past year, Balakista Reddy has worked extensively on syllabus revisions, consultations with international universities, and adopting modern technology to align with global standards. He has kept the Chief Minister regularly informed of these developments, ensuring transparency and accountability in the reform process.

The CM directed that these efforts should continue, stressing the need to move forward in line with educational changes taking place worldwide.

He emphasised that such reforms are vital to equip students with skills relevant to the global economy and to enhance the state's academic reputation.

On his part, Balakista Reddy assured the Chief Minister that he would strive with utmost dedication to fulfill the aspirations of the state government. He reaffirmed his commitment to strengthening higher education in Telangana and to ensuring that reforms translate into tangible benefits for students and institutions alike.

ఆంధ్రప్రభ
హైదరాబాద్
శుక్రవారం 2-1-2026

# ఉన్నత విద్యలో సంస్కరణలు ప్రశంసనీయం

- మరిన్ని సంస్కరణలు తీసుకురండి.. అండగా నేనుంటా
- ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంస

హైదరాబాద్,ఆంధ్రప్రభబ్యూరో: ఉన్నత విద్యలో తాము ఆశించిన విధంగా సంస్కరణలు చేపట్టడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా వ్యవస్థలోనూపెను మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విద్యారంగాన్ని అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లాలని, అందుకే విశ్వ విద్యాలయాలు, ఉన్నత విద్యలో భారీ ఎత్తున మార్పులు చేపడుతున్నామని ఆయన చెప్పారు. ఉన్నత విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలను మండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌ను సచివాలయంలో కలిసి వివరించారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డిని అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ మరిన్ని సంస్కరణలను తీసుకురావాలని సూచించారు. విద్యా, వైద్యరంగాలు ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమైనవని, ఈ రెండు రంగాల్లో ఎటు



వంటి మార్పులు తీసుకువచ్చినా తాను అభినందిస్తానని, అండగా ఉంటానని చెప్పారు. ఉన్నత విద్యలో సంస్కరణల ఒరవడి ఇదేస్థాయిలో కొనసాగాలని, ఎప్పటికప్పుడు వినూత్న ఆలోచనలు ఉన్నత విద్యామండలి కేంద్ర బిందువుగా నిలవడం పట్ల సీఎం రేవంత్ అభినందించారు. నైపుణ్యాభివృద్ధి దిశగా అన్నిస్థాయిల్లో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో పోటీ పడే విధంగా ఉన్నత విద్యారంగాన్ని సంస్కరించాలని సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

సిలబస్‌మార్పు, అంతర్జాతీయ సంస్థలతో సంప్రదింపులు ఆదునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకునేందుకు తీసుకుంటున్న చర్యలను బాలకిష్టారెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కృషి ఇలాగే కొనసాగాలని, ఇతర దేశాల్లో విద్యాపరమైన మార్పులకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలను శక్తివంచన లేకుండా నెరవేర్చేందుకు కృషి చేస్తానని ఈ సందర్భ ంగా బాలకిష్టారెడ్డి ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు.

మన తెలంగాణ
శుక్రవారం 2, జనవరి 2026

# ఉన్నత విద్యలో సంస్కరణలు భేష్

- మరిన్ని తీసుకురండి
- ఛైర్మన్ బాలకిష్టారెడ్డికి సిఎం అభినందనలు



మనతెలంగాణ/హైదరాబాద్ : ఉన్నత విద్యలో సంస్కరణల ఒరవడి ఇదే స్థాయిలో కొనసాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఉన్నత విద్యామండలి పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు వినూత్న ఆలోచనలకు ఉన్నత విద్యామండలి కేంద్ర బిందువుగా నిలుస్తోందని ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డిని సిఎం అభినందించారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం చైర్మన్ బాలకిష్టారెడ్డి సిఎం రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం ఆయన సేవలను ప్రస్తావించారు. నైపుణ్యాభివృద్ధి దిశగా అన్ని స్థాయిల సమన్వయంతో ఛైర్మన్ చేస్తున్న కృషిని సిఎం ప్రశంసించారు. తెలంగాణ ఉన్నత విద్య జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో పోటీ పడే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి వివిధ సందర్భాలలో ఆకాంక్షించారు. సిఎం ఆలోచనలకు అనుగుణంగా ఛైర్మన్ బాలకిష్టారెడ్డి గత ఏడాదిగా అనేక అంశాలపై కసరత్తు చేశారు. సిలబస్ మార్పు, అంతర్జాతీయ సంస్థలతో సంప్రదింపులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకునేందుకు అవసరమైన ఏర్పాట్లపై విస్తృత చర్చలు జరిపారు. ఈ దిశగా సాగుతున్న పురోగతిని ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఈ కృషి ఇలాగే కొనసాగాలని, ఇతర దేశాల్లో వస్తున్న విద్యా పరమైన మార్పులకు అనుగుణంగా ముందుకు వెళ్ళాలని సిఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలను శక్తి వంచన లేకుండా నెరవేర్చేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఛైర్మన్ బాలకిష్టారెడ్డి సిఎం రేవంత్‌రెడ్డి భరోసా కల్పించారు.

శుక్రవారం జనవరి 2, 2026

ఈనాడు

## విద్యామండలి ఇదే ఒరవడి కొనసాగించాలి: సీఎం

ఈనాడు, హైదరాబాద్: ఉన్నత విద్యలో సంస్కరణల ఒరవడి ఇదే రీతిన కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డికి సూచించారు. ఛైర్మన్ గురువారం సచివాలయంలో సీఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యామండలి కార్యక్రమాలు, సంస్కరణలపై సీఎం సంతృప్తి వ్యక్తంచేశారు. ఇతర దేశాల్లో వస్తున్న విద్యాపరమైన మార్పులకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని సీఎం సూచించినట్లు తెలిసింది.

హైదరాబాద్
మంగళవారం 6-1-2026
ఆంధ్రప్రభ



# ఉన్నత విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు

- టీ-జీసీహెచ్ఈ సాధించిన విజయాల నివేదికను గవర్నర్‌కు అందించిన చైర్మన్
- పనితీరును ప్రశంసించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఉన్నత విద్యా రంగంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టీజీసీహెచ్ఈ) పోషిస్తున్న క్రియాశీల పాత్రను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభినందించారు. తెలంగాణ రైజింగ్ - 2047 లక్ష్య సాధన కోసం విశ్వవిద్యాలయాలు, మండలి, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి గత 15 నెలల కాలంలో చేపట్టిన విద్యా సంస్కరణలు, సాధించిన విజయాలపై రూపొందించిన సమగ్ర నివేదికను వివిధ యూనివర్సిటీల వీసీలతో కలసి మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి గవర్నర్‌కు అందజేశారు. అక్టోబర్ 2024 నుండి డిసెంబర్ 2025 వరకు ఉన్నత విద్యా రంగంలో సాధించిన ప్రగతిని ఈ నివేదికలో పొందుపరిచారు. జాతీయ విద్యా విధానం - 2020 (ఎన్ఈపీ-2020) మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలో అకడమిక్ సంస్కరణలు, పాఠ్యప్రణాళిక పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. దోస్త్ ద్వారా డిగ్రీ ప్రవేశాలను బలోపేతం చేయడం, టీజీ సెట్స్ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించడం వంటి కీలక చర్యలు తీసుకున్నారు. పారదర్శక పాలన, అకడమిక్ ఉత్తమత్వం విద్యార్థి కేంద్రిత సంస్కరణల ద్వారా తెలంగాణను ఉన్నత విద్యలో మేటి రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి మండలి కట్టుబడి ఉందని చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్ట రెడ్డి స్పష్టం చేశారు.

## మాస్టర్ కార్తికేయను అభినందించిన గవర్నర్

భారత రాష్ట్రపతి చేతుల మీదుగా బాల్ పురస్కార్ అవార్డు-2025 అందుకున్న మాస్టర్ కార్తికేయ తన కుటుంబ సభ్యులతో కలిసి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు. ఈ మేరకు గవర్నర్ వద్దకు కార్తికేయ కుటుంబాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శాఖ చైర్మన్ ఎస్.ఎం. రాజేశ్వర్‌రావు తీసుకెళ్లారు. మాస్టర్ కార్తికేయ్ 11 ఏళ్ల వయసులోనే తన పర్వతారోహణ ప్రయాణాన్ని ప్రారంభించి, ఈ అసాధారణ విజయాన్ని సాధించేందుకు ఎదురైన కష్టాలు, క్రమశిక్షణ, పట్టుదల గురించి గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ మాస్టర్ కార్తికేయ్ సాధించిన ఈ అసాధారణ విజయాన్ని అభినందిస్తూ, ఆయన ధైర్యసాహసాలు దృఢ సంకల్పాన్ని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో ప్రపంచంలో మరిన్ని ఉన్నత పర్వతారోహణలు అధిరోహించి దశ దిశలో పేరు ప్రఖ్యాతులు సాధించాలని గవర్నర్ ఆకాంక్షించారు. ఇటువంటివారికి తగిన ప్రోత్సాహం అందించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శాఖ చైర్మన్‌ను గవర్నర్ ఆదేశించారు. కార్తికేయకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని పేర్కొన్నారు.

THE HINDU
Hyderabad
Tuesday, January 6, 2026
HYDERABAD

# TGCHE submits year report to Governor

The Hindu Bureau
HYDERABAD

Telangana Council of Higher Education (TGCHE) Chairman V. Balakista Reddy submitted a report on the initiatives and reforms taken by it to Governor Jishnu Dev Varma at Lok Bhavan on Monday (January 05).

The report covering developments from October 2024 to December 2025 present an overview of the policy interventions, academic reforms, governance initiatives, and student measures in alignment with the State government and the Centre's National Education Policy (NEP)-2020, an official release stated.

Mr. Balakista Reddy, it said, highlighted key measures such as the Statewide revision of undergraduate curricula, transparent conduct of CETs,



Governor Jishnu Dev Varma with TGHE Chairman V Balakista Reddy on Monday.

and strengthening of Degree Online Services Telangana (DOST) admissions, steps towards academia-industry collaborations, among other.

Further, the Chairman of TGCHE explained the advisory contributions it made to the State government on faculty service conditions, establishment of new universities and institutions, expansion of RGUKT campuses, and initiatives aimed at inclusivity, skill development, and employability of students in the State.

మంగళవారం | హైదరాబాద్
06.01.2026
www.v6velugu.com
ప్రభాత
వెలుగు

# తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా విద్యాసంస్కరణలు

- గవర్నర్‌కు టీజీసీహెచ్ఈ చైర్మన్ బాలకిష్టారెడ్డి నివేదిక అందజేత

**హైదరాబాద్, వెలుగు:** తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్‌లో 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ సాధన దిశగా కీలక సంస్కరణలు చేపట్టామని తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (టీజీసీ హెచ్ఈ) చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన లోక్ భవన్‌లో జరిగిన వీసీల సమావేశంలో రాష్ట్ర గవర్నర్‌కు మండలి కార్యకలాపాలపై సమగ్ర నివేదికను అందజేశారు. జాతీయ విద్యా విధానం గైడ్ లైన్స్‌కు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగాడిగ్రీ సిలబస్‌ను మార్చినట్టు బాలకిష్టారెడ్డి తెలిపారు. టీజీ సెట్స్ నిర్వహణలో పారదర్శకత, దోస్త్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియను బలోపేతం చేయడం వంటి అంశాలను గవర్నర్‌కు నివేదించారు. కీలక విధాన పరమైన అంశాలపై నిపుణుల కమిటీలను ఏర్పాటు



చేయడంతో పాటు పరిశోధనలు, ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తున్నామన్నారు.

**స్పైక్ 'ఉన్నతి' పెంచాలి : వీసీలకు గవర్నర్ సూచన**

రాష్ట్రంలోని యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో భారతీయ సంస్కృతిని విస్తృతంగా ప్రచారంలోకి తేవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగెస్ట్ యూత్ (స్పైక్ మ్యాకీ) కార్యక్రమంలో భాగంగా యువతలో సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంచడం వల్ల ప్రయోజనాలను అధికారులకు వివరించారు.

# 'విదేశీ' వాటా

## విదేశీ విద్యకు పంపుతున్న మొత్తంలో క్షీణత / మ

భారత్‌లో ఉన్నత విద్యను అంతర్జాతీయీకరించాల్సిన ఆవశ్యకత ఉందని నీతి ఆయోగ్ ఇటీవల స్పష్టం చేసింది. ఇదే జరిగితే ఐటీ నిపుణులు, వైద్యులు, ఇంజనీర్లు, విద్యావేత్తల వంటి నిపుణులకు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మన దగ్గరే ఉన్నత విద్యను అందించవచ్చు. జ్ఞానంతో నడుస్తున్న ప్రపంచంలో భారత్ నుంచి మేధావులు పరాయిగడ్డకు వెళ్లడం పోటీతత్వాన్ని దెబ్బతీస్తుందన్నది నిపుణుల మాట. అయితే విదేశాలలో ఉన్న తమ బిడ్డల చదువుల కోసం భారత్ నుంచి కుటుంబాలు పంపిస్తున్న డబ్బుల వాటా తగ్గుతోంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

మన దేశం నుంచి విదేశాల్లో ఉన్న తమవారికి
రెమిటెన్సుల్లో విదేశీ విద్య వాటా 2014–15లో 2
ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–అక్టోబర్‌లో ఇది
పడిపోయింది.

### వాటా పడిపోయింది..

ఆఫ్ ఇండియా
కృత చెల్లింపుల పథకం కింద విదేశీ విద్యకు భా
దేశాలకు పంపిన మొత్తం 2014–15లో 0.28
నుంచి 2024–25 వచ్చేసరికి 2.92 బిలియన్ డా
వాస్తవానికి దేశ చరిత్రలో అత్యధికంగా 2021–
5.17 బిలియన్ డాలర్లుగా నమోదైంది. 2025–
బర్‌లో 1.43 బిలియన్ డాలర్లు విదేశాలకు చేరి

4 సాక్షి హైదరాబాద్ | మంగళవారం | జనవరి

సాక్షి

మంగళవారం, 6 జనవరి 2026

# సామ్రాజ్యవాద దురహం

తన దుందుడుకు చర్యతో, దుష్ట పోకడతో అమెరికా అధ్యక్షుడ
ప్రపంచాన్ని సంక్షోభం ఊబిలోకి నెట్టేశారు. వెనిజులా రాజధాని కార
లోని అనేక ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి అమెరికా సైన్యం భీక
అధ్యక్షుడు నికోలస్ మదురోనూ, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌నూ క

# 'ఉన్నత' సంస్కరణలతో ఆదర్శంగా నిలుస్తాం

గవర్నర్‌కు వార్షిక నివేదిక అందజేసిన ఉన్నత విద్యా మండలి చైర్మన్



నివేదికను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని, దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి.. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వివరించారు. ఏడాది కాలంలో మండలి చేపట్టిన ప్రణాళికలు, కార్యకలాపాల వార్షిక నివేదికను సోమవారం ఆయన గవర్నర్‌కు అందజేశారు. మండలి అమలు చేస్తున్న సంస్కరణలను ఆ నివేదికలో పొందుపర్చారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచే దిశగా సిలబస్ మార్పులు, సాధారణ డిగ్రీలకు నైపుణ్యం మేళవించే సరికొత్త ఆలోచనలకు తెలంగాణ ఆదర్శంగా నిలవబోతోందని పేర్కొన్నారు. డిగ్రీ కోర్సుల్లో సాంకేతిక నైపుణ్యం పెంచే దిశగా సిలబస్‌లో మార్పులు తుది దశకు చేరుకున్నట్టు తెలిపారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా కోర్సుల రీడిజైన్‌పై మండలి విస్తృతస్థాయి కసరత్తు చేపట్టిన విషయాన్ని బాలకిష్టారెడ్డి ఆ నివేదికలో వివరించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ మహమూద్ ఉన్నారు.

**భారతీయ సంస్కృతిని ప్రచారం చేయాలి: వీసీలకు గవర్నర్ సూచన**

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు ఉన్నత విద్యా సంస్థల్లో భారతీయ సంస్కృతిని విస్తృతంగా ప్రచారంలోకి తేవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విశ్వవిద్యాలయాల వీసీలకు సూచించారు. లోక్ భవన్‌లో పలువురు వీసీలు, ఉన్నత విద్యామండలి అధికారులతో ఆయన భేటీ అయ్యారు. సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగెస్ట్ యూత్ (స్పిక్ మ్యాకీ) కార్యక్రమంలో భాగంగా యువతలో సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంచడం వల్ల ప్రయోజనాలను ఆయన వివరించారు.

# ఐఐటీహెచ్‌లో 62 శాతం విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు



- అత్యధికంగా ఏఐలో 83 శాతం మందికి ఉద్యోగాలు
- ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఐఐటీ హైద రాబాద్‌లో చదువుకున్న విద్యార్థుల్లో 62.42 శాతం మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు లభించాయని సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమ సంస్థలో ఈ సారి మొత్తం 487 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ల కోసం నమోదు చేసుకోగా..304 మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. సగటున రూ.30 లక్షల వార్షిక ప్యాకేజీతో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో 83.3 శాతం మందికి ప్లేస్‌మెంట్లు వచ్చాయని ఆయన వెల్లడించారు. ఐఐటీ హైదరాబాద్ చరిత్రలోనే అత్యధికంగా రూ.2.5 కోట్ల వార్షిక ప్యాకేజీతో ప్లేస్‌మెంట్ సాధించిన ఎడ్వర్డ్ వర్గీస్ అనే సీఎస్ఈ విద్యార్థిని ఈ సందర్భంగా బీఎస్ మూర్తి అభినందించారు. ఇద్దరు విద్యార్థులకు రూ.1.1 కోట్లు, రూ.75 లక్షల వార్షిక ప్యాకేజీలతో ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఐఐటీహెచ్‌లో ఈనెల 9 నుంచి 11 వరకు టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

**దివ్యాంగుల కోసం ప్రత్యేక సేవా విభాగం**

ఐఐటీ హైదరాబాద్ సంస్థ దివ్యాంగుల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తోంది. సెంటర్ ఫర్ అసిస్టివ్ టెక్నాలజీ అనే ఈ విభాగం ద్వారా దివ్యాంగులకు ప్రత్యేక సేవలు అందించాలని సంస్థ నిర్ణయించింది. ఇక్కడ చదువుకునే దివ్యాంగ విద్యార్థులు హాస్టల్ నుంచి క్లాస్‌రూమ్‌కు, లైబ్రరీ, రీసెర్చ్ పార్కులకు వెళ్లాలంటే కొంత ఇబ్బందులు పడుతుంటారు. ఈ విభాగంలో పనిచేసే వారు ఈ దివ్యాంగ విద్యార్థులను దగ్గరుండి తీసుకెళ్లేలా సేవలందిస్తారు. వీరి కోసం ప్రత్యేక వీల్‌చైర్లను అందుబాటులో ఉంచుతారు.

ఈనాడు

మంగళవారం జనవరి 6, 2026

# వచ్చే రెండేళ్లలో భూవిజ్ఞాన వర్సిటీకి రూ.500 కోట్లు

- శాసనసభలో మంత్రి దామోదర్ రాజనర్సింహ
- విద్యా సంస్థల సమస్యలపై త్వరలో సమావేశం నిర్వహిస్తామని వెల్లడి
- విశ్వవిద్యాలయ ఏర్పాటు బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: కొత్తగూడెంలో నెలకొల్పిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ భూవిజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని వచ్చే రెండేళ్లలో రూ.500 కోట్లతో అభివృద్ధి చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. వర్సిటీ విస్తరణకు 310 ఎకరాల భూమి అందుబాటులో ఉందన్నారు. భూవిజ్ఞాన వర్సిటీకి చట్టబద్ధత కల్పించేందుకు తెలంగాణ వర్సిటీల చట్టం-1991కు సవరణ చేస్తూ అసెంబ్లీలో సోమవారం తెలంగాణ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు-2026ను ఆయన సీఎం రేవంత్‌రెడ్డి తరపున ప్రవేశపెట్టారు. పలువురు సభ్యులు మాట్లాడిన అనంతరం సభ ఏకగ్రీవంగా ఈ బిల్లును ఆమోదించింది. వర్సిటీకి మన్మోహన్‌సింగ్ పేరు పెట్టేందుకు కూడా ఆమోదం లభించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

"క్షేత్రస్థాయి పరిశీలనతో కూడిన విద్య ఈ వర్సిటీలో సాధ్యమవుతుంది. ప్రస్తుతమున్న బీటెక్ కోర్సులతోపాటు కొత్తగా బీఎస్సీ జియాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఎమ్మెస్సీ కోర్సులను ప్రవేశపెట్టాం. విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, పీజీ కళాశాలల సమస్యల పరిష్కారానికి త్వరలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తాం" అని ప్రకటించారు.

## ఆచార్యులు లేకుండా.. వసతులు కల్పించకుండా ఏం ఉపయోగం?: అక్బరుద్దీన్

భూవిజ్ఞాన వర్సిటీ బిల్లుపై ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ మాట్లాడుతూ... ఉన్నత విద్యామండలి సమగ్ర నివేదిక ఆధారంగా వర్సిటీని స్థాపించామని చెబుతున్నా, ఆ నివేదికను ఎందుకు ప్రజలకు అందుబాటులో ఉంచలేదని ప్రశ్నించారు. "ఆచార్యులు లేరు.. వసతులు కల్పించలేదు.. పేరుకే వర్సిటీలు పెట్టుకొని ఉపయోగమేంటి? ఇలాగైతే యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయి? నాణ్యమైన విద్యను అందించకుంటే యువత విదేశాలకు వెళ్తుంది. డిగ్రీలోనూ కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలి. విద్యార్థుల ఆత్మహత్యలు జరగకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలి. వర్సిటీలు, డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఎన్నో సమస్యలున్నాయి. వాటిపై చర్చించేందుకు ప్రభుత్వం సమావేశం నిర్వహించాలి" అని సూచించారు. సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... భూవిజ్ఞాన వర్సిటీలో వెంటనే ఆచార్యులను నియమించాలన్నారు. భాజపా సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక్క వర్సిటీ లేదని, కుమురంభీం పేరిట ఏర్పాటు చేయాలని కోరారు. ఆదినారాయణ(అశ్వారావుపేట), పాయం వెంకటేశ్వర్లు(పినపాక) సైతం బిల్లుపై మాట్లాడారు.

వార్త, హైదరాబాద్, మంగళవారం 6, జనవరి 2026

# డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి చట్టబద్ధత

## తెలంగాణ వర్సిటీల చట్ట సవరణ బిల్లు 2026కు శాసన సభ ఆమోదం

## రాష్ట్ర జిఎస్‌టి సవరణ బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి జూపల్లి కృష్ణారావు

## మద్యం తయారీలో వినియోగించే ఇఎన్ఎపై జిఎస్‌టి మినహాయింపు

## కేంద్ర చట్టాలకు అనుగుణంగా రాష్ట్రచట్టంలో మార్పులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 5:** తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీకి చట్టబద్ధత లభించనుంది. కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి చట్టబద్ధత కల్పించడం కోసం తెలంగాణ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు2026కు శాసనసభ సోమవారం ఆమోదం తెలిపింది. సోమవారం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రశ్నోత్తరాలు ముగియగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున సభలో యూనివర్సిటీల చట్టసవరణ బిల్లును వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రవేశ పెట్టారు. గతేడాది డిసెంబర్‌లో యూనివర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూనివర్సిటీని ప్రారంభిన విషయం తెలిసిందే. ఖనిజ సంపదకు నెలవైన కొత్తగూడెం ప్రాంతాన్ని విద్యా హబ్‌గా మార్చే లక్ష్యంతో, ముఖ్యమంత్రి రేవంత్ గతేడాది డిసెంబర్‌లో ప్రారంభించిన "డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ" కి శాశ్వత ప్రాతిపదికన చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ మేరకు 'తెలంగాణ యూనివర్సిటీల

>>2

## యూనివర్సిటీకి చట్టబద్ధత

>> చట్టం1991'ని సవరిస్తూ రూపొందించిన బిల్లును ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి తరఫున, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శాసనసభలో ప్రవేశపెట్టారు. 1978లో స్థాపించిన కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్ (తర్వాతి కాలంలో ఇంజనీరింగ్ కాలేజీ)ని అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 2025లో సీఎం చేతుల మీదుగా ప్రారంభమైన ఈ వర్సిటీకి, తాజా చట్ట సవరణ ద్వారా పూర్తి అటానమీ (స్వయంప్రతిపత్తి) లభించనుంది. దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ సేవలకు నివాళిగా ఈ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టడం జరిగింది. యూనివర్సిటీ అభివృద్ధికి వచ్చే రెండేళ్లలో రూ. 500 కోట్లు కేటాయిస్తామని, యూనివర్సిటీ విస్తరణ కోసం 310 ఎకరాల భూమి అందుబాటులో ఉందన్నారు. ప్రపంచంలో ఎర్త్ సైన్సెస్ కోసం ప్రత్యేక వర్సిటీలు ఉండడం చాలా అరుదన్నారు. సింగరేణి గనులు, గోదావరి నది, అటవీ సంపద ఉన్న కొత్తగూడెం ప్రాంతం విద్యార్థులకు ఒక "లివింగ్ లాబొరేటరీ" గా మారుతుందని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనతో కూడిన విద్య ఇక్కడ సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. .ప్రస్తుతం ఉన్న బీటెక్ కోర్సులతో పాటు, కొత్తగా బీఎస్సీ (జియాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్స్), ఎంఎస్సీ కోర్సులను ప్రవేశపెట్టనున్నట్టు మంత్రి సభకు తెలిపారు. చట్టబద్ధత వల్ల యూనివర్సిటీకి సొంతంగా కరికులమ్ రూపొందించుకునే స్వేచ్ఛ, యూజీసీ నిధులు, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు (ఎంఓయు) కుదుర్చుకునే అవకాశం లభిస్తుందన్నారు. సింగరేణి ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, తెలంగాణను మైనింగ్, జియాలజీ రంగాల్లో గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టేందుకే ఈ యూనివర్సిటీని స్థాపించినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ సభకు వివరించారు. చట్టసవరణపై [illegible] పక్ష నేత అక్బరుద్దీన్ మాట్లాడుతూ యూనివర్సిటీలో కొత్త కోర్సులను ఏర్పాటు చేయాలని, మార్కెట్‌కి అనుగుణంగా కోర్సులను రూపొందించాలన్నారు. సిపిఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు సంతోషకరమన్నారు. వర్సిటీ నిర్వహణలో ఇబ్బందులు రాకుండా, నిధులుఏర్పాటు చేయాలనిసిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్, మంగళవారం 6 జనవరి 2026

# మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి చట్టబద్ధత

## యూనివర్సిటీల చట్టసవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : నిరుడు డిసెంబర్‌లో ప్రారంభించిన 'మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ'కి రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన చట్టబద్ధత కల్పిస్తూ తెలంగాణ యూనివర్సిటీల చట్టసవరణ బిల్లు–2026కు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా 'తెలంగాణ యూనివర్సిటీల చట్టం–1991'ని సవరిస్తూ రూపొందించిన బిల్లును సీఎం, విద్యాశాఖ మంత్రి రేవంత్‌రెడ్డి తరపున ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 1978లో స్థాపించిన కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. తాజా చట్టసవరణతో వర్సిటీకి స్వయంప్రతిపత్తి లభిస్తుందని పేర్కొన్నారు. వర్సిటీ విస్తరణకు 310 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నదని, రానున్న రెండేండ్లలో రూ.500 కోట్లు కేటాయించనున్నట్టు తెలిపారు.

### మూడు బిల్లులకు మండలి ఆమోదం

శాసనమండలిలో సోమవారం మూడు సవరణ బిల్లులు ఆమోదం పొందాయి. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క.. తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ బిల్లు–2026, తెలంగాణ పంచాయతీరాజ్ రెండో సవరణ బిల్లు–2026 బిల్లులను ప్రవేశపెట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలంగాణ రెగ్యులేషన్ ఆఫ్ అపాయింట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ సర్వీస్ అండ్ రేషనలైజేషన్ ఆఫ్ స్టాఫ్ ప్యాట్రన్ అండ్ పే స్ట్రక్చర్ రెండో సవరణ బిల్లు–2026ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లులపై జరిగిన చర్చలో ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, నెల్లికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
గురువారం
1-1-2026

# ఉన్నత విద్యలో నవ చైతన్యం

- కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలతో ముందుకు..
- ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి
- ప్రధాన అంశంగా సీట్లు, కోర్సుల హేతుబద్ధీకరణ
- పారిశ్రామిక భాగస్వామ్యం ఏర్పాటు చేసుకునేలా కృషి



బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందుకెళ్తామని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఉన్నత విద్యలో నవ చైతన్యానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గుణాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నట్టు ప్రకటించారు. పాలనాపరమైన మార్పులు, నైపుణ్యంతో కూడిన ఉన్నత విద్యా కోర్సులకు 2026 శ్రీకారం చుట్టబోతోందని చెప్పారు. 2026కు సంబంధించిన మండలి



ప్రణాళికలను బాలకిష్టారెడ్డి బుధవారం మీడియాకు వివరించారు.

**ఇంగ్లిష్ తేలికగా నేర్చుకునేలా..**

'మండలి వెబ్‌సైట్‌ను సరళీకరించాం. ప్రతీ విద్యార్థి సులభంగా ఉన్నత విద్య సమాచారం తెలుసుకునే ఏర్పాట్లు చేశాం. ఉద్యోగ ప్రయత్నంలో స్పోకెన్ ఇంగ్లిష్ ప్రధాన సమస్యగా ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని స్థాయిల్లోనూ ఇంగ్లిష్‌ను తేలికగా నేర్చుకునేందుకు పీడీఎఫ్ రూపంలో నిపుణుల చేత ఇంగ్లిష్ పాఠ్యాంశాలను తయారు చేశాం. 2026లో ఇవన్నీ విద్యార్థులకు మరింత చేరువ కాబోతున్నాయి.

**కోర్సుల హేతుబద్ధీకరణ**

2026లో సీట్లు, కోర్సుల హేతుబద్ధీకరణ ప్రధాన అంశంగా ఉంటుంది. డిమాండ్ ఉన్న కోర్సులేంటి? ఉపాధి అవకాశాలు పెంచే కొత్త కోర్సులేంటి? ప్రతి కోర్సులోనూ ఆధునీకరణ తేవడం ఎలా? అనేదానిపై కొన్ని నెలలుగా జరిగిన కసరత్తుకు సంబంధించిన ఆవిష్కరణ కొత్త సంవత్సరంలో ఉండొచ్చు. సంప్రదాయ డిగ్రీ కోర్సులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మేళవించి, అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా తీసుకెళ్ళే లక్ష్యానికి కూడా ఈ కొత్త ఏడాది వేదిక కాబోతోంది. ప్రతి ఉన్నత విద్యాసంస్థకు న్యాక్ గుర్తింపు కోసం అన్ని స్థాయిల్లోనూ ప్రయత్నం చేయడం లక్ష్యంగా నిర్దేశించుకున్నాం..'అని బాలకిష్టారెడ్డి చెప్పారు.

**నైపుణ్యం పెంపుపై ప్రత్యేక దృష్టి**

'ఇంజనీరింగ్‌తో పాటు సాధారణ డిగ్రీలో కూడా నైపుణ్యమే ఉపాధికి గీటురాయి. ఈ నేపథ్యంలో స్కిల్‌ను పెంచే దిశగా చేస్తున్న ప్రయత్నాలు 2026లో మరింత వేగం పుంజుకుంటాయి. ప్రతి ఉన్నత విద్యాసంస్థ ఈ దిశగా పారిశ్రామిక భాగస్వామ్యం ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యేకంగా కృషి చేయబోతున్నాం. ఇందుకు అనుగుణంగా సిలబస్‌లో కూడా మార్పు చేశాం. ఏఐ ఆధారిత సాంకేతికతను సిలబస్‌లోకి తీసుకొచ్చాం. 2026లో విద్యార్థులకు సరికొత్త బోధనాంశాలు అందించే ప్రయత్నం చేస్తున్నాం..'అని మండలి చైర్మన్ వివరించారు.

ఆంధ్రజ్యోతి 2026 హైదరాబాద్ ● గురువారం 1 జనవరి 2026

## ఉన్నత విద్యలో సంస్కరణలు

▸ డిగ్రీ, పీజీ కోర్సుల సిలబస్ సమీక్షించాలి: కె.కేశవరావు

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యారంగంలో సమూల మార్పులు చేపట్టాలని, ఉపాధి కల్పనే లక్ష్యంగా కోర్సులు ఉండాలని తెలంగాణ విద్యావిధానం కోసం ఏర్పాటైన కమిటీ చైర్మన్ కె.కేశవరావు సూచించారు. డిగ్రీ, పీజీతోపాటు అన్ని స్థాయిల్లో కోర్సులను సమీక్షించాలని, నైపుణ్య శిక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలని అభిప్రాయపడ్డారు. సచివాలయంలోని తన కార్యాలయంలో బుధవారం విద్యాశాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. టెక్నాలజీలో వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా పాఠ్యాంశాల్లో మార్పులు చేయాలని సూచించారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా మాట్లాడుతూ.. ఈనెల 5లోపు ఉన్నత విద్యలో అన్ని కోర్సుల సిలబస్‌పై నివేదిక ఇవ్వాలని సమావేశంలో పాల్గొన్న అధికారులను ఆదేశించారు. అన్ని కోర్సుల్లో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేయాలని, చదువులో అత్యంత ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు అదే తరగతిలో పాఠాలు బోధించే అవకాశం కల్పించాలన్నారు. ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ డిఫెన్స్, ఏరోస్పేస్ వంటి రంగాల్లో భారీ ఉపాధి అవకాశాలను యువత చేజిక్కించుకునేలా కార్యాచరణ అమలు చేయనున్నామన్నారు.

## ప్రొఫెసర్లకు త్వరలో పదోన్నతులు

**జేఎన్‌టీయూ వీసీ టీకేకే రెడ్డి**

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్)కింద ఇటీవల ఇంటర్వ్యూలకు హాజరైన ఆచార్యులకు త్వరలోనే పదోన్నతి లెటర్లు అందజేస్తామని జేఎన్‌టీయూ వైస్‌చాన్సలర్ టీకేకే రెడ్డి తీపికబురు చెప్పారు. న్యూఇయర్ వేడుకలను పురస్కరించుకొని వర్సిటీ ప్రాంగణంలో బుధవారం ఎట్‌హోమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అధికారిక క్యాలెండర్, డైరీని వీసీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విశ్వవిద్యాలయంలో గతేడాది ప్రవేశపెట్టిన కొత్త కోర్సులు విద్యార్థులకు కొత్త అవకాశాలను, అధ్యాపకులకు అకాడమిక్ ఎక్స్ఛేంజ్ మార్గాలను తెరుస్తాయని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాళ్లు నర్సింహారెడ్డి, సింధు, డైరెక్టర్లు బాలునాయక్, వసుమతి, శ్రీదేవి, సుష్మ, అనితా, తారాకళ్యాణి, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## జేఎన్‌టీయూలో గేట్ ఇంటెన్సివ్ కోచింగ్ ఉచితం

● బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు న్యూ ఇయర్ కానుక

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాలల్లో బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు ఉన్నతాధికారులు తీపికబురు చెప్పారు. గ్రాడ్యుయేటెడ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్)-2026 పరీక్ష రాయాలనుకునే విద్యార్థులకు ఉచిత కోచింగ్ రూపంలో నూతన సంవత్సరం కానుకను అందజేస్తున్నారు. ప్రముఖ శిక్షణా సంస్థ ఏస్ అకాడమీ సౌజన్యంతో ఈ ఉచిత శిక్షణను జేఎన్‌టీయూ విద్యార్థులకు అందిస్తోందని వర్సిటీలోని ఎస్సీ ఎస్టీ సెల్ సమన్వయకర్త క్రాంతికిరణ్ తెలిపారు. ఏస్ అకాడమీ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా నిష్ణాతులైన ఆచార్యులతో గేట్ శిక్షణను అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉచిత గేట్ శిక్షణను పొందాలనుకునే అభ్యర్థులు వర్సిటీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లోని ఎస్సీఎస్టీసెల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

ప్రభాత
వెలుగు
గురువారం | హైదరాబాద్
01.01.2026
www.v6velugu.com

# కాలం చెల్లిన సిలబస్‌ను పక్కనపెడ్తం

## హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్‌లో మార్పులు తీసుకొస్తం: బాలకిష్టారెడ్డి

- డిగ్రీ సిలబస్‌లో ఏఐ సబ్జెక్టులు
- ఇంగ్లీష్ భయం పోగొట్టేలా మెటీరియల్ రెడీ చేశామని వ్యాఖ్య



**హైదరాబాద్, వెలుగు:** కొత్త ఏడాదిలో ఉన్నత విద్యా విధానంలో మార్పులు తీసుకొస్తామని, కాలం చెల్లిన సిలబస్‌ను పక్కనపెట్టి.. మార్కెట్‌కు అవసరమైన సబ్జెక్టులను అందుబాటులోకి తెస్తామని తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోకి తెచ్చేలా సర్కార్‌కు ప్రతిపాదనలు పంపామని వివరించారు. కొత్త ఏడాదిలో ఈ విధానం అమల్లోకి వస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన రిలీజ్ చేశారు. "ఉద్యోగాల సాధనలో గ్రామీణ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ ప్రధాన అడ్డంకిగా మారుతున్నది. ఈ భయాన్ని పోగొట్టేందుకు నిపుణులతో సులభమైన పద్ధతిలో ఇంగ్లీష్ పాఠ్యాంశాలను రూపొందించాం. వీటిని పీడీఎఫ్ రూపంలో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతాం. 2026లో ఈ మెటీరియల్‌ను విద్యార్థులకు మరింత చేరువ చేస్తాం. వెబ్‌సైట్‌ను కూడా స్టూడెంట్లకు ఈజీగా అర్థమయ్యేలా మారుస్తాం" అని బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు.

**కోర్సుల కుదింపు తప్పదు**

దోస్త్ ద్వారా డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియలో నిరుడు ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రేషనలైజేషన్ చేపడుతున్నట్లు బాలకిష్టారెడ్డి చెప్పారు. "సీట్లు మిగిలిపోవడానికి గల కారణాలను విశ్లేషించాం. డిమాండ్ లేని కోర్సులు, జీరో అడ్మిషన్లు ఉన్న కాలేజీలపై అకడమిక్ ఆడిట్ తర్వాత కఠిన నిర్ణయాలు ఉంటాయి. కోర్సులు, సీట్ల రేషనలైజేషన్ 2026లో ప్రధాన ఎజెండాగా ఉంటది. డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్లు పెంచడం, లేని వాటిని తగ్గించడంపై ఫోకస్ పెడతాం. సంప్రదాయ డిగ్రీ కోర్సులను ఆధునిక టెక్నాలజీతో లింక్ చేస్తాం. సిలబస్‌లో ఏఐ ఆధారిత పాఠ్యాంశాలను చేర్చాం. ఇవి 2026 నుంచి అమల్లోకి వస్తాయి. స్టూడెంట్లకు నచ్చేలా భవిష్యత్‌లో ఉపాధి దొరికే కోర్సులకే ప్రయారిటీ ఇస్తాం. భవిష్యత్తులో ప్రతి కాలేజీకి 'న్యాక్' గుర్తింపు కీలకం కానున్నది. అందుకే 2026ను 'న్యాక్ గుర్తింపు సాధన లక్ష్య సంవత్సరం'గా నిర్దేశించుకున్నాం" అని బాలకిష్టారెడ్డి తెలిపారు. అలాగే, ఇండస్ట్రీ అవసరాలకు తగ్గట్టుగా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ప్రతి కాలేజీ పారిశ్రామిక సంస్థలతో టైఅప్ అయ్యేలా ప్రోత్సహిస్తామని చెప్పారు.

హైదరాబాద్, గురువారం 1 జనవరి 2026 నమస్తే తెలంగాణ

బీఈడీ, డీఎడ్‌కు

# కొత్త సిలబస్

హైదరాబాద్, డిసెంబర్ 31 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో టీచర్ ఎడ్యుకేషన్ కోర్సులైన బీఎడ్, డీఎడ్ కోర్సుల సిలబస్ మార్చాలని సర్కారు నిర్ణయించింది. ఈ రెండు కోర్సులకు కొత్త సిలబస్ రూపొందించాలని నిర్ణయించింది. బుధవారం సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ బాధ్యతను తెలంగాణ ఉన్నత విద్యామండలికి అప్పగించారు. ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి, పలు వర్సిటీల వీసీలు సమావేశంలో పాల్గొన్నారు. ఇక రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీలు, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు (ఏటీసీ)గా అప్‌గ్రేడ్ చేయనుండగా, ఈ అంశంపై టీసీఎస్ ప్రతినిధులు సమావేశంలో ప్రజెంటేషన్ ఇచ్చారు. పాలిటెక్నిక్ కోర్సుల సిలబస్‌ను సైతం మార్చాలని, స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, ఇంటర్న్‌షిప్‌లను ప్రోత్సహించాలని నిర్ణయించారు.

# డిగ్రీ సిలబస్‌లో భారీ మార్పులు: బాలకిష్టారెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 31 (నమస్తే తెలంగాణ) : కార్పొరేట్ సామాజిక బాధ్యత తరహాలో అకాడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (ఏఎస్ఆర్)ను విస్తృతంగా ప్రోత్సహిస్తామని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి తెలిపారు. అన్ని స్థాయిల్లో అకాడమిక్ ఆడిటింగ్ చేపడుతామని పేర్కొన్నారు. నైపుణ్యాధారిత విద్యా కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. డిగ్రీ కోర్సుల్లో భారీగా సీట్లు మిగులుతున్నాయని, రేషనలైజేషన్‌ను చేపడుతామని వెల్లడించారు. బీటెక్ యాజమాన్య కోటా సీట్లను ఆన్‌లైన్‌లో భర్తీచేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

నవతెలంగాణ
గురువారం 1 జనవరి 2026

# డిగ్రీ సిలబస్ లో మార్పులు

• ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ సిలబస్‌లో మార్పులు చేయనున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2026 సంవత్సరంలో పాలనాపరమైన సంస్కరణలు, నైపుణ్యాధారిత ఉన్నత విద్యా కోర్సులను తీసుకురానున్నట్టు తెలిపారు. అకడమిక్ ఆడిట్‌ను వేగవంతం చేస్తామనీ, దోస్త్ ద్వారా సకాలంలో సీట్లను భర్తీ చేస్తామనీ, అన్ని కోర్సుల్లోనూ వేగంగా కౌన్సిలింగ్ చేపడుతామనీ, ఇంజినీరింగ్ యాజమాన్య కోటా సీట్ల భర్తీని ఆన్‌లైన్‌లో చేస్తామని వెల్లడించారు. మండలి వెబ్‌సైట్‌ను మరింత సరళీకరించి ఉన్నత విద్య సమాచారాన్ని విద్యార్థులు సులభంగా పొందేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. దోస్త్‌లో గతంలో మాదిరిగా సీట్లు మిగిలిపోకుండా కోర్సులు, సీట్ల హేతుబద్ధీకరణ ప్రధాన ఎజెండాగా తీసుకుంటామని వెల్లడించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.

ఈనాడు గురువారం జనవరి 1, 2026

# నైపుణ్య శిక్షణతో ఉద్యోగ గ్యారెంటీ

- డిసెంబరు నాటికి వెయ్యిమందికి విజయవంతంగా శిక్షణ
- 2026-27 ఏడాదికి యంగ్ ఇండియా నైపుణ్య వర్సిటీలో మూడు డిగ్రీ, ఒక పీజీ కోర్సు



కొనసాగుతున్న నైపుణ్య వర్సిటీ పనులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నెలకొల్పిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ యువత ఉద్యోగ భవితకు కీలకంగా మారుతోంది. ఉద్యోగ గ్యారెంటీ లక్ష్యంగా పారిశ్రామిక అవసరాలకు తగినట్లు డిగ్రీ, డిప్లొమా, పీజీ చదివిన విద్యార్థుల కోసం నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఐఐటీ హైదరాబాద్ తాత్కాలిక క్యాంపస్‌లో శిక్షణ కోర్సులు నిర్వహిస్తూ.. నూతన ఏడాదికి కార్యాచరణ సిద్ధం చేసింది. స్వల్పకాలిక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలతో పాటు మూడు డిగ్రీ, ఒక పీజీ కోర్సును 2026-27 నుంచి అందుబాటులోకి తీసుకురానుంది. డిగ్రీలు కాదు.. జాబ్ గ్యారెంటీ లక్ష్యంతో ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ డిసెంబరు నాటికి వెయ్యి మంది యువతకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలకు మార్గం చూపింది. లాజిస్టిక్స్, హెల్త్‌కేర్, లైఫ్‌సైన్సెస్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్, ప్రొఫెషనల్ సర్వీసులు, ఇన్ఫర్మేషన్ సైన్స్, లైఫ్‌స్కిల్స్ పేరిట ఏడు స్కూల్స్ ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చింది.

## వచ్చే ఆర్థిక సంవత్సరంలో...

✦ రానున్న ఆర్థిక సంవత్సరంలో ఫార్మా కంపెనీలతో కలిసి బీఎస్సీ అప్లైడ్‌లైఫ్ సైన్సెస్ ప్రొడక్షన్, ఏఐజీ హాస్పటల్స్‌తో కలిపి బీఎస్సీ న్యూక్లియర్ మెడిసిన్, బీబీఏ, హైదరాబాద్‌లోని ఫార్మా కంపెనీలతో కలిపి ఎంబీఏ లైఫ్‌సైన్సెస్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

✦ ఆర్థిక సేవల సంస్థలు, లాజిస్టిక్స్, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రికల్స్, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సైన్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫినిషింగ్ స్కూల్, లైఫ్ స్కిల్స్ తదితరాల్లో స్వల్పకాల వ్యవధి కోర్సులు నిర్వహించనుంది.

✦ వివిధ జిల్లాల్లో ఎంపిక చేసిన నైపుణ్యాల్లో శిక్షణ, ఈ కార్యక్రమాలను విస్తరించేందుకు అనుబంధ సంస్థల గుర్తింపు.. పాఠశాల విద్యార్థుల్లో అభిరుచులు గుర్తించేలా ప్రత్యేక మాడ్యూల్స్, ఇంటర్ విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమాలు, రాష్ట్రవ్యాప్తంగా సాఫ్ట్‌స్కిల్స్ శిక్షణ, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా శిక్షకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనుంది.

## అతి పెద్ద ల్యాబ్...

ఫ్యూచర్‌సిటీలో ఏర్పాటు చేయనున్న శాశ్వత క్యాంపస్‌లో 84వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అతిపెద్ద ల్యాబ్ రానుంది. పరిశ్రమలకు అక్కడే స్థలాన్ని కేటాయించడంతో పాటు శిక్షణ కార్యక్రమాలు, ప్రాక్టికల్ నైపుణ్యాలు అందించేలా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో ఇప్పటికే మైక్రోసాఫ్ట్, స్విగ్గీ, ఏఐజీ హాస్పిటల్స్, టెక్‌మహీంద్రా ఆసక్తి చూపించగా, ఆ సంస్థలకు 22 వేల చ.అ. స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది.

## వేగంగా క్యాంపస్ నిర్మాణ పనులు

2024 ఆగస్టు 1న సీఎం రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీకి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో ఇది కొనసాగుతోంది. వర్సిటీకి సీఎం రేవంత్‌రెడ్డి ఛాన్సలర్. నిర్వహణను పారిశ్రామికవేత్తలు, ప్రముఖులతో కూడిన బోర్డు పర్యవేక్షిస్తోంది. ఈ వర్సిటీకి ప్రస్తుతం డాక్టర్ వీఎల్‌వీఎస్ఎస్ సుబ్బారావు వీసీగా ఉన్నారు. హైదరాబాద్ ఫ్యూచర్‌సిటీ కందుకూరు మండలంలో 57.8 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. తొలిదశ క్యాంపస్ ఈ ఏడాది మార్చి నాటికి అందుబాటులోకి రానుంది. మొత్తం 43 తరగతి గదులు, 600 పడకల వసతిగృహం, లాబొరేటరీ బ్లాక్, డైనింగ్‌హాల్ తదితర సదుపాయాలున్నాయి. క్యాంపస్ నిర్మాణ పనులు చేపట్టేందుకు మేఘా సంస్థ ముందుకొచ్చింది.

# వ్యవసాయ వర్సిటీపై పన్ను పిడుగు

- రూ.273 కోట్లు చెల్లించాలని ఐటీ శాఖ నోటీసులు
- సహకార చట్టం కింద రిజిస్టర్ చేయడమే కారణం..
- 50 పాన్ కార్డులతో ఆర్థిక కార్యకలాపాలు
- నియామకాలు, చెల్లింపుల్లో అక్రమాలు
- తాజా ఆడిట్‌తో వెలుగులోకి.. ప్రభుత్వానికి నివేదిక

ఈనాడు, హైదరాబాద్: ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంపై ఆదాయ పన్ను పిడుగు పడింది. రూ.273 కోట్ల పన్ను చెల్లించాలని వర్సిటీకి ఆదాయ పన్నుశాఖ నోటీసులు జారీ చేసింది. విశ్వవిద్యాలయ చట్టం కింద కాకుండా సహకార చట్టం కింద సొసైటీగా రిజిస్ట్రేషన్ చేయించడమే దీనికి కారణమని తేలింది. 2016-17 నుంచి 2019-20 ఆర్థిక సంవత్సరాల వరకు మొత్తం పన్ను బకాయిలు చెల్లించాలని ఐటీ నోటీసులు ఇచ్చినట్లు అకౌంటెంట్ జనరల్ నిర్వహించిన ఆడిట్‌లో తేలింది. వర్సిటీ పాలకమండలిలో ఆది నుంచీ పనిచేసిన ఉన్నతాధికారుల నిర్వాకమే దీనికి కారణమని ఆడిట్ నివేదిక పేర్కొంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత.. 2015లో వర్సిటీ మొత్తాన్ని సొసైటీగా రిజిస్టర్ చేశారు. దానికి అప్పటి వైస్ ఛాన్సలర్, పీజీ విద్యావిభాగం డీన్, విద్యార్థి విభాగం డీన్, పరిశోధన విభాగం డైరెక్టర్, కంప్ట్రోలర్, ఇద్దరు అసిస్టెంట్ కంప్ట్రోలర్లు.. మొత్తం ఏడుగురితో కార్యవర్గం ఏర్పడింది. ప్రస్తుత పాలకమండలి.. ఐటీ నోటీసుల విషయాన్ని అకౌంటెంట్ జనరల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఇటీవల ఆడిట్ నిర్వహించారు. ఇన్నేళ్లలో పలు అవకతవకలు జరిగాయని ఆడిట్‌లో గుర్తించారు. ఈ నివేదికను ప్రస్తుత వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య... రాష్ట్ర ప్రభుత్వానికి, ఛాన్సలర్ అయిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు సమర్పించినట్లు తెలిసింది.

### ఆడిట్‌లో గుర్తించిన అంశాలివీ

◆ 50 పాన్ కార్డులతో వర్సిటీ ఆర్థిక లావాదేవీలు నిర్వహించారు. ఎప్పటికప్పుడు ఐటీ నోటీసులొచ్చినా పన్ను చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి.

◆ కీలకమైన రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ తదితర పోస్టులను పూర్తిస్థాయి ప్రొఫెసర్లతో భర్తీ చేయకుండా, తాత్కాలిక ఇన్‌ఛార్జి అధికారులను మూడు నెలల వ్యవధిలో నియమిస్తూ.. కొనసాగించారు.

◆ ఉన్నత పదవుల్లోని వారు విశ్వవిద్యాలయ అధికారిక గృహాల్లో నివసిస్తూ.. నెలనెలా అద్దెభత్యం కూడా పొందారు. ఇలా కేవలం ఒక్క వ్యక్తే రూ.44 లక్షలు తీసుకున్నారు.

◆ ఒక ఉన్నతాధికారి పదవీ విరమణ అనంతరం... నిబంధనలకు విరుద్ధంగా ఆయన పదవీ కాలాన్ని మూడేళ్లపాటు పొడిగించగా.. ఆయన అదనంగా రూ.38 లక్షలు పొందారు.

◆ పాలకమండలిలో పనిచేసిన అధికారి అద్దె వాహనం కోసం రూ.61 లక్షలు అక్రమంగా తీసుకున్నారు.

◆ వర్సిటీలో చేపట్టిన ఇంజినీరింగ్ పనుల రికార్డులు లేవు. కొత్తగా నిర్మించిన ఒక కళాశాల నిర్మాణ అంచనాలను రూ.30 కోట్ల నుంచి రూ.76 కోట్లకు పెంచారు.

◆ విశ్వవిద్యాలయంలో భూములు, భవనాలను కొన్ని ప్రైవేటు సంస్థలకు లీజుకిచ్చారు. వర్సిటీకి ప్రయోజనం లేకున్నా.. గడువు ముగిసిపోయాక కూడా కొనసాగిస్తున్నారు.

◆ వర్సిటీ కనిపెట్టిన పలు వంగడాలు, పరిశోధనల రికార్డులు లభ్యం కాలేదు.

◆ పలువురు పోలీసు, ప్రభుత్వ అధికారులకు క్వార్టర్ల కేటాయింపును సైతం ఆడిట్ విభాగం తప్పుపట్టింది.

# జేఈఈ అడ్వాన్స్‌డ్.. 13 చోట్ల పరీక్షా కేంద్రాలు

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను తెలంగాణలో 13, ఆంధ్రప్రదేశ్‌లో 24 నగరాలు, పట్టణాల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐఐటీ రూర్కీ బుధవారం సమాచార పత్రాన్ని(ఇన్ఫర్మేషన్ బులెటిన్) విడుదల చేసింది. ఐఐటీల్లో బీటెక్ సీట్ల భర్తీకి మే 17వ తేదీన జేఈఈ అడ్వాన్స్‌డ్-2026ను నిర్వహించనున్న విషయం తెలిసిందే. గత ఏడాది దేశవ్యాప్తంగా 725 చోట్ల పరీక్ష నిర్వహించగా ఈసారి ఆ సంఖ్య 717కు తగ్గింది. జేఈఈ మెయిన్‌లో కనీస స్కోర్ సాధించిన 2.50 లక్షల మందికి మాత్రమే అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయడానికి అవకాశం ఇస్తారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల కోసం మొత్తం 10 నగరాలు/పట్టణాలకు ఆప్షన్ ఇచ్చుకోవాలి. ర్యాంకు వివరాలను విద్యార్థుల ఫోన్లకు పంపిస్తారు. ప్రస్తుత విద్యా సంవత్సరం దేశవ్యాప్తంగా 23 ఐఐటీల్లో 18,160 బీటెక్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(బీఎస్) సీట్లు అందుబాటులో ఉన్నాయి. వచ్చే విద్యా సంవత్సరం(2026-27)లో మరికొన్ని సీట్లు పెరిగే అవకాశముంది.

### పరీక్షా కేంద్రాలు

**తెలంగాణ(13):** ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, సత్తుపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్. **ఆంధ్రప్రదేశ్(24):** శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, అమలాపురం, అనంతపురం, భీమవరం, చీరాల, చిత్తూరు, ఏలూరు, గుడ్లవల్లేరు, గూడూరు, కడప, కాకినాడ, కర్నూలు, మార్కాపురం, మైలవరం, నరసరావుపేట, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, సూరంపాలెం, తాడేపల్లిగూడెం, తిరుపతి, విజయవాడ.

# కొత్త సంవత్సరంలో నైపుణ్యాభివృద్ధి చర్యలకు పెద్దపీట

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి



ఈనాడు, హైదరాబాద్: కొత్త సంవత్సరంలో ఉన్నత విద్యలో నైపుణ్యాభివృద్ధి చర్యలను వేగవంతం చేస్తామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గుణాత్మక మార్పులకు శ్రీకారం చుడతామని... పాలనాపరమైన సంస్కరణలు, నైపుణ్యాధారిత ఉన్నత విద్యా కోర్సులను అధికంగా తీసుకొస్తామని వివరించారు. ప్రతి కోర్సును ఇప్పటి అవసరాలకు అనుగుణంగా ఆధునికీకరించేందుకు గత కొన్ని నెలలుగా విస్తృతంగా కసరత్తు చేశామని, కొత్త ఏడాదిలో అమలు ప్రారంభమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమీప భవిష్యత్తులో ప్రతి ఉన్నత విద్యా సంస్థకు న్యాక్ గుర్తింపు తప్పనిసరి అవుతుందని, అందుకే 2026ను న్యాక్ గుర్తింపు సాధన లక్ష్య సంవత్సరంగా నిర్దేశించినట్లు ప్రకటించారు. ప్రతి కళాశాలను పరిశ్రమలతో కలిసి పనిచేసేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. అందుకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేసి... ఏఐ ఆధారిత సాంకేతికతను తీసుకొచ్చామన్నారు. బీటెక్ యాజమాన్య కోటా సీట్ల భర్తీని ఆన్‌లైన్ విధానంలో చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, అది కొత్త సంవత్సరంలో కార్యరూపం దాలుస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గురువారం । 1 । జనవరి । 2026
హైదరాబాద్ । www.sakshi.com

# ఐఐటీలకు బూస్ట్




## ఏఐకి అనుగుణంగా కోర్సుల్లో నాణ్యత తీసుకురావాలి

### సీట్లు, మౌలిక వసతులు పెంచాలంటున్న విద్యాసంస్థలు

### కేంద్ర ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదనలు

| దేశవ్యాప్తంగా ఎమర్జింగ్ కోర్సులకు డిమాండ్ | ఏఐ, డేటాసైన్స్‌కు పునాది వేసే ఇంటర్ డిసిప్లినరీ కోర్సుల అభివృద్ధి అవసరం | 2026–27 విద్యా సంవత్సరంలోనే కనీసం 2 వేల సీట్లు పెంచాలి | లేబొరేటరీలను ఉన్నతీకరించాలి.. హాస్టళ్లు పెంచాలి |
|---|---|---|---|

**క్యాంపస్ వెలుపల వసతితో బోధన, చదువుపై ప్రభావం • తక్షణమే చర్యలు తీసుకోవాలని ఐఐటీల వినతి**

సాక్షి, హైదరాబాద్: సీట్ల పెంపు, మౌలిక వసతుల కల్పన, కోర్సుల్లో నాణ్యత పెంపుతో దేశంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లను బలోపేతం చేయాలని ఆయా సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. దేశవ్యాప్తంగా ఐఐటీలకు డిమాండ్ పెరుగుతోందని, అందువల్ల సీట్లు గణనీయంగా పెంచాలని విజ్ఞప్తి చేశాయి. 2026–27 విద్యా సంవత్సరంలోనే కనీసం 2 వేల సీట్లు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) దూసుకొస్తున్న నేపథ్యంలో దేశంలో ఎమర్జింగ్ కోర్సులకు ప్రాధాన్యత పెరిగిందని పేర్కొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏఐతో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా కోర్సుల నాణ్యత పెంచాలని, లేబొరేటరీలను ఉన్నతీకరించాలని స్పష్టం చేశాయి. ఈ మేరకు మౌలిక వసతులు సైతం పెంచాలని ఐఐటీలు ఇటీవల కేంద్రానికి ప్రతిపాదించాయి. ఆయా అంశాలపై కేంద్రం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశాయి.

### ఏఐకి అనుగుణంగా మెరుగులు

'దేశంలో ఏఐపై విస్తృత పరిశోధన జరుగుతోంది. డేటా కేంద్రాల పరిధి పెరుగుతోంది. అంతర్జాతీయ ఏఐ సంస్థలు ఐఐటీల నైపుణ్యాన్ని పరిశీలిస్తున్నాయి. ఏఐఎంఎల్, డీప్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్, ఇన్‌డెప్త్ ప్రాజెక్టు ఇంటర్న్‌షిప్‌పై దృష్టి పెడుతున్నాయి. ఏఐ, డేటాసైన్స్‌కు బలమైన పునాది వేసే ఇంటర్ డిసిప్లినరీ కోర్సుల అభివృద్ధి అవసరం పెరిగింది. ఈ మేరకు లేబొరేటరీలు

మిగతా 2వ పేజీలో ▶

**సీట్ల పెంపు ప్రతిపాదనలు ఇలా..**

ఏఐ ఆధారిత కంప్యూటర్ కోర్సులను కోర్ సీఎస్‌ఈకి అనుసంధానం చేసి కనీసం 800 సీట్లు పెంచాలని ఐఐటీలు సూచిస్తున్నాయి. మరో 400 సీట్లు డేటా సైన్స్‌లో కోరుతున్నాయి. మరో 800 సీట్లు ఇతర కంప్యూటర్ ఎమర్జింగ్ కోర్సులను తీసుకొచ్చి పెంచాలని కోరుతున్నాయి. మరోవైపు జాతీయ ఇంజనీరింగ్ కాలేజీలు (ఎన్ఐటీలు), కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఇంజనీరింగ్ సంస్థల్లో (జీఎఫ్‌టీఐలు) మొత్తం 62 వేలకు పైగా సీట్లున్నాయి. వీటిల్లో సైబర్ సెక్యూరిటీ, ఏఐ, డేటాసైన్స్ కోర్సులతో కూడిన కంప్యూటర్ కోర్సులను రీ డిజైన్ చేయాలని ఐఐటీలు సూచిస్తున్నాయి.

# ఐఐటీలకు 'బూస్ట్'

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేయడంతో పాటు, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది..' అని ఐఐటీలు కేంద్రానికి తెలిపాయి. పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో కూడా ఎగ్జిక్యూటివ్ పీజీ డిప్లొమా ఇన్ ఏఐ, డేటాసైన్స్ లాంటి కోర్సులు పెంచాలని ఐఐటీ ముంబై సూచించింది. 120 గంటల హైబ్రిడ్ ఏఐ కోర్సులను అందించే దిశగా ఐఐటీ కాన్పూర్ ప్రణాళిక సిద్ధం చేసింది. కొన్నిచోట్ల ప్రైవేటు, ప్రభుత్వ సమన్వయంతో ముందుకెళ్ళే ప్రతిపాదనలు కూడా ముందుకు తెచ్చాయి.

**ప్రధాన సమస్యగా హాస్టళ్ల కొరత..**

ఐఐటీల్లో ప్రస్తుతం హాస్టళ్ల కొరత ప్రధాన సమస్యగా మారింది. విద్యార్థుల సంఖ్య వేగంగా పెరగడం, వసతి సదుపాయాల విస్తరణ ఆ స్థాయిలో జరగకపోవడమే దీనికి మూల కారణం. గత పదేళ్ళుగా ఐఐటీల్లో అండర్ గ్రాడ్యుయేట్, పీజీ, పీహెచ్‌డీ సీట్లు భారీగా పెరిగాయి. 2008 తర్వాత ఏర్పడిన కొత్త ఐఐటీలకు ఇంకా క్యాంపస్‌ల నిర్మాణం పూర్తవ్వలేదు. ఫ్యాకల్టీ, రీసెర్చ్ స్కాలర్లకు కూడా వసతి అవసరమవుతోంది. హాస్టల్ ప్రాధాన్యత విద్యార్థులకే కాకుండా పరిశోధకులకు కూడా ఉండటం వల్ల ఒత్తిడి పెరుగుతోంది. నిధులు, భూసేకరణ, నిర్మాణ ఆలస్యాలు, కేంద్రం నిధుల విడుదలలో జాప్యం తదితరాలు కూడా కారణమవుతున్నాయి. ఐఐటీ విద్యార్థులు, ఫ్యాకల్టీకి క్యాంపస్ వెలుపల అద్దె గదులు తీసుకోవాల్సి రావడంతో ఖర్చు పెరుగుతోంది. బయట ఉండేవారి ప్రయాణ సమయం పెరగడం.. బోధన, చదువుపై ప్రభావం చూపుతోంది. మొదటి సంవత్సరం విద్యార్థులకు భద్రతపరమైన సౌకర్యాల సమస్య ఏర్పడుతోంది. టెక్నాలజీ అప్‌డేట్‌తో కూడుకున్న ఐఐటీ విద్యకు క్యాంపస్ హాస్టల్‌లోనే ఉండి చదువుకుంటేనే మంచి ఫలితాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఐఐటీల్లో 18,160 సీట్లు ఉన్నాయి. అయితే 12 వేల మందికి మాత్రమే ఐఐటీ ప్రాంగణాల్లో హాస్టల్ వసతి ఉండటం గమనార్హం. మిగతా విద్యార్థులను ప్రైవేటు వసతి గృహాల్లో ఉంచుతున్నారు.

**ఆ కోర్సులకే డిమాండ్..**

జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రస్తుతం 62,853 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 40 వేలకు పైగా కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లోనే ఉన్నాయి. గత నాలుగేళ్ళుగా ఏఐకి ప్రాధాన్యత పెరగడంతో కంప్యూటర్ కోర్సుల్లో సీట్లకు డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా పోస్టు-గ్రాడ్యుయేట్ కోర్సుల్లో డేటాసైన్స్, ఏఐఎంఎల్, ఎంబీడెడ్ సిస్టమ్స్, పవర్ సిస్టమ్స్, మాన్యుఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్‌కు డిమాండ్ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా ప్రతి ఏటా రాష్ట్రాల ఇంజనీరింగ్ కాలేజీలతో కలుపుకొని 16 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు బయటకు వస్తున్నారు. అయితే వీరిలో స్కిల్డ్ ఉద్యోగాలు పొందుతున్న వారు 9 శాతమే ఉంటున్నారు. ఐఐటీల్లో విద్యాబోధన ప్రమాణాలు మెరుగ్గా ఉంటున్నాయి కాబట్టి ఇక్కడ చదివిన విద్యార్థుల్లో 78 శాతం ఉపాధి పొందుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే ఐఐటీలు, ఎన్ఐటీల్లో సీట్ల పెంపుపై కొన్నేళ్ళుగా కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్తున్నాయి. ఈ క్రమంలో ఏఐ ఆధారిత కొత్త కోర్సుల మేళవింపుపై కేంద్ర స్థాయిలో చర్చ జరుగుతోంది.